VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి, నల్గొండ : గురువారం 11.06.2026
సంపుటి : 08 సంచిక : 02 , పేజీలు : 12 , వెల:రూ . 5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH
www.velthuru.com


12
అసెంబ్లీ సమావేశాలను తలపించిన టీనేజ్ బాలికల రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీ

# భవిష్యత్ తరాలకు ప్రపంచ స్థాయి నగరాన్ని అందించేందుకు "భారత్ ఫ్యూచర్ సిటీ" నిర్మాణం

- ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి
- భారత్ ఫ్యూచర్ సిటీలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ( FCDA) భవనాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**రంగారెడ్డి జిల్లా. వెలుతురు జూన్ 10:**

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, రేపటి తరాల కోసం ఈ రోజే పునాదులు వేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే నగరాన్ని నిర్మించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం "భారత్ ఫ్యూచర్ సిటీ" అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు.బుధవారం రంగారెడ్డి జిల్లాలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (FCDA) నూతన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరానికి గొప్ప చారిత్రక నేపథ్యం ఉందని, రెండు శతాబ్దాల క్రితం నగర విస్తరణతో హైదరాబాద్–సికింద్రాబాద్ జంట నగరాలుగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలుస్తోందని, రాష్ట్ర ఆదాయంలో గణనీయమైన వాటా ఈ ప్రాంతం నుంచే వస్తోందన్నారు. గతంలో నగరాభివృద్ధి కోసం తీసుకున్న దూరదృష్టి నిర్ణయాల ఫలితంగానే హైటెక్ సిటీ, అవుటర్ రింగ్ రోడ్డు, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, జీనోమ్ వ్యాలీ వంటి ప్రాజెక్టులు రూపుదిద్దుకుని లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించాయని తెలిపారు.1908 మూసీ వరదల అనంతరం నగర రక్షణ కోసం చేపట్టిన నిర్మాణాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ వంటి వ్యూహాత్మక అభివృద్ధి చర్యలు నగర ప్రగతికి పునాది వేశాయని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచానికి దిక్సూచిగా నిలిచే విధంగా, ఆధునిక మౌలిక సదుపాయాలు, పర్యావరణ హిత ప్రణాళికలు, సాంకేతిక ఆధారిత అభివృద్ధితో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంలో ఫ్యూచర్ సిటీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్, వరదలు, పట్టణ విస్తరణ వంటి సవాళ్లకు శాశ్వత పరిష్కారాలు అందించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాల సందర్భంగా ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నగర మౌలిక వసతులను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న ముఖ్యమంత్రి, చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రాజేంద్రనగర్, కూకట్‌పల్లి నల్ల చెరువు, అంబర్‌పేట్ బతుకమ్మ కుంట వంటి జలవనరులను పునరుద్ధరించినట్లు వివరించారు. "లేక్ ఎకానమీ" భావనతో చెరువులను అభివృద్ధి చేసి స్థానిక మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.కాలుష్యరహిత, సుస్థిర అభివృద్ధి నమూనాగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

▶ మిగతా 2లో



## మోదీజీ... వర్ధిల్లు నూరేళ్లు

- నెహ్రూ రికార్డును బద్దలు కొట్టిన మోదీ
- భారత్ లో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగుతున్న మోదీ

12

## ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం



- అక్కడ 'ఫార్మా హబ్' ఏర్పాటుకు పూర్తిస్థాయి సహకారం
- రిపబ్లిక్ ఆఫ్ ఘనా ఉన్నత స్థాయి బృందం భేటీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

## పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

- గ్రామసభలను బలోపేతం చేసి ఆదివాసీ గిరిజన హక్కులను కాపాడాలి: మంత్రి సీతక్క
- రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ ప్రారంభం



2

**హైదరాబాద్, వెలుతురు జూన్ 10:**

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గ్రామసభల సాధికారత, స్థానిక స్వపరిపాలన బలోపేతం, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు పీసా (Panchayats Extension to Scheduled Areas Act) చట్టం అత్యంత కీలకమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అన్నారు. పీసా చట్టంపై అవగాహన లోపాలు ఇంకా కనిపిస్తున్న నేపథ్యంలోనే అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, పీసా కోఆర్డినేటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సమగ్ర శిక్షణ అవసరమనే ఉద్దేశంతో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు.రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ (TGIRD)లో "షెడ్యూల్డ్–V ప్రాంతాల్లో పంచాయతీరాజ్ సంస్థల బలోపేతంలో పీసా చట్టం పాత్ర" అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు.



10

నెహ్రూ రికార్డును అధిగమించిన మోదీ.. ఎన్నికైన ప్రధానిగా కొత్త చరిత్ర

- ప్రధానమంత్రి పదవిలో 4,399 రోజులు పూర్తి
- ఎన్నికల ద్వారా వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చిన తొలి నేత
- నిరంతరాయంగా అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా మోదీ రికార్డు
- జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 4,398 రోజుల రికార్డు బద్దలు
- 2014 నుంచి వరుసగా అధికారంలో కొనసాగుతున్న మోదీ

## నెహ్రూని తక్కువ చేసి మాట్లాడడం చరిత్రను అవమానించడమే

**మంత్రి పొన్నం ప్రభాకర్**



2

**హైదరాబాద్ వెలుతురు జూన్ 10:**

భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ గారి సేవలను కించపరిచే విధంగా జరుగుతున్న వ్యాఖ్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు.స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో దేశం తీవ్రమైన ఆహార కొరత, నిరుద్యోగం, పారిశ్రామిక వెనుకబాటు, మౌలిక వసతుల లేమితో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నదని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల నుంచి భారతదేశాన్ని స్వావలంబన దిశగా నడిపించి, వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలకు బలమైన పునాదులు వేసిన నాయకుడు జవహర్‌లాల్ నెహ్రూ అని పేర్కొన్నారు.నెహ్రూ గారి దూరదృష్టితో అమలు చేసిన పంచవర్ష ప్రణాళికలు, భారీ సాగునీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, ఉన్నత విద్యా సంస్థలు నేటి భారత అభివృద్ధికి మూలస్తంభాలుగా నిలిచాయని అన్నారు. బాక్రా నంగల్, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ లు కోట్లాది రైతులకు సాగునీరు అందించి దేశ ఆహార భద్రతకు బాటలు వేసాయని తెలిపారు.



రూ.13,000 కోట్ల "హ్యామ్" పనులకు జూన్ 17న సీఎం రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా శంకుస్థాపన

- నల్లగొండ జిల్లా కనగల్ లో సీఎం భారీ బహిరంగ సభ
- తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చే రోడ్డు విస్తరణ ప్రాజెక్టుకు శ్రీకారం

12

- రోడ్ నెట్వర్క్ లో రాష్ట్రాన్ని నంబర్ వన్ గా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది



8

## అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులు..



## మమతకు మరో షాక్.. రాజ్యసభ సభ్యత్వానికి సుష్మితా దేవ్ రాజీనామా



2

## ప్రభుత్వ ఉద్యోగులకు బంపర్ ఆఫర్!

- వారానికి ఐదు రోజులే పని..
- అన్ని శనివారాలూ సెలవులే
- త్రిపుర సర్కార్ సంచలన నిర్ణయం
- సీఎం డాక్టర్ మాణిక్ సాహా సరికొత్త సంస్కరణలు
- ఉద్యోగుల 'వర్క్-లైఫ్ బ్యాలెన్స్' మెరుగుపర చడమే ధ్యేయం
- అధికారికంగా జీవో జారీ చేసిన యంత్రాంగం
- ఆఫీసు పని వేళల్లో కీలక మార్పులు..
- ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 6 వరకు విధులు
- రోజువారీ పని గంటలు పెంపు
- శనివారం నాటి సెలవును భర్తీ చేయనున్నట్లు వెల్లడి
- ఉద్యోగులందరికీ వరుసగా నాలుగు శనివారాలు విశ్రాంతి
- నెలవారీ అదనపు సెలవులతో తగ్గనున్న మానసిక ఒత్తిడి

11

## విశాఖ ఉక్కు బాధితులకు జగన్ భారీ భరోసా



2

## భవిష్యత్ తరాలకు ప్రపంచ స్థాయి...

(మొదటి పేజీ తరువాయి)

గ్రీన్ ఫార్మా, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (GCCలు), ఐటీ రంగ సంస్థలతో పాటు ప్రపంచ ప్రఖ్యాత సంస్థలను ఆకర్షించేలా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు.ఫ్యూచర్ సిటీ పరిధిలోని గ్రామాలను సమగ్ర అభివృద్ధి ప్రణాళికలో భాగం చేస్తున్నామని, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, సాంకేతిక సదుపాయాలతో ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.హాజరైన శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్,డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, నవీన్ యాదవ్, మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ , రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూని తక్కువ చేసి మాట్లాడడం...

(మొదటి పేజీ తరువాయి)

నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థలకు సీఈవో లుగా భారతీయులు నాయకత్వం వహిస్తున్నారంటే, దేశంలో ఏర్పాటు చేసిన ఉన్నత విద్యా వ్యవస్థలు, శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా సంస్థలే కారణమని మంత్రి అన్నారు.నరేంద్ర మోదీ గారిని, జవహర్‌లాల్ నెహ్రూ గారితో పోల్చడం సరైన చారిత్రక అవగాహన లేకుండా చేసే ప్రయత్నమని మోడీ కి జవహర్ లాల్ నెహ్రూ గారికి నక్క కి నాగ లోకానికి ఉన్న తేడా ఉందన్నారు.దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నెహ్రూ గారు వేసిన పునాదులపై నేడు అనేక రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని, ఆ విజయాలను పూర్తిగా తమ ఖాతాలో వేసుకోవడం తగదని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో 10 సంవత్సరాలు మంత్రి గా చేసిన పురదరీశ్వరి వంటి నాయకులు కూడా చరిత్రాత్మక వాస్తవాలను విస్మరించి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో విశేష త్యాగాలు చేసిన నాయకుల పాత్రను తక్కువ చేసి చూపే ప్రయత్నాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.గత 12 సంవత్సరాల కేంద్ర పాలనలో ప్రజల అసలు సమస్యల పరిష్కారం, ఉపాధి కల్పన, విద్యా మరియు వైద్య రంగాల బలోపేతం, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికల కంటే ప్రచార రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత లభించిందని మంత్రి విమర్శించారు.జవహర్‌లాల్ నెహ్రూ గారి స్ఫూర్తి, దేశ నిర్మాణంలో ఆయన పాత్ర భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. దేశ అభివృద్ధికి పునాదులు వేసిన మహానేతల సేవలను కించపరిచే ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికీ అంగీకరించర ని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## పీసా చట్టం ఆదివాసీల...

(మొదటి పేజీ తరువాయి)

జూన్ 10, 11 తేదీల్లో జరుగుతున్న ఈ కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, పీసా మొబిలైజర్లు, కోఆర్డినేటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మేధావుల బృంద సభ్యులు కలిపి 70 మంది పాల్గొంటున్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, పీసా చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, అది ఆదివాసీల ఆత్మగౌరవానికి, స్వయం నిర్ణయాధికారానికి, సహజ వనరులపై హక్కులకు రాజ్యాంగబద్ధమైన రక్షణ అని అన్నారు. దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని, ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని భూములు, అడవులు, జల వనరులు, ఖనిజ సంపదలపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించినప్పటికీ, చట్టం అమలులో అనేక సవాళ్లు ఉన్నాయని చెప్పారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా సహజ వనరులు కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు."పెద్ద పెద్ద సంస్థలు ప్రజలను నిరాశ్రయులను చేసే పరిస్థితులను పీసా చట్టం అంగీకరించదు. కానీ ఆ హక్కుల గురించి ఎంతమందికి అవగాహన ఉంది అనేది ప్రశ్న. అధికారులు పనిచేసే అంశంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి. చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుంది" అని మంత్రి అన్నారు.సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించేలా పీసా చట్టం అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. గ్రామసభలే స్థానిక ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని, వాటిని మరింత శక్తివంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.తాను ఉద్యమాల నుంచి వచ్చిన వ్యక్తినని, ఆదివాసీ ప్రాంతాల్లో పెరిగి అక్కడి సమస్యలను దగ్గరగా చూసిన వ్యక్తిగా గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు దక్కడం తనకు గర్వకారణమని, ఆ అవకాశాన్ని సమాజానికి మేలు చేసే దిశగా వినియోగించుకోవాలనే సంకల్పంతో పనిచేస్తున్నానని తెలిపారు.తన జీవిత ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, ఆదివాసీ హక్కుల కోసం పనిచేసే యాక్షి సంస్థతో కలిసి పనిచేసిన రోజులను మంత్రి గుర్తు చేసుకున్నారు. ఆ సంస్థ తనకు ఉద్యోగావకాశం కల్పించి, న్యాయ విద్యను పూర్తి చేసుకునేందుకు తోడ్పాటునిచ్చిందని చెప్పారు. "మనం ఉన్నవారి కోసం కాకుండా, లేని వారి కోసం పనిచేయాలి. పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రజాసేవ యొక్క అసలు ఉద్దేశ్యం" అని మంత్రి పేర్కొన్నారు.హైదరాబాద్ అభివృద్ధి, అడవుల్లోని ఆదివాసీ గ్రామాల పరిస్థితుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రస్తావిస్తూ, ఇప్పటికీ అనేక గిరిజన ఆదివాసి ప్రాంతాల్లో ప్రాథమిక సదుపాయాల కొరత ఉందన్నారు. మరోవైపు సహజ వనరులు క్షీణిస్తున్నాయని, గుట్టలు కరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో గ్రామ పంచాయతీలు, గ్రామసభలను బలోపేతం చేయడం అత్యవసరమని చెప్పారు.వర్క్‌షాప్‌లో పాల్గొంటున్న ప్రతినిధులు తమ అనుభవాలు, సూచనలు, అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకోవాలని మంత్రి కోరారు. ఈ చర్చల ద్వారా పీసా అమలులో ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కార మార్గాలు రూపొందుతాయని, ఆదివాసీ గిరిజన హక్కుల పరిరక్షణకు మరింత బలమైన విధానాలు రూపొందించేందుకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని సర్పంచుల కోసం రూపొందించిన "సర్పంచ్ సంవాద్" డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రస్తావించిన మంత్రి, దేశవ్యాప్తంగా అవార్డులు అందుకున్న ఈ యాప్ ద్వారా తెలంగాణలోని 4,500 మంది సర్పంచులు పరస్పరం ఉత్తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు సమస్యల పరిష్కారానికి ఒకే వేదికపై చర్చించే అవకాశం లభిస్తుందని తెలిపారు. సాంకేతికతను వినియోగించి గ్రామీణ పాలనను మరింత సమర్థవంతంగా మార్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.పీసా చట్టం అమలు పుస్తకాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని, గ్రామసభల నిర్ణయాలకు గౌరవం కల్పిస్తూ ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

## మోదీ 12 ఏళ్ల పాలనకు కృతజ్ఞతగా ప్రత్యేక పూజలు

- న్యాల్కల్‌లో బీజేపీ నేతల సంబరాలు
- మిఠాయిలు పంచుకుని ఆనందోత్సాహాలు



**జహీరాబాద్ వెలుతురు జూన్ 10:**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించి సంబరాలు జరుపుకున్నాయి. భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్ రావు పిలుపు మేరకు సంగారెడ్డి జిల్లా రథసారథి గోదావరి అంజి రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం న్యాల్కల్ మండలంలోని రేజింతల్ గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని రేజింతల్ గ్రామంలోని సిద్ధివినాయక ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ బీ.బీ. పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై మోదీ నాయకత్వంలో దేశం సాధించిన అభివృద్ధిని కొనియాడారు.అనంతరం న్యాల్కల్ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరస్పరం మిఠాయిలు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశ ప్రగతికి దోహదపడ్డాయని నాయకులు పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై మరింత ప్రతిష్టను సంపాదించిందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్, జిల్లా ఉపాధ్యక్షుడు గొల్ల భాస్కర్, కోహీర్ మండల అధ్యక్షుడు వైద్యనాథ్, జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్, రమేష్ రెడ్డి, ఝరాసంగం మండల అధ్యక్షుడు బంటు విశ్వనాథ్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, సుధీర్ బండారి, కౌన్సిలర్లు బొగ్గుల సంతోష్, అప్పం శ్రావణ్, మాజీ జడ్పీటీసీ శివాజీ పాటిల్, నాయకులు సుభాష్ రెడ్డి, అరుణ్, నరేష్ పాటిల్, సురేష్ పూరి, నాగరాజు, భీం యాదవ్, నర్సింలు, వేణుగోపాల్ రెడ్డి, వీరారెడ్డి, శ్రీధర్ మహరాజ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కు బాధితులకు జగన్ భారీ భరోసా

- ప్రభుత్వం ఇవ్వకపోతే మేం అధికారంలోకి వచ్చాక రూ. కోటి ఇస్తాం
- స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పిన జగన్
- ప్రభుత్వం ప్రకటించిన పరిహారంపై తీవ్ర అసంతృప్తి..
- కార్మికులకు దక్కే చట్టబద్ధమైన హక్కులనే చూపిస్తున్నారని మండిపాటు
- గతంలో ఎల్‌జీ పాలిమర్స్ బాధితులకు కోటి ఇచ్చినట్లుగానే..
- ఇప్పుడు స్టీల్ ప్లాంట్ మృతుల కుటుంబాలకూ ఇవ్వాలని డిమాండ్
- వైసీపీ హయాంలో ప్రైవేటీకరణను అడ్డుకున్నాం..
- అసెంబ్లీ తీర్మానంతో పాటు ప్రధానికి లేఖ రాసిన ఉదంతాల ప్రస్తావన
- రెండేళ్ల కూటమి పాలనలో 10,500 మంది కార్మికుల తొలగింపు..
- ప్లాంట్ ఉద్యోగుల సంఖ్యను 16 వేలకు కుదించారంటూ లెక్కల వెల్లడి
- వీఆర్ఎస్ పేరుతో శాశ్వత ఉద్యోగులపై తీవ్ర ఒత్తిళ్లు తెస్తున్నారంటూ జగన్ ధ్వజం
- ఉద్యోగులకు నాలుగు నెలల జీతాల బకాయిలు
- ఉత్పత్తితో వేతనాలకు ముడిపెట్టడం అన్యాయమన్న మాజీ సీఎం

**విశాఖపట్నం వెలుతురు జూన్ 10:**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మరియు గాయపడిన కార్మిక కుటుంబాలకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కీలకమైన హామీ ఇచ్చారు. విశాఖపట్నంలో ప్రమాద బాధితులను స్వయంగా పరామర్శించిన జగన్.. ఘటన జరిగిన తీరును, దానికి గల కారణాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రకటించిన అరకొర పరిహారంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన నిధులు కార్మికులకు చట్టబద్ధంగా రావాల్సినవే కానీ, అందులో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చూపించిన మానవత్వం ఏముందని ఆయన నిలదీశారు.విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన ఈ పెను ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం పట్ల మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబ సభ్యులను కలిసి వారిని ఓదార్చారు. ఈ కష్టకాలంలో వైఎస్సార్‌సీపీ పక్షాన తామంతా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి ఏమాత్రం బాగోలేదని, వారి ప్రాణాలకు భద్రత కరువైందని జగన్ వ్యాఖ్యానించారు. నాడు తమ పాలనలో ప్లాంట్ ఏ స్థాయిలో సురక్షితంగా ఉందో.. నేటి కూటమి ప్రభుత్వంలో ఎలాంటి దుస్థితికి చేరిందో ప్రజలంతా గమనించాలని కోరారు.విశాఖ స్టీల్ ప్లాంట్ అనేది ఆంధ్రుల హక్కు అని, దానిని కాపాడుకోవడానికి తమ ప్రభుత్వం ఉన్నప్పుడు అహర్నిశలు శ్రమించామని జగన్ గుర్తుచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంత కాలం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుగోడలా నిలిచామని చెప్పారు. అందుకోసం 2021 మార్చి నెలలో తానే స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాయడంతో పాటు, రాష్ట్ర శాసనసభలో (అసెంబ్లీలో) ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అధికారిక తీర్మానం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇలాంటి పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వాలు రాజకీయాలకు అతీతంగా, మానవత్వంతో వ్యవహరించాలని హితవు పలికారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలోనే స్టీల్ ప్లాంట్‌ను తీవ్రంగా నిర్వీర్యం చేశారని జగన్ ఘాటుగా విమర్శించారు. తాము ప్రభుత్వం నుండి దిగిపోయే సమయానికి ప్లాంట్‌లో దాదాపు 28 వేల మంది కార్మికులు, ఉద్యోగులు జీవనోపాధి పొందుతూ ఉండేవారని లెక్కలు వివరించారు. కానీ ఈ రెండేళ్ల వ్యవధిలోనే ఏకంగా 10,500 మందిని రకరకాల కారణాలు చూపిస్తూ ప్లాంట్ నుండి తొలగించారని మండిపడ్డారు. ప్రస్తుతం ప్లాంట్‌లో ఉద్యోగుల సంఖ్యను కేవలం 16 వేలకు కుదించి, కార్మికుల పొట్ట కొట్టారని జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఉద్యోగుల తొలగింపు ప్రక్రియలో భాగంగా ప్లాంట్‌లో ఎన్నో ఏళ్లుగా నమ్ముకుని పనిచేస్తున్న 6,500 మంది కాంట్రాక్టు ఉద్యోగులను అన్యాయంగా విధుల్లోంచి తీసేశారని జగన్ ఆరోపించారు. అదేవిధంగా పర్మనెంట్ ఉద్యోగులను కూడా ఉంచకుండా, 'వీఆర్ఎస్' (స్వచ్ఛంద పదవీ విరమణ) పేరుతో సుమారు 1800 మందిపై తీవ్రమైన మానసిక ఒత్తిడి తీసుకువచ్చి ప్లాంట్ నుండి బలవంతంగా తప్పించారని మండిపడ్డారు. దీనివల్ల వేలాది కార్మిక కుటుంబాలు వీధిన పడ్డాయని, ప్రస్తుతం పనిచేస్తున్న వారి పరిస్థితి కూడా ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని దారుణమైన స్థితిలో ఉందని ఆవేదన చెందారు.స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకుండా బకాయిలు పెట్టడంపై జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు రాత్రింబగళ్లు కష్టపడుతున్నా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్లాంట్‌లో జరిగే ఉత్పత్తిని బట్టే ఉద్యోగుల జీతాలు ఇస్తామంటూ సరికొత్త నిబంధనలు పెట్టడంపై ఆయన మండిపడ్డారు. ప్లాంట్‌కు అవసరమైన ముడిసరుకును, నిధులను సకాలంలో సమకూర్చడంలో ప్రభుత్వం విఫలమైతే.. దానికి కార్మికులను ఎలా బాధ్యులను చేస్తారని ప్రశ్నించారు. ప్రమాదానికి అసలు కారణం యాజమాన్య లోపాలే తప్ప కష్టపడి పనిచేసే కార్మికులు కాదని స్పష్టం చేశారు.ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టీల్ ప్లాంట్ కోసం ప్రకటించిన రూ. 11,440 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీపై జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్యాకేజీ ప్లాంట్‌లో మౌలిక వసతులు పెంచడానికో లేదా ప్లాంట్ పునరుద్ధరణ కోసమో ఇచ్చింది కాదని విమర్శించారు. ఉద్యోగులను తప్పించడానికి ఇచ్చే వీఆర్ఎస్ సెటిల్మెంట్ల కోసం, అలాగే గతంలో బ్యాంకుల నుండి తీసుకున్న పాత అప్పులను (లోన్లను) తీర్చడానికే ఈ నిధులను వాడుతున్నారని ఆరోపించారు. ప్లాంట్ అభివృద్ధికి ఈ ప్యాకేజీ వల్ల ఎలాంటి ఉపయోగం లేదని, ఇది కేవలం కంటితుడుపు చర్యేనని కొట్టిపారేశారు.సమీక్ష మరియు పరామర్శ పేరుతో విశాఖకు వచ్చిన మంత్రి లోకేష్ వ్యాఖ్యలపై జగన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ప్రమాదం జరిగి తొమ్మిది మంది చనిపోతే రాష్ట్ర ప్రభుత్వం తన సొంత ఖజానా నుండి బాధితులకు ఒక్క రూపాయి కూడా విదిల్చలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో విశాఖలో ఎల్‌జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజీ ప్రమాదం జరిగినప్పుడు, మానవత్వంతో స్పందించి మరణించిన ప్రతి కుటుంబానికి రూ. కోటి చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకున్నామని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా ఈ కూటమి ప్రభుత్వం బాధితులకు తక్షణమే రూ. కోటి చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం స్పందించకుండా మొండికేస్తే.. తాము రాబోయే రోజుల్లో మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే బాధితుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందించి తీరుతామని జగన్ శపథం చేశారు.

# మమతకు మరో షాక్.. రాజ్యసభ సభ్యత్వానికి సుష్మితా దేవ్ రాజీనామా

- టీఎంసీకి వరుసగా ఎదురుదెబ్బలు
- ఇటీవలే సుఖేందు శేఖర్‌రాయ్ కూడా రాజీనామా
- కాంగ్రెస్ నుంచి టీఎంసీలో చేరిన సుష్మితా
- పార్టీలో వేగంగా ఎదిగి కీలక పదవుల సాధన జాతీయ అధికార ప్రతినిధిగా సేవలు
- రాజ్యసభ ఛైర్మన్‌కు రాజీనామా లేఖ
- తక్షణ ఆమోదం కోరిన నేత
- అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మతో భేటీ
- బీజేపీలో చేరే అవకాశాలపై ఊహాగానాలు

**పశ్చిమబెంగాల్ వెలుతురు జూన్ 10:**

తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి మరో రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు సుష్మితా దేవ్ తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇటీవలే టీఎంసీకి చెందిన సీనియర్ నేత, మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా పేరున్న సుఖేందు శేఖర్‌రాయ్ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

సుష్మితా దేవ్ బుధవారం తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు రాజ్యసభ ఛైర్మన్‌కు లేఖ రాశారు. తన రాజీనామాను తక్షణమే ఆమోదించాలని ఆ లేఖలో కోరినట్లు సమాచారం. ఆమె నిర్ణయం టీఎంసీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**కాంగ్రెస్ నుంచి టీఎంసీ వరకు**

అస్సాం రాజకీయాల్లో ప్రముఖ నాయకుడిగా గుర్తింపు పొందిన మాజీ కేంద్ర మంత్రి సంతోష్ మోహన్‌దేవ్ కుమార్తె సుష్మితా దేవ్. కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకురాలిగా ఎదిగిన ఆమె అస్సాంలోని సిల్చార్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ జాతీయ స్థాయిలో కూడా పలు బాధ్యతలు నిర్వహించారు.అయితే 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి అనంతరం కాంగ్రెస్‌తో దూరమయ్యారు. అనంతరం 2021లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరి రాజకీయంగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు.

**టీఎంసీలో వేగవంతమైన ఎదుగుదల**

టీఎంసీలో చేరిన కొద్దికాలానికే సుష్మితా దేవ్‌కు పార్టీ అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించింది. జాతీయ అధికార ప్రతినిధిగా నియమించడంతో పాటు జాతీయ స్థాయిలో పార్టీ వాణిని బలంగా వినిపించే అవకాశాన్ని కల్పించింది.ఆ తర్వాత ఆమెకు రాజ్యసభ సభ్యత్వం కూడా దక్కింది. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి విశ్వసనీయ నాయకురాలిగా ఆమె గుర్తింపు పొందారు.

**రాజీనామా వెనుక కారణాలేమిటి?**

సుష్మితా దేవ్ రాజీనామా వెనుక గల కారణాలపై అధికారికంగా ఎలాంటి వివరణ రాలేదు. అయితే ఇటీవల పార్టీ అంతర్గత వ్యవహారాలపై కొన్ని అసంతృప్తులు వ్యక్తమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. టీఎంసీలో జరుగుతున్న పరిణామాలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాల నేపథ్యంలోనే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**హిమంత బిశ్వశర్మతో భేటీ**

రాజీనామా ప్రకటన వెలువడిన కొద్ది గంటల్లోనే మరో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. సుష్మితా దేవ్ న్యూఢిల్లీ లో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను కలిశారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది.భేటీ అనంతరం ఆమె భవిష్యత్ రాజకీయ అడుగులపై ఊహాగానాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా భారతీయ జనతా పార్టీలో చేరే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం జోరందుకుంది.

**టీఎంసీకి వరుస షాక్‌లు**

ఇటీవలే రాజ్యసభ సభ్యుడు సుఖేందు శేఖర్‌రాయ్ తన పదవికి రాజీనామా చేయగా, ఇప్పుడు సుష్మితా దేవ్ కూడా అదే బాట పట్టడం టీఎంసీకి రాజకీయంగా ఇబ్బందికర పరిణామంగా భావిస్తున్నారు. జాతీయ స్థాయిలో పార్టీ విస్తరణకు ప్రయత్నిస్తున్న సమయంలో కీలక నేతలు పార్టీకి దూరమవడం మమతా బెనర్జీకి సవాలుగా మారే అవకాశముంది.అయితే సుష్మితా దేవ్ తదుపరి రాజకీయ నిర్ణయంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఆమె భాజపాలో చేరతారా? లేక మరో రాజకీయ వ్యూహంతో ముందుకు సాగుతారా? అన్న అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# బుల్లెట్ ట్రైన్ కోసం జహీరాబాద్ ఒక్కటైంది..!

- సర్వపక్ష రౌండ్ టేబుల్‌లో ఏకగ్రీవ తీర్మానం

**జహీరాబాద్ వెలుతురు జూన్ 10:**

హైదరాబాద్–ముంబై బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు జహీరాబాద్ మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో అన్ని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో సర్వపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొణింటి మాణిక్‌రావు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హైదరాబాద్–ముంబై బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు జహీరాబాద్ మీదుగా అమలైతే ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. జహీరాబాద్ ఇప్పటికే జాతీయ రహదారులు, రైల్వే సౌకర్యాలు, పరిశ్రమలతో అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో బుల్లెట్ ట్రైన్ అనుసంధానం వల్ల పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, వాణిజ్య కార్యకలాపాలు మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.ఇటీవల బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌లో మార్పులపై వస్తున్న వార్తల నేపథ్యంలో జహీరాబాద్ ప్రజల్లో ఆందోళన నెలకొందని, ఈ ప్రాంత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు మార్గాన్ని జహీరాబాద్ మీదుగానే కొనసాగించాలని ప్రభుత్వాలను కోరారు. ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఒకే లక్ష్యంతో ఉద్యమించి విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేసిన నాయకులు, అదే స్ఫూర్తితో బుల్లెట్ ట్రైన్ సాధన కోసం కూడా పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.



రాజకీయ భేదాభిప్రాయాలను పక్కనబెట్టి జహీరాబాద్ అభివృద్ధి కోసం అందరూ ఒకే వేదికపైకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో బుల్లెట్ ట్రైన్ జహీరాబాద్ మీదుగా వెళ్లే వరకు పోరాటాన్ని కొనసాగించాలని, అవసరమైతే ప్రజా ఉద్యమాలు, ధర్నాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. జహీరాబాద్ హక్కులను కాపాడుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు.సమావేశం ముగింపులో బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని జహీరాబాద్ మీదుగానే ఖరారు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ పోరాటం రాజకీయాలకు అతీతంగా ప్రజా ఉద్యమంగా కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్ రావు మాజీ ఎంపీ బిబి పాటిల్ తో పాటు డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సిపిఎం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఉద్యోగ, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల భూసేకరణ వేగవంతం చేయాలి

- నియోజకవర్గంలో అభివృధి పనులకు భూ కేటాయింపులు త్వరితగతిన పూర్తి చేయాలి
- ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి
- హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, రెవెన్యూ అంశాలు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై అధికారులతో నిర్వహించిన వేరు వేరు సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ వెలుతురు జూన్ 10:**

హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, రెవెన్యూ అంశాలు, భూసేకరణ పురోగతి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం మరియు విద్యార్థుల సంఖ్య పెంపుపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండల, డివిజనల్ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్ట్ పరిధిలోని మూడు జిల్లాల్లో భూసేకరణకు అవసరమైన నిధులు ఇప్పటికే విడుదలయ్యాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన భూ కేటాయింపుల పురోగతిపై అధికారులను ఆరా తీసిన మంత్రి, టీటీడీ దేవస్థానం, ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్, మహిళా బజార్ ఏర్పాటు కోసం అవసరమైన భూముల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే చౌటపల్లి పారిశ్రామిక కారిడార్‌కు సంబంధించిన భూసేకరణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల సంఖ్య పెంపుపై నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంఈఓలు, మూడు జిల్లాల డీఈఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రతి గ్రామంలో విస్తృతంగా బడిబాట కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పెయింటింగ్ పనులు, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎంత మేర పెంచాలనే లక్ష్యాలను నిర్దేశించుకుని కార్యాచరణ రూపొందించాలని సూచించారు.విద్యార్థులు పాఠశాలలకు ఆకర్షితులయ్యే విధంగా పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్డీవో లు, డీఈవో లు,ఎమ్మార్వో లు , ఎంఈవో లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## రామచందర్‌రావు విద్యావంతుడే కదా

- ఇదిగో లెటర్లు మీకే పంపిస్తున్నాం
- మహారాష్ట్ర సీఎంతో మాట్లాడి చర్చలకు ఒప్పించండి.
- మండిపడ్డ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 10:**

తెలంగాణ ప్రయోజనాల విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పదేపదే అబద్ధమాడుతున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌ను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోరనే లేదని.. సీఎం లెటర్ రాయనేలేదని మాట్లాడటం విడ్డూరంగా ఉంది. లెటర్ రాయకపోతే మహారాష్ట్ర సీఎం ఆఫీసు ఖండించాలి కదా..? మహారాష్ట్ర సీఎం ఆఫీసు ఎందుకు స్పందించటం లేదు..? ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర బీజేపీ తెలంగాణ ప్రజలను మోసం చేస్తోంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మిస్తే మన రైతులకు సాగునీరు, ఆదిలాబాద్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వరకు రైతులకు మేలు జరుగుతుంది. అదేమీ తెలియనట్లు రామచంద్రారావు సీఎం గారు లెటర్ రాయలేదు.. మా మంత్రి గారు లెటర్ రాయలేదు..? అని మాట్లాడటం విడ్డూరంగా ఉంది. మా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు మే 6న మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశారు. ఆ తర్వాత మా సీఎం రేవంత్‌రెడ్డి గారు మే 26న మరోసారి లేఖ రాశారు. ఈ మెయిల్ అందుకున్నట్లు మహారాష్ట్ర సీఎం ఆఫీసు అక్నాలడ్జిమెంట్ కూడా మీకు పంపిస్తాం. ఈ లెటర్ల కాపీలు కూడా రామచంద్రారావుకు పంపిస్తాం. ఆయన తన తప్పును ఒప్పుకోవాలి. స్వయంగా ఆయన మహారాష్ట్రకు వెళ్లి అక్కడున్న వాళ్ల పార్టీ సీఎంను ఒప్పించినా.. మాకెలాంటి అభ్యంతరం లేదు. మమ్మల్ని ఆయన వెంటబెట్టుకొని వెళ్లినా వచ్చేందుకు మేం సిద్ధంగానే ఉన్నాం. ఎలాగూ వాళ్ల మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్కు తెలంగాణ ప్రజల మీద ప్రేమ లేదు. తెలంగాణ ప్రయోజనాల మీద వాళ్లకు పట్టింపు లేదు. కనీసం ఆ పార్టీ అధ్యక్షునిగా ఉన్న రామచంద్రారావుకు ఉంటే.. ఆయనైనా నిరూపించుకోవాలి. మేం లేఖలు రాయలేదని చెప్పటమెందుకు.. మీరు కూడా మహారాష్ట్రకు వెళ్లటం చేతకాకపోతే.. మీరే లేఖ రాసి చర్చలకు ఒప్పించండి. 152 మీటర్ల ఎత్తున తుమ్మడి హెట్టి కట్టించేందుకు సహకరిస్తే.. తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ఆదరిస్తారు. మేం రాసిన లెటర్లు చూపిస్తున్నా కూడా.. లెటర్ రాయలేదంటే.. మీరు తెలంగాణ ప్రజలను మోసం చేసి.. తుమ్మిడిహెట్టి కట్టకుండా అడ్డుపడుతున్న ద్రోహులుగా నిలిచిపోతారని హెచ్చరిస్తున్నాను.

## పేద విద్యార్థుల భవిష్యత్తును మార్చేది విద్యే: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- తిప్పర్తిలో రూ.6 కోట్లతో నూతన కళాశాల భవన నిర్మాణం
- చదువు ఒక్కటే కుటుంబాల భవిష్యత్తును మార్చగలదని, ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలని మంత్రి పిలుపు.
- జూలై 1న 100 డబుల్ బెడ్‌రూం ఇళ్ల గృహప్రవేశాలు, ప్రతి లబ్ధిదారునికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేస్తానని మంత్రి హామీ.
- మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లుల ఏర్పాటు దిశగా చర్యలు.
- వడ్డీలేని రుణాలకు రూ.500 కోట్లు విడుదల చేసి మహిళా సంఘాలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.
- తిప్పర్తి అభివృద్ధిలో భాగంగా అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాలతో మండల కేంద్రానికి కొత్త అందాలు.
- "పిల్లలకు చదువు చెప్పించడం కంటే గొప్ప సేవ లేదు" - తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపు





**తిప్పర్తి, నల్లగొండ జిల్లా వెలుతురు జూన్ 10:**

చదువు జీవితాలను మారుస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలోని మూడున్నర లక్షల మంది ఇంటర్ విద్యార్థులకు ఈ అకాడమిక్ విద్యా సంవత్సరం నుండే ఉదయం అల్పాహారంతో పాటు, మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు వెల్లడించారు. బుధవారం ఆయన నల్గొండ జిల్లా, తిప్పర్తి మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించారు. జూలై 1న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అన్ని వసతులు కల్పించాలని, ఎక్కడైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వాటిని కూడా పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాక 6 కోట్ల రూపాయలతో తిప్పర్తి మండల కేంద్రంలో మంజూరైన జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు.అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ గత సంవత్సరం జిల్లాలోని తిప్పర్తి, కనగల్ మండలాలలో ఒక్కొక్కటి 6 కోట్ల రూపాయలతో అధునాతన సౌకర్యాలు కల్పించేలా జూనియర్ కళాశాల భవనాలను మంజూరు చేయడం జరిగిందని, పూర్తి నాణ్యతతో ఈ భవనాలను నిర్మించి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని,పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని, చదువు జీవితాలను మారుస్తుందని, విద్యాభివృద్ధిలో భాగంగా నల్గొండ జిల్లా కేంద్రంలో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయాన్ని తీసుకురావడమే కాకుండా, బీఫార్మసీ, లా కోర్సులను తీసుకురావడం జరిగిందన్నారు.తిప్పర్తి జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని 6 నెలల్లో పూర్తి చేయాలని ఆయన అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్షల 50 వేల మంది ఇంటర్ విద్యార్థులకు అల్పాహారంతో పాటు భోజనాన్ని ఈ విద్యా సంవత్సరం నుండి ఇవ్వనున్నదని అందువల్ల విద్యార్థులు ఎక్కడికి వెళ్ళవసరం లేకుండా ఉన్నచోటనే ఉన్నత విద్యను అభ్యసించవచ్చని తెలిపారు. భవిష్యత్తులో ఇంటర్ కళాశాలలో కంప్యూటర్ విద్యతోపాటు, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అందించనున్నామని, ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో బొట్టుగూడా ప్రతీక్ పాఠశాలలో ఏ ఐ అందిస్తున్నట్లు తెలిపారు. తిప్పర్తి మండల కేంద్రంలో నిర్మించిన 100 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను జూలై 1 నాటికి అన్ని వసతులతో పూర్తిచేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని, అన్ని ఒకేరోజు ప్రారంభించే విధంగా తీసుకోవాలని అధికారుల ఆదేశించామని, అంతేగాక తన వంతుగా ఒక్కో ఇంటికి 25వేల రూపాయలను గృహప్రవేశాల సందర్భంగా లబ్ధిదారులకు ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే నల్గొండ పట్టణంలో కలెక్టర్ కార్యాలయం వెనక నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కూడా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తిప్పర్తి మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఏర్పాటు చేశామని, మహిళల అభివృద్ధిలో భాగంగా స్వయం సహాయక మహిళలకు ప్రతి మండలంలో రైస్ మిల్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, మహిళలు ఆర్థికంగా పైకి వస్తే కుటుంబానికి తోడుగా ఉంటారని అన్నారు.

ఇటీవలే రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు 500 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు 10 తర్వాత ఎట్టి పరిస్థితులలో చదువును ఆపరాదని ఆయన కోరారు. చదువుకుంటే టెక్నికల్ కోర్సుల ద్వారా ఉద్యోగాలు పొందవచ్చని దీన్ని దృష్టిలో ఉంచుకొని నల్గొండలో న్యాక్, సెట్విన్ సంస్థలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్, ఆర్ అండ్ బి ఎస్ ఈ శ్రీధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, సంపత్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## మాట నిలబెట్టుకున్న మంత్రి జూపల్లి: మినీ స్టేడియానికి తన 4 ఎకరాల భూమి విరాళం

- రూ.1.50 కోట్ల విలువైన సొంత స్థలం కేటాయింపు
- తహసీల్దార్ కార్యాలయంలో డిజిటల్ సంతకం చేసిన మంత్రి
- భూమి బదిలీ ప్రక్రియ పూర్తి



**కొల్లాపూర్, వెలుతురు జూన్ 10:**

రాజకీయాల్లో ఎప్పుడూ ఆదర్శంగా ఉంటూ... ప్రజా సంక్షేమాన్ని, నిజాయితీని, విలువలను తమ సిద్ధాంతాలుగా మార్చుకున్న పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిస్వార్థ నిర్ణయం తీసుకున్నారు. గతంలో తాను స్థానిక క్రీడాకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ సుమారు రూ.1.50 కోట్ల విలువైన తన 4 ఎకరాల సొంత భూమిని మినీ స్టేడియం నిర్మాణానికి విరాళంగా అందజేశారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వీపనగండ్ల మండల కేంద్రంలో ఉన్న తన సొంత భూమిని క్రీడా మైదానానికి బదలాయిస్తూ బుధవారం కోడేరు మండల తహసీల్దార్ (MRO) కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా డిజిటల్ సంతకం చేశారు. గతంలో వీపనగండ్ల మండల పర్యటనకు వచ్చిన సందర్భంలో, స్థానిక యువత, క్రీడాకారుల అభ్యర్థన మేరకు మినీ స్టేడియం ఏర్పాటు కోసం తన సొంత భూమిని ఇస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ మేరకు వీపనగండ్ల మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 532/ఆ పరిధిలో తన పేరు మీద ఉన్న 4 ఎకరాల పట్టా భూమిని ప్రభుత్వానికి బదిలీ చేశారు. కోడేరు తహసీల్దార్ కార్యాలయంలో వీపనగండ్ల ఎంఆర్ఓ డిజిటల్ లాగిన్ ద్వారా ఈ భూమిని మినీ స్టేడియానికి కేటాయిస్తూ అధికారిక ప్రక్రియను పూర్తి చేశారు.ఈ చారిత్రాత్మక భూ బదలాయింపు ప్రక్రియకు సాక్షులుగా వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మునిగొండ గోపి, నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ అధికారికంగా డిజిటల్ సంతకాలు చేశారు. రూ.కోట్లలో విలువ చేసే భూమిని క్రీడల అభ్యున్నతి కోసం, నిరుపేద గ్రామీణ యువత భవిష్యత్తు కోసం దానం చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావును మంచి మనసున్న నాయకుడని పలువురు ప్రశంసించారు. మంత్రికి ప్రజలు, క్రీడాకారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నిట్టు శ్రీశైలం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 10:**

తెలంగాణ భారతీయ జనతా పార్టీ మాజీ ఉపాధ్యక్షులు మునుగోడు నియోజకవర్గం ఇంచార్జ్ గంగిడి మనోహర్ రెడ్డి గారి పుట్టినరోజు సందర్భంగా వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది నిట్టు శ్రీశైలం.



# మోదీ నాయకత్వంలో భారత్‌కు స్వర్ణయుగం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- ఎన్నికైన ప్రధానిగా అత్యధిక కాలం సేవలందించిన మోదీ
- 4,399 రోజులు చరిత్రలో నిలిచే మైలురాయి: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు
- 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసానికి ప్రతీకగా అభివర్ణన
- ప్రతి రంగంలోనూ స్పష్టమైన మార్పు కనిపిస్తోందని వ్యాఖ్య
- గరీబ్ కల్యాణ్ నుంచి డిజిటల్ మౌలిక సదుపాయాల వరకు ప్రస్తావన
- ఆర్టికల్ 370 రద్దు కీలక నిర్ణయమని ప్రశంస
- జాతీయ భద్రత, సరిహద్దుల బలోపేతంపై ప్రత్యేక ప్రస్తావన
- స్టార్టప్ సంస్కృతి, ఆర్థిక ఆధునికీకరణలో పురోగతి
- ఈశాన్య భారతంలో శాంతి, అభివృద్ధికి కృషి చేశారని వ్యాఖ్య
- జాతీయ పునరుజ్జీవనానికి కొత్త యుగానికి నాంది పలికారని అభిప్రాయం





**హైదరాబాద్ వెలుతురు జూన్ 10:**

ఎన్నికైన ప్రధాన మంత్రిగా అత్యధిక కాలం సేవలందించిన నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ చరిత్రాత్మక మైలురాయిని అధిగమించారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. 4,399 రోజుల పాలన భారత చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిపోతుందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా స్పందించిన రామచందర్‌రావు.. మోదీ 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసం, ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని తెలిపారు.గరీబ్ కల్యాణ్ కార్యక్రమాల నుంచి మహిళా సాధికారత వరకు, రైతుల సంక్షేమం నుంచి యువతకు అవకాశాల కల్పన వరకు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణం వరకు ప్రతి రంగంలోనూ స్పష్టమైన మార్పు కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు.అలాగే ఆర్థిక వ్యవస్థను మరింత పారదర్శకంగా, క్రమబద్ధంగా మార్చడంతో పాటు ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని తెలిపారు.ఆర్టికల్ 370 రద్దు, బలమైన జాతీయ భద్రతా విధానం, నక్సలిజం క్షీణత, ఈశాన్య భారతంలో శాంతి, అభివృద్ధి, సరిహద్దుల బలోపేతం, విస్తృత సామాజిక భద్రతా వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన ఆధునికీకరణ, దేశంలో స్టార్టప్ సంస్కృతి విస్తరణ వంటి అంశాలను రామచందర్‌రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు.ఈ పరిణామాలన్నీ భారత జాతీయ పునరుజ్జీవనానికి నాంది పలికిన కొత్త యుగానికి ప్రతీకలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ మరింత బలమైన, అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు.

# విద్య విద్యార్థుల భవిష్యత్తా..? లేక విద్య ను.. కార్పొరేట్గా మార్చిన సంస్కృతి..!

విద్య అనేది ఒక దేశ భవిష్యత్తును నిర్మించే అత్యంత కీలకమైన సామాజిక సాధనం. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించాలని నిర్దేశించిన నేపథ్యంలో విద్య అందరికీ అందుబాటులో ఉండాల్సిన హక్కు. కానీ నేటి పరిస్థితుల్లో విద్య క్రమంగా ఒక సేవా రంగం నుండి లాభాపేక్షతో నడిచే వ్యాపార రంగంగా మారిపోతున్నదనే ఆందోళన సమాజంలో పెరుగుతోంది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, ఇక అనేక జిల్లాల్లో ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల పేరుతో జరుగుతున్న అధిక ఫీజుల వసూళ్లు తల్లిదండ్రులకు పెను భారంగా మారాయి.గత రెండు దశాబ్దాలుగా విద్యారంగంలో ప్రైవేట్ సంస్థల ప్రాబల్యం పెరిగింది. ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం తగ్గడం, ఇంగ్లీష్ మీడియం విద్యపై పెరిగిన ఆకర్షణ, పోటీ పరీక్షల ఒత్తిడి, కార్పొరేట్ మార్కెటింగ్ వ్యూహాలు కలిసి ప్రైవేట్ విద్యాసంస్థలకు భారీ అవకాశాలు కల్పించాయి. ఈ పరిస్థితిని కొంతమంది విద్యా సంస్థల యాజమాన్యాలు సేవా అవకాశంగా కాకుండా లాభాల సాధనకు ఉపయోగించుకోవడం ప్రారంభించాయి. నేడు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలోనే లక్షల రూపాయల నుంచి 2 లక్షల రూపాయల వరకు ఫీజులు వసూలు చేసే పరిస్థితి ఏర్పడటం విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అసమానతలకు నిదర్శనం.

CBSE, ICSE, IB, IGCSE, కేంబ్రిడ్జ్ వంటి పాఠ్య ప్రణాళికల పేరుతో భారీ ఫీజులు వసూలు చేయడం ఒక కొత్త ధోరణిగా మారింది. అంతర్జాతీయ ప్రమాణాలు, ప్రపంచ స్థాయి బోధన, స్మార్ట్ క్యాంపస్, డిజిటల్ క్లాస్‌రూమ్స్ వంటి ఆకర్షణీయ పదజాలంతో తల్లిదండ్రులను ఆకట్టుకుంటూ లక్షల రూపాయల ఫీజులను న్యాయబద్ధం చేసే ప్రయత్నం జరుగుతోంది. అయితే ఈ సంస్థలు వసూలు చేస్తున్న ఫీజులకు అనుగుణంగా విద్యా ప్రమాణాలు ఉన్నాయా? ఉపాధ్యాయుల నాణ్యత ఎలా ఉంది? విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన అకడమిక్, మానసిక, సామాజిక వాతావరణం కల్పిస్తున్నాయా? అనే అంశాలపై ప్రభుత్వం తరచూ సమీక్షలు నిర్వహించడం లేదు.విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాలబాలికకు నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత. ఈ చట్టం ప్రకారం గుర్తింపు పొందిన ప్రతి పాఠశాల నిర్దిష్ట ప్రమాణాలను పాటించాలి. పాఠశాల గుర్తింపు, ఉపాధ్యాయుల అర్హతలు, విద్యార్థుల భద్రత, మౌలిక వసతులు, ఫీజుల నిర్మాణం వంటి అంశాలు పారదర్శకంగా ఉండాలి. కానీ రాష్ట్రంలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు ఈ నిబంధనలను పూర్తిగా అమలు చేస్తున్నాయా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు.చట్టపరంగా ప్రతి ప్రైవేట్ పాఠశాల తమ ప్రభుత్వం ఆమోదించిన గుర్తింపు సంఖ్యను పాఠశాల ప్రాంగణంలో స్పష్టంగా ప్రదర్శించాలి. అధికారిక వెబ్‌సైట్‌లో గుర్తింపు వివరాలు, ఫీజు నిర్మాణం, ఇతర చార్జీల వివరాలు అందుబాటులో ఉంచాలి. అడ్మిషన్ ఫారాల్లో తరగతి వారీ ఫీజులను స్పష్టంగా పేర్కొనాలి. తల్లిదండ్రులకు పూర్తి సమాచారం అందించాలి. అయితే అనేక విద్యాసంస్థలు ఈ నిబంధనలను పాటించకుండా వివిధ పేర్లతో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నాయనే ఫిర్యాదులు తరచూ వెలుగులోకి వస్తున్నాయి.ట్యూషన్ ఫీజు కాకుండా బిల్డింగ్ ఫండ్, యాక్టివిటీ ఫండ్, టెక్నాలజీ ఫీజు, డెవలప్‌మెంట్ ఛార్జీలు, అడ్మిషన్ ఫీజులు, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు, యూనిఫామ్, పుస్తకాలు, స్టేషనరీ వంటి అనేక అంశాల పేరుతో తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపబడుతోంది. చాలాసార్లు ఈ చార్జీలకు ప్రభుత్వ అనుమతి ఉందా లేదా అన్నది కూడా స్పష్టంగా ఉండదు. ఫలితంగా విద్యా రంగంలో పారదర్శకత కంటే వ్యాపార ధోరణి బలపడుతోంది.ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే కొన్ని ప్రాంతాల్లో గుర్తింపు లేని లేదా పూర్తి అనుమతులు లేని పాఠశాలలు కూడా నిర్బంధం లేకుండా కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోయినా, తగిన మౌలిక సదుపాయాలు లేకపోయినా, భారీ ప్రకటనల ద్వారా తల్లిదండ్రులను ఆకర్షించడం జరుగుతోంది. ఇది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడమే కాకుండా చట్టాన్ని కూడా ధిక్కరించడం అవుతుంది.ఈ పరిస్థితులకు ప్రధాన కారణాల్లో ఒకటి పర్యవేక్షణ వ్యవస్థలో ఉన్న బలహీనత. జిల్లా విద్యాధికారులు, మండల విద్యాధికారులు, పాఠశాల విద్యాశాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి నిబంధనల అమలును పరిశీలించాల్సి ఉంటుంది. కానీ చాలా సందర్భాల్లో తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఫీజుల నియంత్రణ, గుర్తింపు ధ్రువీకరణ, మౌలిక వసతుల తనిఖీలు, ఉపాధ్యాయుల అర్హతల పరిశీలన వంటి అంశాల్లో మరింత కఠిన వైఖరి అవసరం.ప్రస్తుతం తెలంగాణలో ఫీజుల నియంత్రణకు సమగ్ర వ్యవస్థ లేకపోవడం కూడా ఒక ప్రధాన సమస్య. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్ర "స్కూల్ ఫీజు రెగ్యులేటరీ అథారిటీ"ని ఏర్పాటు చేయాలి. ఈ సంస్థ ప్రతి ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాల ఫీజు ప్రతిపాదనలను పరిశీలించి ఆమోదించాలి. ఫీజుల పెంపు అవసరమైతే దానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలి. తల్లిదండ్రుల ప్రతినిధులకు కూడా నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం కల్పించాలి.ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేట్ పాఠశాలల డిజిటల్ రిజిస్టర్‌ను రూపొందించాలి. ఇందులో గుర్తింపు సంఖ్య, అనుమతుల స్థితి, ఫీజుల నిర్మాణం, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల అర్హతలు, మౌలిక వసతుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. దీని ద్వారా తల్లిదండ్రులు సరైన సమాచారంతో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.అదేవిధంగా ప్రతి జిల్లాలో ప్రత్యేక ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఫీజుల దోపిడీ, అక్రమ వసూళ్లు, అనుమతి లేని చార్జీలు, తప్పుడు ప్రకటనలపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగలిగేలా ఆన్‌లైన్ పోర్టల్, హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి. నిర్దిష్ట కాలవ్యవధిలో ఫిర్యాదులను పరిష్కరించే విధానం అమలు చేయాలి.

విద్యారంగంలో పారదర్శకత పెంచడానికి ప్రతి విద్యాసంస్థ వార్షిక ఆర్థిక నివేదికలను కూడా ప్రజలకు అందుబాటులో ఉంచే విధానాన్ని పరిశీలించవచ్చు. ఎందుకంటే విద్యాసంస్థలు ఎంత ఫీజు వసూలు చేస్తున్నాయి? ఆ నిధులు ఎలా వినియోగిస్తున్నాయి? విద్యార్థుల అభివృద్ధికి ఎంత ఖర్చు చేస్తున్నాయి? అనే విషయాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజా సంక్షేమం ప్రధాన లక్ష్యాలుగా ప్రకటించింది. అదే స్ఫూర్తితో విద్యారంగంలో కూడా సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. విద్యాశాఖ మంత్రి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించాలి. ఫీజుల వివరాలను బహిరంగంగా ప్రకటించని సంస్థలపై చర్యలు తీసుకోవాలి. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలల గుర్తింపులను రద్దు చేసే వరకు వెనుకాడకూడదు.విద్య ఒక వస్తువు కాదు. అది సమాజ నిర్మాణానికి పునాది. తల్లిదండ్రుల ఆర్థిక స్థితిని దోచుకునే వ్యాపార అవకాశంగా విద్యను మార్చే ప్రయత్నాలను ప్రభుత్వం అడ్డుకోవాలి. విద్యా హక్కు చట్టం స్ఫూర్తిని అమలు చేయాలి. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థిక భద్రత, సమాజంలో సమాన అవకాశాల పరిరక్షణ కోసం ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల ఫీజు వ్యవస్థలో సంపూర్ణ పారదర్శకత తీసుకురావడం అత్యవసరం.విద్యను వ్యాపార వస్తువుగా కాకుండా సామాజిక బాధ్యతగా చూడగలిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. తెలంగాణ ప్రభుత్వం ఈ దిశగా చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకొని విద్యా రంగంలో నూతన ప్రమాణాలు నెలకొల్పాలని సమాజం ఆశిస్తోంది.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు


# సోషల్ మీడియా నుంచి వీధుల వరకు: ప్రపంచాన్ని కదిలిస్తున్న జెన్-జీ చైతన్యం

**Give me just one generation of youth and its all transform the whole world అంటాడు లెనిన్ .**

**యువత తలుచుకుంటే ప్రపంచాన్ని మార్చే శక్తి ఉంది.**

**యువత లేకుండా ఏ విప్లవం జరగబోదు.**

నేటి ప్రపంచ పరిస్థితులను చూస్తే మరింత సజీవంగా కనిపిస్తాయి. ఒకప్పుడు సమాజంలో మార్పు కోసం ఉద్యమాలు నెలల తరబడి, సంవత్సరాల తరబడి సన్నాహాలు చేసుకునేవి. ప్రజలను కూడగట్టడానికి సమావేశాలు, కరపత్రాలు, పత్రికలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధాన సాధనాలుగా ఉండేవి. కానీ డిజిటల్ యుగంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నేడు ఒక మొబైల్ ఫోన్, ఒక వీడియో, ఒక హ్యాష్‌ట్యాగ్, ఒక సోషల్ మీడియా పోస్టు లక్షలాది మంది యువతను కదిలించే శక్తిగా మారింది. ఈ కొత్త చైతన్యానికి ప్రతీకగా నిలిచిన తరమే "జెన్-జీ".1997 నుంచి 2012 మధ్య జన్మించిన తరం జెన్-జీగా పిలువబడుతోంది. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియా, కృత్రిమ మేధస్సు వంటి సాంకేతిక పరిజ్ఞానాల మధ్య పెరిగిన తొలి ప్రపంచ తరం వీరే. వీరు కేవలం సమాచార వినియోగదారులు మాత్రమే కాదు; సమాచార సృష్టికర్తలు కూడా. గత తరాల కంటే భిన్నంగా ప్రపంచాన్ని ఒకే వేదికగా చూస్తున్నారు. తమ గ్రామంలో జరిగిన సంఘటనను ప్రపంచంతో పంచుకుంటూనే, ప్రపంచంలో ఎక్కడ జరిగిన అన్యాయాన్నైనా తమ సమస్యగా స్వీకరిస్తున్నారు.నేటి యువతను అర్థం చేసుకోవాలంటే ముందుగా సోషల్ మీడియా పాత్రను అర్థం చేసుకోవాలి. ఒకప్పుడు వార్తలను ప్రభుత్వాలు, కార్పొరేట్ మీడియా సంస్థలు నియంత్రించేవి. కానీ నేడు పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రతి యువకుడు ఒక మీడియా కేంద్రంగా మారాడు. ఒక వీడియోను అప్‌లోడ్ చేస్తే అది క్షణాల్లో ఖండాలు దాటుతోంది. ఒక ట్వీట్ ప్రభుత్వాలను వివరణ ఇవ్వాల్సిన పరిస్థితికి నెడుతోంది. ఒక హ్యాష్‌ట్యాగ్ లక్షల మందిని ఒకే అంశం చుట్టూ సంఘటితం చేస్తోంది.సామాజిక శాస్త్రవేత్తలు నేటి డిజిటల్ సమాచార వ్యవస్థను "కాక్‌రోచ్ సోషల్ మీడియా"గా అభివర్ణిస్తున్నారు. కాక్‌రోచ్‌ను పూర్తిగా నిర్మూలించడం ఎంత కష్టమో, సోషల్ మీడియాలో వ్యాపించే సమాచారాన్ని అడ్డుకోవడం కూడా అంతే కష్టం. ఒక ఖాతాను మూసివేస్తే మరో వంద ఖాతాలు పుడతాయి. ఒక వెబ్‌సైట్‌ను నిషేధిస్తే మరో వేదిక ద్వారా సమాచారం వ్యాపిస్తుంది. అందువల్ల ప్రభుత్వాలు, అధికార వర్గాలు, కార్పొరేట్ శక్తులు సమాచార ప్రవాహాన్ని పూర్తిగా నియంత్రించడం క్రమంగా అసాధ్యంగా మారుతోంది.ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేక ఉద్యమాలు దీనికి నిదర్శనం. వాతావరణ మార్పులపై యువత ఆందోళన ప్రపంచ రాజకీయాలనే ప్రభావితం చేసింది. స్వీడన్‌కు చెందిన విద్యార్థిని గ్రెటా థన్‌బర్గ్ ప్రారంభించిన నిరసన ఒక దేశ సరిహద్దుల్లోనే ఆగిపోలేదు. లక్షలాది మంది విద్యార్థులు "మా భవిష్యత్తును నాశనం చేసే హక్కు ఎవరికీ లేదు" అంటూ వీధుల్లోకి వచ్చారు. వాతావరణ సంక్షోభాన్ని ప్రపంచ రాజకీయ చర్చల కేంద్రాంశంగా మార్చడంలో యువత కీలక పాత్ర పోషించింది.అమెరికాలో జరిగిన బ్లాక్ లైవ్స్ మ్యాటర్ ఉద్యమం కూడా యువత శక్తిని ప్రపంచానికి చూపించింది. జాతి వివక్షకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ ఉద్యమం కొన్ని రోజుల వ్యవధిలోనే అనేక దేశాలకు విస్తరించింది. సోషల్ మీడియా వేదికగా లక్షలాది మంది యువత ఐక్యతను ప్రదర్శించారు. హాంకాంగ్‌లో ప్రజాస్వామ్య హక్కుల కోసం జరిగిన పోరాటాలు, లాటిన్ అమెరికా దేశాల్లో విద్యార్థి ఉద్యమాలు, యూరప్‌లో వాతావరణ ఉద్యమాలు, ఆసియా దేశాల్లో ప్రజాస్వామ్య హక్కుల కోసం జరిగిన ఆందోళనలు అన్నీ జెన్-జీ తరంలోని చైతన్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి.అయితే జెన్-జీ ఉద్యమాల ప్రత్యేకత కేవలం సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలోనే లేదు. నాయకత్వాన్ని చూసే విధానంలో కూడా ఉంది. గతంలో ఉద్యమాలకు ఒక నాయకుడు, ఒక పార్టీ, ఒక సంస్థ ఉండేది. కానీ నేటి ఉద్యమాలు వికేంద్రీకృత స్వభావాన్ని సంతరించుకున్నాయి. ఒక నాయకుడిని అరెస్టు చేసినా ఉద్యమం ఆగిపోదు. ఒక సంస్థను నిషేధించినా చైతన్యం నిలిచిపోదు. వేలాది మంది యువత స్వతంత్రంగా స్పందిస్తూ ఉద్యమాలను ముందుకు తీసుకువెళ్తున్నారు.ఈ తరానికి కళ కూడా ఒక శక్తివంతమైన ఆయుధంగా మారింది. పాటలు, పోస్టర్లు, కార్టూన్లు, మీమ్స్, షార్ట్ వీడియోలు, డిజిటల్ ఆర్ట్, వీధి నాటకాలు ఉద్యమాల్లో భాగమవుతున్నాయి. ఒకప్పుడు ప్రజా నాటకాలు, జానపద కళారూపాలు గ్రామాలను చైతన్యపరిచినట్లే, నేడు రీల్స్, వీడియోలు, డిజిటల్ కళారూపాలు యువతను ప్రభావితం చేస్తున్నాయి. అయితే అసలు సూత్రం మారలేదు. ప్రజల జీవితాలను తాకిన కళ మాత్రమే సమాజంలో మార్పుకు దోహదపడుతుంది.భారతదేశ యువత కూడా ఈ మార్పులను గమనించాల్సిన అవసరం ఉంది. ప్రపంచీకరణ, నిరుద్యోగం, విద్యా సంక్షోభం, పర్యావరణ విధ్వంసం, కుల వివక్ష, లింగ అసమానతలు వంటి సమస్యలు నేటి యువత ముందున్న సవాళ్లు. సోషల్ మీడియాలో స్పందించడం మాత్రమే కాకుండా ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను అర్థం చేసుకోవడం, సంఘటిత చర్యలకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా అవసరం. డిజిటల్ ప్రపంచం ఉద్యమాలకు ఇంధనం అందించవచ్చు; కానీ శాశ్వత మార్పు మాత్రం ప్రజల మధ్య జరిగే చైతన్య ప్రక్రియ ద్వారానే సాధ్యమవుతుంది.నేటి ప్రపంచం కృత్రిమ మేధస్సు, డేటా ఆధారిత ఆర్థిక వ్యవస్థ, వాతావరణ సంక్షోభం, రాజకీయ అస్థిరత వంటి కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ సవాళ్లను ఎదుర్కొనే తరమే జెన్-జీ. వారు కేవలం ఉద్యోగాల కోసం పోటీ పడే తరం కాదు. ప్రశ్నించే తరం. అన్యాయాన్ని ఎదిరించే తరం. సమానత్వాన్ని కోరుకునే తరం. భిన్నత్వాన్ని గౌరవించే తరం. సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాజిక మార్పు కోసం వినియోగించే తరం.ప్రపంచ చరిత్రలో ప్రతి యుగానికి ఒక ప్రత్యేక తరం ఉంటుంది. స్వాతంత్ర్య పోరాటాలకు ఒక తరం నాయకత్వం వహించింది. కార్మిక ఉద్యమాలకు మరో తరం దారిచూపింది. నేడు డిజిటల్ యుగంలో సామాజిక న్యాయం, పర్యావరణ పరిరక్షణ, ప్రజాస్వామ్య హక్కులు, మానవ సమానత్వం కోసం ముందుకు వస్తున్న తరం జెన్-జీ. ఈ తరం కేవలం భవిష్యత్తు పౌరులు కాదు; నేటి ప్రపంచాన్ని పునర్నిర్మిస్తున్న సామాజిక శక్తి.అందుకే లెనిన్ చెప్పిన మాటలు మరోసారి గుర్తుకు వస్తాయి. యువతను కదిలించగలిగితే సమాజాన్ని కదిలించవచ్చు. యువత చైతన్యవంతమైతే దేశం చైతన్యవంతమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న జెన్-జీ ఉద్యమాలు అదే సత్యాన్ని మరోసారి రుజువు చేస్తున్నాయి.



భూపతి వెంకటేశ్వర్లు
తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం
(TPSK)9490098343

# సినీ దిగ్గజం భారతీరాజా కన్నుమూత

- **తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమల్లో విషాదం**
- **84 ఏళ్ల వయసులో చెన్నైలో తుదిశ్వాస**
- **అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి**
- **ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు**
- **'పదహారేళ్ల వయసు'తో దర్శకుడిగా సంచలనం**
- **తెలుగు ప్రేక్షకులకు చిరస్మరణీయ చిత్రాల అందజేత**
- **ఆరు జాతీయ అవార్డులు, నాలుగు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు**
- **పద్మశ్రీతో సత్కరించిన కేంద్ర ప్రభుత్వం**
- **కుమారుడి మరణంతో తీవ్ర మనోవేదన**
- **భారతీయ సినీ చరిత్రలో చెరగని ముద్ర**

**చెన్నై వెలుతురు జూన్ 10:**

తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ దర్శకుడు, నటుడు భారతీరాజా కన్నుమూశారు. 84 ఏళ్ల వయసులో చెన్నైలోని తన నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న భారతీరాజా చికిత్స పొందుతుండగా ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది.భారతీయ సినీ చరిత్రలో గ్రామీణ కథలకు కొత్త నిర్వచనం ఇచ్చిన దర్శకుడిగా భారతీరాజా ప్రత్యేక గుర్తింపు పొందారు. సహజత్వానికి పెద్దపీట వేస్తూ తెరపై గ్రామీణ జీవితాన్ని ఆవిష్కరించిన దర్శకుల్లో ఆయన అగ్రగణ్యుడు.

'పదహారేళ్ల వయసు'తో దర్శకుడిగా ఆరంగేట్రం

1941 జూలై 17న జన్మించిన భారతీరాజా, 1977లో విడుదలైన తమిళ చిత్రం '16 వయథినిలే' ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యారు. ఈ చిత్రం తెలుగులో 'పదహారేళ్ల వయసు'గా విడుదలై విశేష ఆదరణ పొందింది. గ్రామీణ నేపథ్య కథలను భావోద్వేగాలతో మేళవించి చెప్పడంలో ఆయనకు ప్రత్యేకమైన శైలి ఉండేది.దర్శకుడిగా తొలి చిత్రంతోనే తమిళ సినీ పరిశ్రమలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన ఆయన, అనంతరం వరుస విజయాలతో అగ్రదర్శకుడిగా ఎదిగారు.

తెలుగులోనూ చిరస్మరణీయ చిత్రాలు

'కొత్త జీవితాలు' చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టిన భారతీరాజా, అనేక క్లాసిక్ చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు అందించారు. ముఖ్యంగా 'సీతాకోకచిలుక', 'ఆరాధన', 'జమదగ్ని' వంటి చిత్రాలు ఆయన ప్రతిభకు నిదర్శనాలుగా నిలిచాయి.ప్రేమ, కుటుంబ బంధాలు, గ్రామీణ సంస్కృతి, మానవ సంబంధాలను హృద్యంగా ఆవిష్కరించిన ఆయన చిత్రాలు ప్రేక్షకుల మన్ననలు పొందాయి. తెలుగులో తెరకెక్కించిన పలు చిత్రాలు వాణిజ్యపరంగానే కాక విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్నాయి.

అవార్డులతో అలంకరించిన ప్రస్థానం

భారతీరాజా సినీ ప్రయాణం అనేక పురస్కారాలతో అలంకరించబడింది. ఆయనకు ఆరు జాతీయ చలనచిత్ర అవార్డులు, నాలుగు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు లభించాయి. 'సీతాకోకచిలుక' చిత్రానికి జాతీయ పురస్కారంతో పాటు ఉత్తమ దర్శకుడిగా నంది అవార్డు కూడా అందుకున్నారు.దర్శకుడిగానే కాక రచయితగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. 'మంగమ్మగారి మనవడు' చిత్రానికి కథ అందించగా, 'పల్నాటి పౌరుషం' చిత్రానికి స్క్రీన్‌ప్లే రచించారు. తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధిలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు.



పద్మశ్రీతో గౌరవం

సినీ రంగానికి అందించిన విశిష్ట సేవలను గుర్తించి భారత ప్రభుత్వం 2004లో భారతీరాజాను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. భారతీయ సినిమా అభివృద్ధికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవం లభించింది.

దర్శకుడిగా మాత్రమే కాకుండా నటుడిగానూ ఆయన విశేష గుర్తింపు పొందారు. తన కెరీర్ చివరి దశలో కూడా పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులను అలరించారు.

చివరిసారి వెండితెరపై

ఇటీవల విడుదలైన మోహన్‌లాల్ నటించిన 'తుడురమ్' చిత్రంలో భారతీరాజా చివరిసారిగా వెండితెరపై కనిపించారు. వయస్సు మీదపడినా నటనపై ఉన్న ఆసక్తిని చివరి వరకు కొనసాగించారు.

కుమారుడి మరణంతో కుంగిపోయిన దర్శకుడు

గత ఏడాది భారతీరాజా కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన కుమారుడు, నటుడు మనోజ్ భారతీరాజా గుండెపోటుతో కన్నుమూశారు. కేవలం 48 ఏళ్ల వయసులో కుమారుడిని కోల్పోవడం భారతీరాజాను తీవ్రంగా కలిచివేసింది.ఈ సంఘటన తర్వాత ఆయన మానసికంగా కుంగిపోయినట్లు సన్నిహితులు తెలిపారు. పలువురు సినీ ప్రముఖులు ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇటీవల ప్రముఖ నటి రాధిక ఆయనను కలిసిన సందర్భంలో కూడా ఆమె నటించిన చిత్రానికి జాతీయ అవార్డు వచ్చే అవకాశముందని ప్రోత్సహించినట్లు సినీ వర్గాలు గుర్తుచేసుకుంటున్నాయి.

చెరగని ముద్ర

నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రయాణంలో భారతీరాజా అనేక మంది నటులు, సాంకేతిక నిపుణులకు మార్గదర్శకుడిగా నిలిచారు. గ్రామీణ కథనాలకు కొత్త జీవం పోసి, భారతీయ సినిమాకు ప్రత్యేకమైన దిశను చూపించిన దర్శకుడిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది.ఆయన మరణంతో భారతీయ చిత్ర పరిశ్రమ ఒక గొప్ప దర్శకుడిని, సృజనాత్మక శక్తిని కోల్పోయింది.

# కిషన్ రెడ్డి గారిపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు తగవు

- **రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలి**
- **బీజేపీ నాయకుడు రఘు గౌడ్ బొంగు**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 10:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గారిపై బహిరంగ సభల్లో చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని బీజేపీ నాయకుడు రఘు గౌడ్ బొంగు విమర్శించారు.ప్రజా సమస్యలు, రైతుల ఇబ్బందులు, అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడాల్సిన ముఖ్యమంత్రి, రాజకీయ విమర్శలకే ప్రాధాన్యత ఇవ్వడం దురదృష్టకరమన్నారు. ఉప్పల్ ప్రాంత అభివృద్ధి, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమలు వంటి అంశాలపై సమాధానం చెప్పకుండా కిషన్ రెడ్డి గారిని లక్ష్యంగా చేసుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని అన్నారు. కిషన్ రెడ్డి గారు అధికారం కోసం పార్టీలు మారిన నాయకుడు కాదని, ఒకే సిద్ధాంతంతో ప్రజా జీవితాన్ని కొనసాగిస్తున్న నాయకుడని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారం, జాతీయ రహదారుల విస్తరణ, చర్లపల్లి టెర్మినల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ, కాజీపేట రైల్వే అభివృద్ధి వంటి కార్యక్రమాలు ప్రజలకు క నిపిస్తున్నాయ న్నారు. ఎ న్నిక ల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, మహిళలకు హామీ ఇచ్చిన



ఆర్థిక సహాయం, రైతులకు ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.రైతులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను పక్కనబెట్టి రాజకీయ విమర్శలు చేయడం ద్వారా ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకుని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రికి సూచించారు.ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అని బొంగు రఘు గౌడ్ పేర్కొన్నారు.

# డిసెంబర్‌లో అంతర్జాతీయ స్మార్ట్ ఎలక్ట్రానిక్స్ కాన్ఫరెన్స్

- **ప్రపంచ నిపుణుల సమాగమానికి ఐకాన్ టెక్ వేదిక**
- **యూకే, తైవాన్, మలేషియా సహా పలు దేశాల శాస్త్రవేత్తల పాల్గొనడం**
- **ఎంపికైన పరిశోధనా పత్రాలకు స్కోపస్ ఇండెక్స్డ్ ఏఐపీ ప్రచురణ అవకాశం**

**శంకర్ పల్లి వెలుతురు జూన్ 10 :**

డిసెంబర్ 15, 16 తేదీల్లో అంతర్జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు సంస్థ వైస్ ఛాన్సలర్ డాక్టర్ టి. కోటిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ స్మార్ట్ ఎలక్ట్రానిక్స్, వి ఎల్ ఎస్ ఐ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్" పేరిట ఈ




సదస్సును నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్ డిజైన్, స్మార్ట్ పరికరాలు, ఆధునిక కమ్యూనికేషన్ టెక్నాలజీలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ రంగాల్లో జరుగుతున్న తాజా పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, భవిష్యత్ అవకాశాలపై చర్చించేందుకు ఈ అంతర్జాతీయ సదస్సు వేదికగా నిలుస్తుందని చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్, తైవాన్, మలేషియా తదితర దేశాల నుంచి ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే దేశంలోని ప్రతిష్ఠాత్మక భారతీయ సాంకేతిక విద్యాసంస్థలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లకు చెందిన నిపుణులు కూడా తమ పరిశోధనలను ప్రదర్శించనున్నారని వెల్లడించారు. యువ శాస్త్రవేత్తలు సమర్పించిన పరిశోధనా పత్రాల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ ద్వారా ప్రచురిస్తామని డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు. స్కోపస్‌లో ఇండెక్స్ చేయబడిన ఈ ప్రచురణల ద్వారా పరిశోధకులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని, వారి విద్యా, వృత్తిపరమైన అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ కె.ఎల్. నారాయణ, డాక్టర్ శ్రీలలిత విన్నకోట, డాక్టర్ కౌశిక్ మిద్యా, డాక్టర్ అసిసా కుమార్ పాణిగ్రాహి, డాక్టర్ అఖేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్లలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ

- **1363 సర్వే నెంబర్ లో ఉన్న పేద రైతులకు పట్టాదారు పాస్ బుక్ లు ఇవ్వాలని రైతుల ఆందోళన**
- **గ్రామంలో త్రాగునీటి సమస్య భూ సమస్యలు పరిష్కరించాలి**
- **గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్**

**మంచాల వెలుతురు జూన్ 10:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్ర ణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరుట్ల గ్రామపంచాయతీ పాలక మండలి గ్రామ సర్పంచ్ మానిపా టి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు గ్రామ సభలో ప్రజలు వివిధ సమస్యలపై అధికారులను నిలదీశారు ముఖ్యంగా 1363 సర్వేనెంబర్ లోఉన్న పేద ప్రజలకు పట్టాదారు పాస్ ఇవ్వాలని ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ సిపిఎం పార్టీ నాయకులు పుల్లగళ్ల గోపాల్ బద్దు విజయ్ కుమార్ ప్రజాగళం దామెర భూపాల్ రైతులతో కలిసి మంచాల మండలం తహసిల్దార్ వెంకట ప్రసాద్ రావు గ్రామసభలో ప్రసంగిస్తుం డగానే సర్వేనెంబర్ 1363 రికార్డులో ఉన్న రైతులకు పట్టాదారు పాస్ బుక్ లు ఇవ్వాలని తహసిల్దార్ గారిని నిలదీశారు ఈ సందర్భంగా రైతులు నాయకులు మాట్లాడుతూ 1363 సర్వేనెంబర్ లోఉ న్న రైతుల రికార్డులను గత బిఆర్ ఎస్ ప్రభుత్వం తొలగించింది అన్నారు ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగిన పట్టాదారు పాస్ బుక్ లు ఇస్తామని చెప్పారు ఇప్పటివరకు ఏఒక్క రైతుకు పాస్ బుక్ ఇవ్వలేదు అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ భూములు సాగు చేసుకుని జీవిస్తున్న పేద రైతులందరికీ పట్టాదారు పాస్ బుక్ లు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు మాట నిలబెట్టుకోలేదు అన్నారు భూభారతిలో దరఖాస్తు చేసుకొని రెం డేళ్లు గడుస్తున్న పేదరైతులకు మాత్రం న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే స్పందించిన తహసిల్దార్ వెంకట ప్రసాద్ రావు తప్పకుండా రైతులకు న్యాయం చేస్తాను అని చె ప్పడంతో ఆందోళన విరమించారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్ మా ట్లాడుతూ గ్రామంలో భూసమస్యలు ఇంకా చాలా ఉన్నాయి రైతులు చెప్పులు అరి గేలా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పని కావడం లేదని రైతులు నాదృష్టికి తీసుకొ చ్చారని గ్రామ సర్పంచ్ మానిపాటి శోభ గుర్తు చేశారు ఆరుట్ల గ్రామంలో




మిషన్ భగీరథ త్రాగునీ రు సక్రమంగా సరపరా గాక ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే అధికారులు స్పందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిగ్రామంలోనిభూసమస్య లుత్రాగు నీటి సమస్య వివిధ సమస్యలు పరిష్కరించాలని అన్నారు ఈ గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్లు కొ త్త పింఛన్ల గురించి చర్చ జరిగింది తప్పకుండా అర్హులైన వారందరికీ పింఛన్లు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం అని అధికారులు అన్నారు కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి చిలుక ల వెంకటేష్ గ్రామపంచాయతీ వార్డుసభ్యులు పంది శేఖర్ కొండిగారి శ్రావణ్ కుమార్ అనంగల్ల జ గన్నాథం మంద మాధవి మోహన్ రెడ్డి పూన్నం రాము మనిపాటి.బాను ప్రసాద్ మొర్రి పద్మ ఐల య్య మాడుగుల బాలమణి కృష్ణ గౌడ్ లాలగారి మణెమ్మ వివిధ శాఖల అధికారులు వివిధ పార్టీ ల నాయకులు తదితరులు పాల్గొన్నారు .

# సంపద కార్పొరేట్‌లకు భారాలు ప్రజలకు –ఇదే మోడీ ఆర్థిక విధానం

- **ధరల దోపిడీపై, ప్రజలపై మోపిన భారాన్ని వెంటనే తగ్గించాలి**
- **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు CPI ఆధ్వర్యంలో నిరసన ధర్నా**

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 10:**

దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్–డీజిల్, వంటగ్యాస్, విద్యుత్ చార్జీలు, విద్యా–వైద్య ఖర్చులు నిరంతరం పెరుగుతూ సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరంగా మారుస్తున్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ధరల నియంత్రణలో పూర్తిగా విఫలమయ్యాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీవ్రంగా ఖండిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వియస్.బోస్ అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సమితి పిలుపులో భాగంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వియస్.బోస్ మాట్లాడుతూ....ప్రజల జీవన వ్యయం ఎంత బాగా పెరిగిందని, 2014లో సుమారు ₹410 ఉన్న గృహ వినియోగ LPG సిలిండర్ ధర ప్రస్తుతం ₹1150 దాటిందన్నారు, అంటే 100 శాతానికి పైగా పెరుగుదల అయిందన్నారు. పెట్రోల్ ధరలు లీటర్‌కు ₹70 నుండి ₹117కు చేరుకున్నాయని, డీజిల్ ధరలు కూడా భారీగా పెరిగాయన్నారు. వంటనూనె ధరలు కొన్నేళ్లలో లీటర్‌కు ₹90–100 నుండి ₹170–200 వరకు పెరిగాయని, పప్పుధాన్యాలు, కూరగాయలు, పాలు, గుడ్లు, బియ్యం ధరలు నిరంతరం పెరుగుతుండటంతో ఒక మధ్యతరగతి కుటుంబం నెలవారీ ఖర్చు గత దశాబ్దంలో దాదాపు రెట్టింపు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో "అచ్చే దిన్", "అభివృద్ధి" పేరుతో గొప్పలు చెప్పిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ నేడు ధరల పెరుగు




దలపై ఒక్క మాట మాట్లాడటం లేదన్నారు.అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు తగ్గడం లేదన్నారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రాయితీలు ఇచ్చే ప్రభుత్వాలకు ప్రజలకు సబ్సిడీలు ఇవ్వడం భారంగా ఎందుకు కనిపిస్తోందని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోతే, మార్కెట్లో మాత్రం అధిక ధరలకు ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వాలు కనీసం ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుంటే ప్రభుత్వాలు ఎవరికి పాలన చేస్తున్నాయని, దేశ సంపద కొద్దిమందికే – కష్టాలు కోట్లాది ప్రజలకా అని ఎద్దేవా చేశారు. ఒకవైపు కొద్దిమంది కార్పొరేట్ సంస్థల సంపద లక్షల కోట్ల రూపాయల మేర పెరుగుతుంటే, మరోవైపు సాధారణ కుటుంబాలు నెలాఖరు ఖర్చులు తీర్చలేని పరిస్థితికి చేరుకున్నాయన్నారు . ఇది ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాల ఫలితమేనని వారు ఆరోపించారు.ఈసందర్భంగా సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ....ప్రజల కష్టాలు పట్టించుకోకుండా ప్రచార ఆర్భాటాలకు, కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని సీపీఐ హెచ్చరిస్తోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే నియంత్రించాలని, పెట్రోల్, డీజిల్, LPG గ్యాస్ ధరలను తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రైతులకు గిట్టుబాటు ధరలు, వినియోగదారులకు సరసమైన ధరలు అందించాలని, విద్య, వైద్యం, విద్యుత్, రవాణా రంగాల్లో ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. నిల్వదారులు, కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సిపిఐ కార్యవర్గం జిల్లా డిఆర్ఓ మాలతీకి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. CPI నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువజనులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ధరల పెరుగుదలపై ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టకపోతే CPI ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ.దామోదర్ రెడ్డి, డీజీ.సాయిలు గౌడ్, తోటపల్లి శంకర్, హరినాథ్ రావు, కె. స్వామి, టి.సత్య ప్రసాద్, రచ్చ కిషన్, నిమ్మల నర్సింహా, యాదయ్య గౌడ్, కృష్ణ, లక్ష్మీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మణ్, మండల కార్యదర్శులు దర్శనం యాదగిరి, స్వామి, పి.శ్రీనివాస్, బాబు, నాగరాజు, నరేంద్ర ప్రసాద్, ఈశ్వర్, రాములు గౌడ్, ప్రజానాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు ప్రమీల, వెంకటాచారి మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హైమావతి గిరిజన సమాఖ్య స్వరూప, జిల్లా కౌన్సిల్ సభ్యులు నర్సింహారెడ్డి, మాధవి, రాంనారాయణ, నర్సింహ, మహాలక్ష్మి, బాపిరాజు, బాలరాజ్, జయచంద్ర, ఇస్తరి, దస్తగిరి, వెంకటరమణ, బషీర్, అన్వార్, మహేష్, అజీజ్, గిరిజ, మణెమ్మ, రమ, సదానంద్, నర్సింహారెడ్డి, బాబు, జంగయ్య, అశోక్, వెంకటేష్ లతో పాటు వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## హిమాయత్ నగర్ డివిజన్లో సహాయక చర్యలు చేపట్టిన మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 10:**



హిమాయత్ నగర్ లో మంగళవారం సాయంత్రం కురిసిన వాన, గాలికి హిమాయత్ డివిజన్ లోని జైస్వాల్ లేన, వై యమ్ సి ఎ, స్ట్రీట్ నెంబర్ 7, స్ట్రీట్ నెంబర్ 18, ఆయిల్ సీడ్స్ కాలనీ, బషీర్బాగ్ మొదలైన ప్రాంతాలలో షర్ట్లు , స్తంభాలు ఊడిపడడంతో చాలాచోట్ల ప్రజలు ఇబ్బందిలకు గురయ్యారు. అకాల వర్షం వల్ల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ వెంటనే తమ టీం నీ అలోడ్ చేసి అవసరమైన స్థానాలలో వెళ్లి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆదేశాల మేరకు వారి క్యాంపు కార్యాలయంలో వార్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజల నుండి వచ్చే ప్రతి ఫోన్ కాల్ ని తీసుకుంటూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీంతోపాటు బుధవారం రోజున ఉదయం ఎక్కడైతే విద్యుత్ సరఫరా నిలిచిపోయిందో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయో ఆ చోట్ల తాను స్వయంగా వెళ్లి అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరలో విద్యుత్ సరఫరాలను కుమ్మరిదించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి రామన్ గౌడ్, శేఖర్, రాజేంద్ర గౌడ్, మోసిన్, జగదీష్, సాయి, జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## అమీర్ పేట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్




**హైదరాబాద్ వెలుతురు జూన్ 10:**

అమీర్ పేట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను బుధవారం రోజున హైదరాబాద్ జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, నాన్ కమ్యూనికేబుల్ డిసీస్, కమ్యూనికేబుల్ డిసీస్ కార్యక్రమాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాస్ సమీక్షించారు.అమీర్పేట్ క్లస్టర్ పరిధిలో వివిధ ఆరోగ్య కార్యక్రమాల , పథకాల టార్గెట్స్ సకాలంలో పూర్తి చేయాలని డాక్టర్ శ్రీనివాస్ కోరారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలనిసూచించారు.ఈ సమీక్షలో అమీర్పేట్ క్లస్టర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హేమలత, వైద్యులు , జిల్లా మాస్ మీడియా అధికారి జక్కుల రాములు, ఆంజనేయులు, సబ్ యూనిట్ ఆఫీసర్ , సిబ్బంది పాల్గొన్నారు.

## మంచాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**మొక్కలు నాటిన ఎంపీడీవో వసంతలక్ష్మి, గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్**

**మంచాల వెలుతురు జూన్ 10:**



మంచాల మండల కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఎంపీడీవో వసంత లక్ష్మి గారితో కలిసి మంచాల గ్రామసర్పంచ్ ఏర్పుల మానస వినయ్ మొక్కలు నాటారు వచ్చే వర్షా కా లంలోగ్రామ పరిధిలో మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు గ్రామ పరిధి లోఉన్న నర్సరీని సందర్శించారు అనంతరం నూతనంగా మంచాల మండల ఎంపీడీవో గా బాధ్య తలు చేపట్టిన వసంత లక్ష్మిగారిని సన్మానించి మంచాల అభివృద్ధికి తోడ్పడాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఈసి విమల టిపి శేకర్ గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ వార్డు స భ్యులు గ్యార జంగయ్య నీళ్ల పారిజాత కృష్ణ గడ్డం పారిజాత బాబయ్య గడ్డం కల్పన కుమార్ మ రియు ఎలమోని యాదయ్య, ఏర్పుల నరసింహగ్యార శరత్ ఫీల్డ్ అసిస్టెంట్ కుమారస్వామి పాల్గొన్నారు.

## ఆరుట్ల గ్రామం నుండి మీర్ ఖాన్ పేట్ ఫోర్త్ సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ నాయకులు




**మంచాల వెలుతురు జూన్ 10:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం ఆ ధ్వర్యంలో కందుకూరు మండలం మీర్ ఖాన్ పేట్ గ్రామంలో శ్రీ గౌరవ మఖ్యమంత్రి. రేవంత్ రెడ్డి గారు ప్రారంభించే ఫోర్త్ సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆరుట్ల గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీ నా యకులు కార్యకర్తలు మహిళా సంఘాల మహిళలు పెద్దఎత్తున బయలుదేరి వెళ్లారు ఈ కార్యక్ర మంలో మంచాల వ్యవసాయ సహకారసంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీరాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కంబాలపల్లి బుగ్గరాములు ఆ రుట్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుడిగల పరమేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుడ్డి మల్ల చంద్రయ్య ముదిరాజ్ చిందం ఐలయ్య మనిపాటి వెంకటేష్ మార సురేష్ పంబాల శివకు మార్ గడ్డం సత్తయ్యగౌడ్ మహమ్మద్ రఫీక్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆడెపు మధు ఎండి అష్రఫ్ గౌరిగే కృష్ణ ఎన్నుదుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్య పరిష్కరిస్తా : పాపిరెడ్డి నగర్ అధ్యక్షులు చంద్రారెడ్డి

**కూకట్ పల్లి జూన్ 10 వెలుతురు:**



బస్తీలో నెలకొనే ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరిస్తానని పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం కురిసిన వర్షంతో బస్తీలోని పలు రోడ్లలో వరద నీరు నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న చంద్రారెడ్డి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో బుధవారం సంబంధిత అధికారులు ఆయా ప్రాంతంలో పర్యటించి వారి సిబ్బంది చేత వరద నీరు రోడ్లపై నిల్వకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంలో చంద్రారెడ్డి బస్తి వాసులతో కలిసి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ సుధాకర్ , అస్బస్టస్ కాలనీ అధ్యక్షుడు నరేష్ , నేతలు కె.యాదగిరి , శంకర్ రెడ్డి లక్ష్మణ్, దాకోరి తిరుపతిరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# జల శక్తి అభియాన్‌లో భాగంగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

**నార్కెట్‌పల్లి వెలుతురు జూన్ 10:**



జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) నల్లగొండ ఆధ్వర్యంలో "జలసంచయ్ – జల భాగేదారి" ప్రచార కార్యక్రమం, జల శక్తి అభియాన్‌లో భాగంగా అక్కెనపల్లి, నక్కలపల్లి, జువ్విగూడెం, నెమ్మని గ్రామాల్లో కళాజాత బృందం ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల పరిరక్షణకు సంబంధించిన పలు కార్యక్రమాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇంటి కప్పు వర్షపు నీటి సంరక్షణ పనులు, నీటి సంరక్షణ గుంటలు, బోరుబావుల పునరుద్ధరణ, పురాతన బావుల పూడికతీత, సమతల కందకాలు, ఖండిత కందకాలు, నీటి నిల్వ కందకాలు, మట్టి కట్టలు, వీడి రాళ్ల కట్టలు, రాళ్ల కట్టలు, చెక్‌డ్యాంల పూడికతీత మరియు నిర్మాణం, చెక్‌వాల్‌ల పూడికతీత మరియు నిర్మాణం, ఫారం పాండ్‌లు, చేపల కుంటలు, చెరువుల పూడికతీత వంటి అంశాలపై వివరించారు.జల వనరులను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని, ప్రతి గ్రామస్థుడు నీటి సంరక్షణలో భాగస్వామి కావాలని అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ శిరీష, టెక్నికల్ అసిస్టెంట్లు నర్సింహారెడ్డి, అశోక్, కృష్ణవేణి, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పున్న కైలాష్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

**నార్కెట్‌పల్లి వెలుతురు జూన్ 10:**

నల్గొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ పుట్టినరోజు సందర్భంగా ఆయన ఆత్మీయులు పల్ల రవితేజ, దామనూరి అశోక్, రాధారాపు దశరథ్, గొడుగు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో "మనం స్వచ్ఛంద సంస్థ" నిర్వహిస్తున్న నిత్య ఉచిత భోజన కార్యక్రమంలో ప్రత్యేక అన్నదానం నిర్వహించారు.సంస్థ చేపడుతున్న 582వ రోజు అన్నదాన కార్యక్రమంలో భాగంగా నిరుపేదలు, నిస్సహాయులు, భిక్షాటన చేసేవారు, బాటసారులకు చికెన్ బిర్యానీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తూ అనేక కుటుంబాల్లో వెలుగులు నింపిన నాయకుడు పున్న కైలాష్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు.గొడుగు అనిల్ కుమార్ మాట్లాడుతూ, తమ కుటుంబానికి సంబంధించిన ప్రతి ముఖ్యమైన రోజును నిరుపేదల ఆకలి తీర్చేందుకు వినియోగించడం ఆనవాయితీగా మారిందన్నారు. ఈ సృష్టిలో ఆకలికి మించిన లోటు మరొకటి లేదని, ఆకలితో ఎవరూ బాధపడకూడదనే సంకల్పంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి మోజేష్, జిట్ట శ్రీకాంత్, బోడ నందు తదితరులు పాల్గొన్నారు.

# 2016 దివ్యాంగుల హక్కుల చట్టం పార్లమెంట్లో మాట్లాడి చట్టం అమలు చేపిస్తా

**భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**రామన్నపేట వెలుతురు వెలుతురు న్యూస్ 10:**

దివ్యాంగుల కోసం 2016 చట్టం అమల్లోకొచ్చి 10 సంవత్సరాలు పూర్తి అయిన అందులో ఉన్న ఒక్క అంశం కూడా అమలు కాకపోవడంతో దేశవ్యాప్తంగా దివ్యాంగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్ని సమస్యలు పరిష్కారం కావడానికి ఏర్పడిన చట్టం 2016 దివ్యాంగుల చట్టం అమలు కాకపోవడంతో పార్లమెంట్లో దివ్యాంగుల పక్షాన మాట్లాడి చట్టం అమలుకు కృషి చేస్తానని అందులో అంశాలపై భవిష్యత్తులో దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి దివ్యాంగుల విశ్వ విద్యాలయాల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్. అశోక్ హైదరాబాదులో గచ్చిబౌలి తన నివాసానికి పిలిపించుకొని వికలాంగుల అంశాలపై చర్చించి డాక్టర్ అశోక్ రూపొందించిన దివ్యాంగుల ముఖ్యాంశాలు దివ్యాంగుల 2016 చట్టం పుస్తకాన్ని చూసి ప్రతి అంశాన్ని చదివి అధ్యయనం చేసిన ఎంపి పార్లమెంట్లో మాట్లాడి చట్టం అమలుకై కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీటీసీ తాటిపాముల శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# నీటి పైపులైన్ మరమ్మత్తు మరిచిర్రు

**మోత్కూర్, వెలుతురు జూన్ 10:**



మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో లీకేజీ మరమ్మతుల కోసం తవ్విన గుంతను అదేవిధంగా వది లేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నట్లు తెలిపారు . టీవీఎస్ షోరూం నుంచి సుందరయ్య కాలనీకి వెళ్లే రహదారిపై సీసీ రోడ్డు కింద ఉన్న వాటర్ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో గత వారం రోజుల క్రితం మున్సిపల్ సిబ్బంది రోడ్డు మధ్యలో గుంతను తవ్వారు . అయితే లీకేజీ మరమ్మతులు పూర్తి చేయకుండా గుంతను అలాగే వదిలేయడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు మధ్యలో నీరు నిల్వ ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని వారు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంత స్పష్టంగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై మున్సిపల్ సిబ్బందిని ప్రశ్నిస్తే మరమ్మతు పనులు చేపట్టే సిబ్బంది ఇంకా రాలేదని సమాధానం చెబుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో లీకేజీ కంటే నిర్లక్ష్యమే పెద్ద సమస్యగా మారిందని వారన్నారు. రహదారి మధ్యలోనే గుంట ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అధికారులు వెంటనే లీకేజీ మరమ్మతులు పూర్తి చేసి, గుంటను పూడ్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు అధిరోహించాలి

**ఎమ్మెల్యే మందుల సామెల్**

**మోత్కూర్, జూన్ 10,వెలుతురు న్యూస్ :**



విద్యార్థులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని, చదువులో ఉన్నతంగా రాణించి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ఆకాంక్షించారు. సోమవారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్ లో మోత్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యొక్క పదవ తరగతి విద్యార్థులు ఎవరైతే పరీక్షల్లో 500 కు పైగా మార్కులు సాధించారో ఆ విద్యార్థులను ఘనంగా సన్మానించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే అత్యుత్తమ బోధన అందుతుందని, వాటి ఫలితంగా పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువా ,మెమెంటో, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ట్రిబుల్ ఐటీ బాసరలో ప్రవేశం పొందిన కొక్కుల ఉషశ్రీ ని నగదు పురస్కారం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు, ఉపాధ్యాయులు ఇండ్ల.రాంప్రసాద్ ,బత్తిని .రామకృష్ణ ,ధర్మారపు వెంకటయ్య,జినుకల ప్రవీణ్, జె.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మగ్గం, ఎంబ్రాయిడరీ శిక్షణతో ఆర్థిక స్వావలంబన సాధించాలి: అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు

**గద్వాల, జూన్ 10,వెలుతురు న్యూస్ :**



గ్రామీణ యువతులు, మహిళలు మగ్గం వర్క్, ఎంబ్రాయిడరీ వంటి నైపుణ్యాలను నేర్చుకుని స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు సూచించారు. యూనియన్ ఆర్‌సెటీ ఆధ్వర్యంలో గద్వాలలో నిర్వహిస్తున్న ఉచిత మగ్గం వర్క్, ఎంబ్రాయిడరీ శిక్షణ కొత్త బ్యాచ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ యువతులు, మహిళలను నైపుణ్యవంతులైన స్వయం ఉపాధి దారులుగా, సూక్ష్మ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు భవిష్యత్తులో స్వయం సహాయక సంఘాలతో అనుసంధానమై విజయవంతమైన సూక్ష్మ వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల విస్తరణలో మహిళా సంఘాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం పరిశ్రమల శాఖ ద్వారా అందుబాటులో ఉన్న ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, సబ్సిడీలు, పారిశ్రామిక అవకాశాలను వినియోగించుకుని స్వయం ఉపాధి రంగంలో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎల్. శ్రీనివాసరావు, యూనియన్ బ్యాంక్ ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ రాముడు, యూనియన్ ఆర్‌సెటీ డైరెక్టర్ డి.ఎం. శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు సందర్భంగా

**ఎంపీ చామల ఆశీస్సులు తీసుకున్న టీపీసీసీ నాయకులు యుగంధర్.**



**మోత్కూర్, జూన్ 10,వెలుతురు న్యూస్ :**

మోత్కూరు మండలం సదర్శాపురం గ్రామానికి చెందిన టీపీసీసీ నాయకుడు, అడ్వకేట్ పరైపాటి యుగంధర్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ గాంధీ భవన్ లో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ఎంపీ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి యుగంధర్ కు శాలువా కప్పి సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వంగాల సత్యనారాయణ,మున్సిపల్ కౌన్సిలర్ బీసు శ్రీకాంత్ గౌడ్, నాయకులు బీసు రవి, శ్రవణ్,ఎం డి జానీ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయంలో ఘనంగా మండల పూజ కార్యక్రమం

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 10:**



నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్థంభ ప్రతిష్ఠాపనకు 41 రోజులు పూర్తైన సందర్భంగా బుధవారం మండల పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ బూరుగు జనార్ధన్, యాద వెంకన్న గుప్త దంపతులు, ఆలయ అర్చకులు గుండేపూడి జానకిరామశర్మ, ఉత్తరపల్లి నరసింహాచార్యుల ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ మండప పూజ, ప్రధాన కలశారాధన, సర్వతోభద్ర మండల పూజ, వాస్తు క్షేత్రపాలక ఆహ్వానం నిర్వహించారు. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామివారికి పంచామృత అభిషేకం, సింధూర లేపనం, ఆకుపూజలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు.యాజ్ఞిక కార్యక్రమాలను సంతోష్ శర్మ, గుండేపూడి కార్తీక్ శర్మ నిర్వహించగా, మహాపూర్ణాహుతి, మహామంగళ హారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే ఆశీర్వచనం, సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ దోషపాటి ప్రసాద్, మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, పసునూరి శ్రీనివాస్, పసునూరి రమేష్, బెల్లి దశరథ, బండారు రమేష్, ఐతరాజు రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.

# పేద విద్యార్థిని చదువుకు ఎమ్మెల్యే వేముల వీరేశం చేయూత

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 10:**



నార్కట్‌పల్లి మండలంలోని చిన్న తుమ్మలగూడెం గ్రామానికి చెందిన చింత సుజాత, సత్యనారాయణ దంపతుల కుమార్తె చింత అంజలి పారామెడికల్ రేడియాలజీ విద్యను కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ దాసరి రాజు ఈ విషయాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశంకు తెలియజేశారు.దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వేముల వీరేశం, విద్యార్థిని ఉన్నత చదువులు కొనసాగించేందుకు తన వంతు సహాయంగా రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పేద విద్యార్థులు ఆర్థిక కారణాలతో చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యే వేముల వీరేశంకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థిని చింత అంజలి ఉన్నత విద్యలో రాణించి కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉండ్రా లింగారెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నరసింహ, వి. మల్లయ్య, ఉప సర్పంచ్ శ్వేత సురేందర్ రెడ్డి, వీడీసీ సభ్యులు పరమేశ్వర్ రెడ్డి, చింత పరమేష్, వస్కుల శ్రీను, ఇందిరమ్మ, వస్కుల నరసింహ, దుర్గయ్య, మహేష్, ప్రవీణ్ తదితరులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందజేత



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 10:**

పట్టణానికి చెందిన యువకుడు మారోజు నరేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. తన వంతు సహాయం టిఆర్ఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు, టి యు ఎఫ్ ఉద్యమ నేత,షేక్ చాంద్ వారి కుటుంబాన్ని పరామర్శించారు.అనంతరం అరకింటల్ బియ్యం, రూ 2500/_ రూపాయలు నగదు అందజేశారు. అనారోగ్యంతో ఉన్న అతని తల్లిదండ్రులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. దాతలు ఎవరైనా ఉంటే వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో కందుల మని, బోళ్ల సైదులు, నామ నంది నరేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**మహబూబ్‌నగర్,వెలుతురు జూన్ 10:**



బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి మహబూబ్‌నగర్ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన కేసులో నిందితుడు గుర్రాల బాలయ్య @ బాలిని దోషిగా నిర్ధారించిన పోక్సో, అత్యాచార కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి తమన్ రాజరాజేశ్వరి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.దర్యాప్తు అధికారులు సమగ్ర విచారణ నిర్వహించి, శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను పటిష్టంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంతో నిందితుడికి శిక్ష పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో సీఐ గాంధీ నాయక్, ఎ. వెంకటేశ్వర్లు, ఎస్ఐ జి. విజయ్‌కుమార్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. జాన్, కోర్టు లైజన్ అధికారులు బాలకృష్ణ, కృష్ణయ్య, శంకర్, రహీమ్, సీడీఓ అశోక్‌రెడ్డి సమన్వయంతో పనిచేసి కన్విక్షన్ సాధించడంలో కీలక పాత్ర పోషించారు. కేసు దర్యాప్తు నుంచి కోర్టు విచారణ వరకు సమర్థవంతంగా పనిచేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు, సిబ్బంది, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్, లైజన్ అధికారులను జిల్లా ఎస్పీ డి. జానకి అభినందించారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తారని ఎస్పీ తెలిపారు.

# తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు జూన్ 10:**



సంస్థాన్ నారాయణపురం మండలం లింగవారి గూడెం కు చెందిన చిట్యాల సత్తిరెడ్డి (77) మరణించడంతో అతని కుమార్తె సరళ తండ్రి కి తలకొరివి పెట్టారు. సత్తిరెడ్డి గుండెపోటుతో మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అతనికి కుమారులు లేకపోవడంతో అంత్యక్రియలను ఏకైక కుమార్తె పల్లె సరళ శాస్త్రోక్తంగా బుధవారం నిర్వహించారు. సత్తిరెడ్డి మృతికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన పార్థివ దేహం పై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, ఉజ్జిని యాదగిరి రావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## 6వ డివిజన్‌లో నూతన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ వెలుతురు జూన్ 10:**

కరీంనగర్ నగరంలోని 6వ డివిజన్ బొమ్మకల్ లో మలయప్ప ఫౌండేషన్ సీఎస్ఆర్ (CSR) నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు బుధవారం రోజున ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి "ఫిట్ ఇండియా" నినాదం స్ఫూర్తితో ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు, ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించేందుకు ఈ ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారి సహకారంతో, మలయప్ప ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధుల ద్వారా ఈ సౌకర్యం అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, యువతతో పాటు అన్ని వయస్సుల వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ సూచించారు.ఈ కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకటేష్ గారు, మున్సిపల్ సిబ్బంది, వాకర్స్, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మోడీ 12 సంవత్సరాల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి

### బిజెపి మెదక్ జిల్లా నాయకులు కోణం విట్టల్

**వెలుతురు నారాయణఖేడ్ జూన్ 10 :**



మెదక్ జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్... ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో 12 సంవత్సరాల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని మెదక్ జిల్లా బిజెపి నాయకులు కోణం విట్టల్ అన్నారు. బుధవారం మోడీ ప్రధానిగా 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పెద్ద శంకరంపేట లోని రామాలయంలో ప్రధానమంత్రి పేరు మీద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా సంక్షేమం మౌలిక సదుపాయాలు పారిశ్రామిక ప్రగతి పట్టణ అభివృద్ధి రంగాల్లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు అందించిందని వివరించారు.. తెలంగాణ రాష్ట్రంలో 7597 కోట్ల రూపాయలతో జాతీయ రహదారుల నిర్మాణం. పదివేల కోట్ల రూపాయలతో గ్రామపంచాయతీల అభివృద్ధి. 9400 కోట్ల రూపాయలతో పారిశ్రామిక ప్రాజెక్టులకు ప్రోత్సాహం. 14 20 కోట్ల రూపాయలతో అర్బన్ డెవలప్మెంట్ మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టడం జరిగిందని వివరించారు. తెలంగాణ ప్రాంతం సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ బిజేవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ. బిజెపి నాయకులు చందుపట్ల అనిల్ శంకర్రావు రాజు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత: మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ వెలుతురు జూన్ 10:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని తీగలగుట్టపల్లి 2వ డివిజన్‌లో పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మై భారత్ జిల్లా యువజన అధికారి జి. తిరుపతి రెడ్డి కలిసి పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అవగాహన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.తెలంగాణ గాంధీ స్మారక నిధి, హైదరాబాద్, నేషనల్ యూత్ ప్రాజెక్ట్ (NYP), నిఫా (NIFA) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, ప్రస్తుతం మానవ జీవనం ప్రకృతికి విరుద్ధంగా సాగుతోందని, చెట్ల నరికివేత, అడవుల అంతరించిపోవడం వల్ల భూతాపం పెరిగి తీవ్రమైన ఎండలు, వేడి కారణంగా జీవరాశులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణపై శ్రద్ధ చూపకపోతే భవిష్యత్తులో ఆక్సిజన్ కోసం కూడా డబ్బు చెల్లించాల్సిన పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. యువత సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.అనంతరం మేయర్ గారు ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మై భారత్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవీందర్, ఎన్వైపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. యాదవరాజు, జి. రాజశేఖర్, గొల్లె తిరుపతి, యువ నాయకుడు గాండ్ల నరేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు నం.18లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రజల సమస్యలు విన్న అధికారులు

### డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సమస్యలపై వినతిపత్రం అందజేత

**జహీరాబాద్ వెలుతురు జూన్ 10:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలోని ఎస్‌బీహెచ్ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, వార్డు కౌన్సిలర్ కవిత అశోక్ కుమార్, జహీరాబాద్ టౌన్ అధ్యక్షుడు కుండ్యం నర్సింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు.ప్రధానంగా ఎస్‌బీహెచ్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరా వంటి సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ వార్డు ప్రజలు లిఖితపూర్వక వినతిపత్రాన్ని అందజేశారు.అదేవిధంగా అర్హులైన పలువురు స్థానికులు పెన్షన్ దరఖాస్తులను కూడా అధికారులకు సమర్పించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

## బడి మనది....స్వచ్ఛత బాధ్యత మనదే

- ఊరూవాడా కదలిరండి
- స్వచ్ఛంద సంస్థలూ.... 'స్వచ్ఛ పాఠశాల'లో భాగస్వాములు కండి
- పార్టీ కండువాలను పక్కనపెట్టి అందరూ స్వచ్ఛ పాఠశాలలో పాల్గొనండి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు
- ఎల్లుండి రేకొండలో 'స్వచ్ఛ పాఠశాల''కు హాజరై స్కూల్ ను శుభ్రం చేయనున్న బండి సంజయ్

**కరీంనగర్ వెలుతురు జూన్ 10:**



ఈనెల 13న "స్వచ్ఛ పాఠశాల" పేరుతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిని పరిశుభ్రం చేసే కార్యక్రమానికి ఊరూవాడా తరలి రావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. "బడి మనది. ఆ బడిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది. ఊరూవాడా కదలి వచ్చి "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమంలో భాగస్వాములు కండి. స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు సహా ప్రతి ఒక్కరూ కదలిరండి. ముఖ్యంగా రాజకీయాలతో సంబంధం లేకుండా బీజేపీ సహా అన్ని పార్టీల నాయకులు తమ తమ జెండా, ఎజెండా, పార్టీ కండువాలను పక్కన పెట్టి స్వచ్ఛందంగా తమ తమ గ్రామాల్లోని పాఠశాలలకు ఈనెల 13న ఉదయమే తరలిరండి. "స్వచ్ఛ పాఠశాల" పేరుతో ఆయా పాఠశాలలను పరిశుభ్రం చేసి సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో పాల్గొనండి"అని కోరారు. "సర్కారు బడిని కాపాడుకుంటే... పేద, మధ్య తరగతి పిల్లల చదువుకు భరోసా కల్పించినట్లే. ఈ మహాయజ్ఞంలో ఊరూవాడా కదిలిరండి. బడిని బాగు చేసుకుందాం. మన ఊరి భవితకు బాటలు వేద్దాం." అని కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. మరోవైపు "స్వచ్ఛ పాఠశాల"లో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈనెల 13న చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి వెళ్లి అక్కడి పాఠశాలను పరిశుభ్రం చేసే కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## ఒకే వస్తువు - ఓకే ధర సాధన కోసం జూన్ 12 న చలో ఢిల్లీ

- వస్తువులపై ధరల ముద్రణ కోసం ఏబిజిపి దేశవ్యాప్త ఉద్యమం
- ఏబిజిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగమల్ల సురేష్

**కరీంనగర్ వెలుతురు జూన్ 10:**



ఎం ఆర్ పి ప్రస్తుతం వినియోగదారుల రక్షణ సాధనం కాకుండా, మార్కెటింగ్ , ధరల మోసం చేసే సాధనంగా మారిందని, మాక్సిమం రిటైల్ ప్రైస్ (ఎమ్మార్పీ)ని యంత్రణ చట్టం తీసుకురావాలని , వస్తువులపై ధరల ముద్రణ కోసం ఏ బి జి పి దేశవ్యాప్త ఉద్యమం నిర్వహిస్తుందని, అందులో భాగంగానే ఈనెల 12న ఒకే వస్తువు – ఒకే ధర సాధన కోసం జూన్ 12 న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అఖిల భారతీయ గ్రాహక్ పంచాయతీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగమల్ల సురేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం రోజున నాగమల్ల సురేష్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. మొదటగా వినియోగదారుల్లో అవగాహనా కల్పించి, ప్రధానమంత్రి నరంద్ర మోదీ కి దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ల ద్వారా వినతి పత్రాలను సమర్పించే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కంపెనీలు తమ ఇష్టానుసారం అత్యధిక ఎమ్మార్పీ పెట్టి తర్వాత భారీ డిస్కౌంట్లు ప్రకటించి వినియోగదారులను మోసం చేస్తు అసలు తయారీ ఖర్చుతో పోలిస్తే ధరలు అనేక రెట్లు పెంచుతున్నారని ,.ఆన్‌లైన్లో మాల్స్‌లో ఒకే వస్తువుకు విపరీత ధర తేడాలు ఉంటున్నాయన్నారు. వినియోగదారుడికి అసలు ధర, లాభం, సరైన విలువ గురించి స్పష్టత ఉండడం లేదన్నారు. అందుకే ఎబిజీపి వినియోగదారులను చైతన్యవంతులు చేయడానికి, మోసాలను అరికట్టడానికి దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రధానంగా ఎం.ఆర్.పి పై గరిష్ట పరిమితి (సీలింగ్) నిర్ణయించే చట్టం తీసుకురావాలనీ,ఉత్పత్తిపై తయారీ ఖర్చు జీఎస్టీ చెల్లించిన మొదటి అమ్మకపు ధర తప్పని సరిగా ముద్రించాలనీ,మోసపూరిత డిస్కౌంట్ లపై నిషేధం విధించాలనీ, ఎమ్మార్పీ దుర్వినియోగాన్నినియంత్రించేందుకు స్వతంత్ర కమిషన్/అథారిటీ ఏర్పాటు చేయాలని, ఉల్లంఘనలకు కఠిన శిక్షలు విధించేలా చట్ట సవరణలు చేయాలనే డిమాండ్లతో జూన్ 12,2026 న చలో ఢిల్లీ ప్రోగ్రాం ను నిర్వహిస్తున్నామని , ఇందులో భాగంగా జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రాంతం నుండి ఏబీజీపీ కార్యకర్తలతో పాటు కన్స్యూమర్ క్లబ్స్ సభ్యులు తరలి వెళ్ళనున్నారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## ఖేతీ బచావో అభియాన్‌తో రైతుల్లో శాస్త్రీయ సాగుపై చైతన్యం

- మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయాలి వ్యవసాయ శాస్త్రవేత్తలు
- కాశింపూర్‌లో డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో రైతు అవగాహన కార్యక్రమం

**జహీరాబాద్ వెలుతురు జూన్ 10:**



వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు సహజ వనరుల పరిరక్షణ, నేల సారాన్ని కాపాడే లక్ష్యంతో కేంద్ర వ్యవసాయ & రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఖేతీ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని కాశింపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం రైతు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీడీఎస్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), మెదక్–1 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, పంటల నిర్వహణ, నేల సార పరిరక్షణ అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీడీఎస్–కేవీకే వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డా. సాయి ప్రియాంక పగడాల మాట్లాడుతూ, రైతులు మట్టి పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులను వినియోగించాలని సూచించారు. శాస్త్రీయ పద్ధతిలో మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు చేయించుకోవడం ద్వారా నేలలో ఉన్న పోషకాలు, లోపాలను గుర్తించి అవసరమైన మేరకు ఎరువులు వాడటం వల్ల ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. వాతావరణ మార్పులు, ఎల్–నినో ప్రభావం నేపథ్యంలో ఖరీఫ్ పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని, తక్కువ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని రైతులకు సూచించారు.అంతర పంటలు, పంటల మార్పిడి విధానాలు, సీడ్ బాల్ పద్ధతి, పంటల వైవిధ్యీకరణ వంటి ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు ఆదాయాన్ని పెంచుకోవచ్చని వివరించారు. ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ రకాల పంటలను సాగు చేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు.కేవీకే ఫామ్ మేనేజర్ పి. శ్రీకాంత్ మాట్లాడుతూ, రసాయన ఎరువులపై పూర్తిగా ఆధారపడకుండా సూక్ష్మజీవ ద్రావణాలు, ద్రవ ఎరువులు, జీవ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు. సమీకృత పోషక యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా నేల సారాన్ని కాపాడడంతో పాటు పంటల ఉత్పాదకతను పెంచవచ్చని తెలిపారు.వ్యవసాయ విస్తరణ అధికారి రాజు మాట్లాడుతూ, రైతు రిజిస్ట్రీ నమోదు, ఎరువుల బుకింగ్ విధానం, వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పథకాలు, సబ్సిడీ కార్యక్రమాలపై రైతులకు వివరించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలంటే రైతులు తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా రైతులు తమ గ్రామంలో ఎదుర్కొంటున్న నేల సార సమస్యలు, సాగు వ్యయాల పెరుగుదల, నాణ్యమైన విత్తనాల లభ్యత, వ్యవసాయ ఇన్‌పుట్‌ల నిర్వహణ, పంటల మార్కెటింగ్ వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. రైతుల సమస్యలను పరిశీలించిన అధికారులు గ్రామంలో మట్టి నమూనాలు సేకరించి డీడీఎస్–కేవీకే ద్వారా సాయిల్ హెల్త్ కార్డులు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి. రవి, పంచాయతీ కార్యదర్శి మక్సూద్, ఏఈఓ రాజు, గ్రామ రైతులు, మహిళా రైతులు, గ్రామస్థులు, మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం రైతులకు శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన పెంపొందించడంలో ఉపయోగకరంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## పరిశుభ్ర పట్టణం.. ప్రజల సహకారంతోనే సాధ్యం

- కోహిర్ ప్రజలకు అవగాహన కల్పించిన మున్సిపల్ చైర్మన్ ఏం. అశోక్

**జహీరాబాద్ వెలుతురు జూన్ 10:**






రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ పిలుపునిచ్చారు. బుధవారం కోహిర్ పట్టణంలోని వివిధ వార్డుల్లో నిర్వహించిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు అవుతోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు ఈ కార్యక్రమాలు సమర్థవంతమైన వేదికగా నిలుస్తున్నాయని తెలిపారు.విద్య, వైద్యం, పట్టణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని చెప్పారు.రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని, వ్యవసాయానికి సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

కోహిర్ మున్సిపాలిటీలో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి కుటుంబం తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు చేసుకోవాలని కోరారు.పరిశుభ్రమైన వార్డులు ఆరోగ్యకరమైన సమాజానికి నాంది పలుకుతాయని, పారిశుద్ధ్యంపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ. హన్నాన్ జావీద్, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులపై నల్లగొండ జిల్లా ఉన్నతాధికారులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష

### అన్ని రంగాల్లో జిల్లాను అభివృద్ధికి కృషి చేస్తున్నామన్న మంత్రి



**నల్లగొండ వెలుతురు జూన్ 10:**

నీటిపారుదల,రహదారులు, వ్యవసాయం,అన్ని రంగాలలో నల్గొండ జిల్లాను అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. రైతు సంక్షేమం ప్రధాన ధ్యేయంగా తమ ప్రభుత్వం రైతుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని అన్నారు.బుధవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయం ఇందిరా భవన్లో జిల్లా అధికారులతో సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, ధాన్యం సేకరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. నల్గొండ జిల్లా అంతటికి సాగునీరు అందించి జిల్లాను సస్యశ్యామలం చేయడమే ధ్యేయమని, అందుకే ఏ ఎం ఆర్ పి కాలువల లైనింగ్, బ్రాహ్మణ వెల్లెముల ,ఎస్ఎల్బీసీ సొరంగం వంటివి చేపట్టినట్లు తెలిపారు.బ్రాహ్మణ వెల్లేముల ప్రాజెక్టు కింద పెండింగ్లో ఉన్న మైనర్లు, సబ్ మైనర్ల పై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాగా నార్కెట్పల్లి మండలం, కొండపాకోని గూడెంలో ఒక రైతుకు సంబంధించిన పొలంలో 40 మీటర్ల మేర కాలువ పనులు ఆగిపోయిన విషయం అధికారులు మంత్రికి దిష్టికి తీసుకురాగా , జిల్లా కలెక్టర్ నిదుల నుండి రైతుకు నష్టపరిహారం మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని మంత్రి అక్కడికక్కడే కలెక్టర్ ను ఆదేశించారు. కొండపాకోని గూడెం చెరువు నిండితే దోమలపల్లి చెరువు నిండుతుందని, తద్వారా ఇతర చెరువులు నింపుకునేందుకు అవకాశం ఉందని, మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు .ధాన్యం సేకరణలో నల్గొండ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం పట్ల ఆయన జిల్లా కలెక్టర్ ను అభినందించారు. నల్గొండ జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ధాన్యం పండిందని, అయితే ప్రతి సీజన్లో రైతులు వరినే పండించకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు. పంట మార్పిడి పై అధికారులతో పాటు, మహిళా సంఘాలు అందరూ అవగాహన కల్పించాలన్నారు.ఆర్ అండ్ బి రహదారులపై సమీక్ష సందర్భంగా నార్కెట్ పల్లి వద్ద ఆర్ఓబి పనులు చేపట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని, మిగిలిపోయిన భూసేకరణకు సంబంధించి చెల్లింపులు చేసి పిఎన్ జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేస్తూ పనులు వేగవంతం చేసేందుకు కలెక్టర్ వద్ద ఉన్న నిధులను వినియోగించుకోవాలని చెప్పారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ శ్రీధర్ రెడ్డి ,పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్ రెడ్డి,ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పిచ్చయ్య, పౌర సరఫరాల డిఎం రామ్ పతి నాయక్, ఇతర అధికారులు ఉన్నారు.

## నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన పూర్తిపై నార్సింగిలో ప్రత్యేక పూజలు



- జాతీయ నేతలకు మద్దతుగా శివాలయంలో ప్రార్థనలు
- ప్రధానమంత్రి మోదీ దీర్ఘాయుష్షు కోరిన బీజేపీ నేతలు
- పాలాభిషేకంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహణ
- దేశ అభివృద్ధి కోసం మోదీ నాయకత్వం కొనసాగాలని ఆకాంక్ష
- నార్సింగి శివాంజనేయ దేవాలయంలో పూజా కార్యక్రమం
- జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ పాల్గొనటం
- బీజేపీ సీనియర్ నేత మనోహర్ రెడ్డి సహా నాయకుల హాజరు

**నార్సింగి వెలుతురు జూన్ 10:**

నార్సింగి శివాంజనేయ దేవాలయంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల విజయవంతమైన పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు.జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్. కే. లక్ష్మణ్ తో పాటు బీజేపీ సీనియర్ నాయకులు మనోహర్ రెడ్డి కలిసి ఈ పూజల్లో పాల్గొన్నారు. ప్రధానమంత్రి మోదీకి దీర్ఘాయుష్షు, ఆరోగ్యం కలగాలని, భారతదేశం మరింత అభివృద్ధి చెందాలని దేవునికి ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. దేశ సేవలో ఆయన చూపుతున్న అంకితభావానికి కృతజ్ఞతలు తెలియజేశారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై మరింత శక్తివంతమైన, ఆత్మనిర్భరమైన దేశంగా ఎదుగుతుందనే విశ్వాసాన్ని నేతలు వ్యక్తం చేశారు.కార్యక్రమంలో బొక్క బాల్ రెడ్డి, అంజన్ కుమార్ గౌడ్, దిలీప్ ఆచార్య, లక్ష్మీనారాయణ, నాగేష్, అమర్ సింగ్, సత్యనారాయణ, శివాజీ తదితరులు, అనేక మంది బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.నార్సింగి శివాంజనేయ దేవాలయం నార్సింగి శివ ఆంజనేయ టెంపుల్ లో జరిగిన ఈ కార్యక్రమం నేతల ఆధ్యాత్మిక భావనతో కొనసాగింది.

# మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది

### రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి





**మాడుగుల పల్లి వెలుతురు జూన్ 10:**

బుధవారం అయన నల్గొండ జిల్లా, మాడుగుల పల్లి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న మండల కాంప్లెక్స్ భవనాల పనులను తనిఖీ చేశారు. భవన నిర్మాణాలు నాణ్యతగా ఉండాలని ,సాధ్యమైనంత త్వరగా భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం ఇదే మండలం చెరువు పల్లిలో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన గ్రామ సమాఖ్య భవనాన్ని మంత్రి ప్రారంభించారు.మంత్రి మాట్లాడుతూ మాడుగుల పల్లి మండల అభివృద్ధికి ముఖ్యంగా రోడ్లతోపాటు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, 6 కోట్ల రూపాయలతో డబుల్ రోడ్డు మంజూరు చేసామని, ఎల్లమ్మ గూడెం, దాచారంలో సబ్స్టేషన్లు మంజూరు చేయడం జరిగిందని , పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని, రాష్ట్రం ఆపుల్లో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నదని, ఉచిత విద్యుత్తు, రైతు భరోసా వంటి పథకాల అమలు చేస్తున్నామన్నారు. మాడుగులపల్లి నుండి మర్రిగూడ వరకు డబుల్ రోడ్డు, అలాగే 60 కోట్ల రూపాయలతో కోనేటిపురం డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు, రాష్ట్రంలో 20 000 కోట్ల రూపాయల వ్యయంతో హ్యాం రోడ్లతో పాటు, మరో ఏడు వేల కోట్లతో పంచాయతీరాజ్ ద్వారా అన్ని గూడెం లకు రోడ్లు నిర్మిస్తున్నామని, దీని ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గడమే కాకుండా, పరిశ్రమలు వచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయి అన్నారు. తిప్పర్తి, కనగల్ మండలాలకు మంజూరు చేసిన జూనియర్ కళాశాలలను మోడల్ భవనాలుగా తీర్చిదిద్దుతామన్నారు. 3,50,000 మంది ఇంటర్ విద్యార్థులకు ఉదయం టిఫిన్ తో పాటు, మధ్యాహ్నం భోజనం అందించడం జరుగుతుందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నదని, చదువుకుంటే ఉద్యోగాలు వస్తాయని ఆయన తెలిపారు. కనగల్, తిప్పర్తి లో జూనియర్ కళాశాలలతో పాటు, కనగల్ ఆసుపత్రి స్థాయి పెంచడం జరిగిందని , అలాగే ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో స్థాయి పెంచామని అన్నారు. చెరువుపల్లి గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలందరూ స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేరాలని, రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రతి మండలంలో మహిళా సంఘాల ద్వారా రైస్ మిల్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రతి మండలానికి ఒక బస్సు మహిళా సంఘాలకు ఇచ్చామని , వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని, మగవారితో సమానంగా ఎదిగేలా చూస్తామన్నార, చెరువుపల్లికి 50 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని, అవసరమైతే మరో 50 ఇండ్లు ఇస్తామని, పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి ,ఆర్ అండ్ బి ఎస్ ఈ శ్రీధర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు మాజీ జెడ్ పి టి సి సైదులు,సర్పంచ్ సైదిరెడ్డి, సంపత్ రెడ్డి, అధికారులు ఉన్నారు.

## 4399+ రోజులు... నవభారతానికి నవ నాయకుడు...ప్రధాని మోడీ

### పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 10:**

ఆయన దేశ ప్రధానమంత్రి కాదు ప్రధాన సేవకుడు. దేశ ప్రగతి గతిని శక్తిని నూతనపుంతలు తొక్కిస్తున్న నవభారత వైతాళికుడు వికసిత భారత స్ఫూర్తి ప్రదాత భరతమాత ముద్దుబిడ్డ శ్రీ నరేంద్ర మోడీ గారు. జూన్ 10, 2026న ప్రధాని మోడీ గారు భారత దేశ చరిత్రలో ఓ కొత్త మైలురాయిని నెలకొల్పారు.భారత దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకుని వారి నేతగా జవహర్లాల్ నెహ్రూ గారిని



ఎన్నుకొని తద్వారా వారు మే 23, 1952 న దేశ తొలి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత 1957, 1962 జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ప్రధాని నెహ్రూ గారు తన పరిపాలన్ని కొనసాగించడం జరిగింది. వారు మే 27 1964 న ఆకస్మికంగా పరమపదించటం జరిగింది. జవహర్లాల్ నెహ్రూ గారు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసి తన తుది శ్వాస వరకు మొత్తం 4398 రోజులు నిరాఘటంగా ప్రధానిగా ఉండి ఒక రికార్డుని నెలకొల్పారు. 2014లో దేశంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అత్యధిక సీట్లు కైవసం చేసుకుని తమ ఎన్డీఏ కూటమి నేతగా నరేంద్ర మోడీ గారిని ఎన్నుకోవడం జరిగింది. శ్రీ నరేంద్ర మోడీ గారు మే 26, 2014న భారతదేశ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత 2019, 2024 లో దేశంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి, ఎన్డీఏ కూటమి విజయం సాధించడం ప్రధానిగా నరేంద్ర మోడీ గారు కొనసాగటం జరిగింది. జూన్ 9, 2026న ప్రధాని నరేంద్ర మోడీ గారు అలనాటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ గారు నెలకొల్పిన 4398 రోజుల రికార్డుని సమం చేశారు. జూన్ 10, 2026 కి 62 ఏళ్ల రికార్డుని బద్దలు కొడుతూ భారత దేశ చరిత్రలో అత్యధిక రోజులు ప్రధానిగా సరికొత్త మైలురాయిని నెలకొల్పారు. గడచిన 25 ఏళ్లగా నరేంద్ర మోడీ గారు గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా దేశ ప్రధానమంత్రిగా నిరాఘాటంగా దేశ సేవలో ప్రభుత్వంలో ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేయటం ఓటమి ఎరుగని నేతగా అవినీతి మరక లేని నేతగా కొనసాగటం కూడా బహుశా ఒక రికార్డు కావచ్చు. గడచిన కొన్ని సంవత్సరాలుగా ప్రపంచంలో జరుగుతున్న అనేక సర్వేలలో ప్రపంచంలో అత్యధిక ఆదరణ ఉన్న నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోడీ గారు నిలవడం కొనసాగటం కూడా ఒక రికార్డు కావచ్చు. 32 దేశాలు తమ అత్యుత్తమ పౌర పురస్కారాన్ని ప్రధాని నరేంద్ర మోడీ గారికి అందించడం కూడా ఒక అరుదైన రికార్డు కావచ్చు. ఎన్ని రికార్డులు సాధించినా ఆయన మాత్రం దేశ ప్రధాని మంత్రిగా కన్నా దేశ ప్రధాన సేవకుడుగానే గుర్తింపబడటానికి ఇష్టపడతారు. 2014 ముందు దేశ ప్రజలు నిరాశ నిస్పృహల్లో కూలిపోయినప్పుడు ఒక ఆశాకిరణంగా ముందుకొచ్చిన ప్రధాని మోడీ గారు గడిచిన 12 ఏళ్లుగా ప్రజా సంక్షేమం అంటే ఏంటో దేశ అభివృద్ధి అంటే ఏంటో సుపరి పాలన అంటే ఏంటో చూపుతూ వికసిత భారతానికి గట్టి పునాదులు వేశారు. వికసిత భారత సంకల్ప యాత్రని ప్రధాని మోడీ గారి నేతృత్వంలో కొనసాగిస్తూ భారతదేశాన్ని అన్ని రంగాలలో సుసంపన్న సమృద్ధ శుభిస్త దేశంగా తీర్చిదిద్దాలని వారి అడుగుజాడల్లో 140 కోట్ల ప్రజలు నడవాలని కోరుకుంటూ ఈ అరుదైన మైలురాయిని నెలకొల్పే అవకాశం కల్పించిన దేశ ప్రజలకి శిరస్సు వంచి నమస్కరిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ గారికి శుభాకాంక్షలు..!!

## కర్మన్ ఘాట్ లో నూతనంగా 9 లండన్ కిడ్స్ ప్లే స్కూల్ ప్రారంభం



- చిన్నారుల భవిష్యత్తుకు ప్లే స్కూల్ అత్యంత కీలకం
- మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్

**ఎల్బీనగర్, వెలుతురు జూన్ 10:**

ఆటపాటలతో కూడిన విద్యా విధానం పిల్లల్లో సృజనాత్మకతను మరియు ఆలోచనా శక్తిని పెంచుతుందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. బుధవారం కర్మన్ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ సమీపంలోని ఉదయ నగర్ కాలనీ కమిటీ హాల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన 9 లండన్ కిడ్స్ ప్లే స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరై రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన గావించి పాఠశాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్



మాట్లాడుతూ బాల్యదశలోనే పునాది బలంగా ఉండాలని, చిన్నారుల భవిష్యత్తుకు ప్లే స్కూల్ దశ అత్యంత కీలకమైనదని ఆయన పేర్కొన్నారు. లండన్ కిడ్స్ ప్లే స్కూల్ వంటి సంస్థలు స్థానికంగా అందుబాటులోకి రావడం హర్షణీయమని ఆయన కొనియాడారు. సాంకేతికతను జోడించి పిల్లలకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని యాజమాన్యానికి సూచించారు.చిన్న పిల్లలకు కేవలం చదువు మాత్రమే కాకుండా మంచి క్రమశిక్షణ, నైతిక విలువలను కూడా నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. లండన్ కిడ్స్ ప్లే స్కూల్ నిర్వాహకులు సునీల్ కుమార్ రెడ్డి రూపా రాణి సాయి చంద్ లు మాట్లాడుతూ చిన్న పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్రాథమిక విద్యను అందించడమే ధ్యేయంగా ఈ ప్లే స్కూల్ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారు శ్రీనివాస్ రెడ్డి, రాజేష్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులు.. 11 మంది చిన్నారుల మృతి

- అఫ్గానిస్థాన్-పాకిస్థాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు
- అర్ధరాత్రి వేళ సరిహద్దు ప్రాంతాలపై బాంబుల వర్షం
- పౌర నివాసాలే లక్ష్యంగా దాడులని అఫ్గాన్ ఆరోపణ
- నిద్రలోనే ప్రాణాలు కోల్పోయిన చిన్నారులు
- మహిళ, వృద్ధుడు సహా మొత్తం 13 మంది మృతి
- 14 మందికి గాయాలు.. పలువురి పరిస్థితి విషమం
- ఖోస్ట్, కునార్, పక్తికా ప్రావిన్స్‌ల్లో దాడులు
- మృతుల ఫొటోలను విడుదల చేసిన తాలిబన్ ప్రభుత్వం
- దాడులపై ఇప్పటివరకు స్పందించని పాకిస్థాన్
- సెక్యూరిటీ పోస్టుపై దాడికి ప్రతీకార చర్యేనా?

**అఫ్గానిస్థాన్ వెలుతురు జూన్ 10:**

అఫ్గానిస్థాన్–పాకిస్థాన్ సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం అర్ధరాత్రి అనంతరం అఫ్గాన్ భూభాగంలోని పౌర నివాసాలపై పాకిస్థాన్ వైమానిక దాడులు నిర్వహించినట్లు తాలిబన్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ దాడుల్లో 11 మంది చిన్నారులు నిద్రలోనే ప్రాణాలు కోల్పోగా, ఒక మహిళ, ఒక వృద్ధుడు కూడా మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. మరో 14 మంది గాయపడగా, వారిలో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నట్లు వెల్లడించారు.

### పౌర ప్రాంతాలపై దాడుల ఆరోపణ

అఫ్గాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఖోస్ట్, కునార్, పక్తికా ప్రావిన్స్‌లలోని పౌర నివాస ప్రాంతాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ఎలాంటి సైనిక స్థావరాలు లేని ప్రాంతాలపై బాంబులు వేయడం వల్ల అమాయక ప్రజలు బలయ్యారని ఆయన ఆరోపించారు.సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలు అర్ధరాత్రి నిద్రలో ఉండగానే బాంబు దాడులు జరగడంతో ప్రాణనష్టం భారీగా జరిగినట్లు స్థానిక అధికారులు తెలిపారు.

### ఒకే ఇంట్లో 9 మంది మృతి

ఖోస్ట్ ప్రావిన్స్‌లోని సెర్పా జిల్లాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ నివాస గృహంపై నేరుగా బాంబు పడటంతో ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో మరో పది మంది గాయపడినట్లు సమాచారం.శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని స్థానికులు, సహాయక బృందాలు బయటకు తీశాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు



తరలించి చికిత్స అందిస్తున్నారు.

### పక్తికాలో మరో దాడి

పక్తికా ప్రావిన్స్‌లోని బర్మల్ జిల్లాలో జరిగిన మరో వైమానిక దాడిలో ముగ్గురు పౌరులు మరణించారు. మృతులంతా చిన్నారులేనని స్థానికులు పేర్కొన్నారు. దాడులు జరిగిన సమయంలో బాధితులు నిద్రలో ఉండటంతో తప్పించుకునే అవకాశం లేకుండా పోయిందని అధికారులు తెలిపారు.ఈ రెండు ప్రాంతాల్లో జరిగిన దాడుల కారణంగా మొత్తం 11 మంది చిన్నారులు, ఒక మహిళ, ఒక వృద్ధుడు ప్రాణాలు కోల్పోయినట్లు తాలిబన్ ప్రభుత్వం వెల్లడించింది.

### ప్రపంచాన్ని కదిలించిన చిన్నారుల మృతదేహాలు

దాడుల్లో మరణించిన చిన్నారుల ఫొటోలను అఫ్గాన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పంచుకున్నారు. శిథిలాల మధ్య చిన్నారుల మృతదేహాలు కనిపిస్తున్న చిత్రాలు తీవ్ర ఆవేదన కలిగిస్తున్నాయి.ఈ ఘటనపై అఫ్గాన్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, అంతర్జాతీయ సమాజం స్పందించాలని తాలిబన్ ప్రభుత్వం కోరుతోంది.

### పాకిస్థాన్ మౌనం

అఫ్గానిస్థాన్ చేసిన ఆరోపణలపై పాకిస్థాన్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. దాడులు నిర్వహించామా లేదా అనే విషయంపైనా ఇస్లామాబాద్ నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు.అయితే సరిహద్దు ప్రాంతాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఈ దాడులు జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

### ప్రతీకార చర్యేనా?

ఇటీవల అఫ్గాన్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఒక సెక్యూరిటీ పోస్టుపై తీవ్రవాద దాడి జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు భద్రతా సిబ్బంది మరణించగా, మరికొందరు గాయపడ్డారని పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల శాఖ వెల్లడించింది.ఆ దాడికి తాలిబన్‌కు అనుబంధంగా ఉన్న మిలిటెంట్లే కారణమని పాకిస్థాన్ భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రతీకార చర్యగా అఫ్గాన్ భూభాగంపై వైమానిక దాడులు జరిగి ఉండవచ్చని అంతర్జాతీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇరు దేశాల మధ్య మరోసారి ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ పరిణామాలు ప్రాంతీయ భద్రతపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# డాక్టర్ గంగడి మనోహర్ రెడ్డి జన్మదినం సందర్భంగా బీజేపీ నేతల మర్యాదపూర్వక భేటీ





- సీనియర్ నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నేతలు
- మనోహర్ రెడ్డి నివాసానికి వెళ్లి కలిసిన నాయకుల బృందం
- ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించిన బీజేపీ నాయకులు
- పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని శుభాకాంక్షలు
- బొక్క బాల్ రెడ్డి సహా పలువురు నేతల హాజరు
- మర్యాదపూర్వకంగా సాగిన జన్మదిన వేడుకలు
- పార్టీ నేతల్లో సానుకూల వాతావరణం
- సీనియర్ నాయకుడికి కృతజ్ఞతలు తెలిపిన కార్యకర్తలు
- బీజేపీ శ్రేణుల ఐక్యతను ప్రతిబింబించిన కార్యక్రమం

**నార్సింగి వెలుతురు జూన్ 10:**

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ గంగడి మనోహర్ రెడ్డి జన్మదిన సందర్భంగా బీజేపీ నేతలు ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు ఆయనకు దీర్ఘాయుష్షు, సంపూర్ణ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బొక్క బాల్ రెడ్డి, ప్రీతం, పత్తి జయదీప్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం మర్యాదపూర్వకంగా, ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.

# మట్టిలోని మాణిక్యాలు... ఘనమైన ఫలితాలు

- ప్రభుత్వ కళాశాలలకు దిక్సూచిగా కె.ఎం.పాండు మెమోరియల్ గవర్నమెంట్ వోకేషనల్ జూనియర్ కాలేజ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 10:**

తాము పేదరికంలో జీవిస్తున్నా తమ పిల్లలు మాత్రం ఉన్నత చదువులు చదవాలని ఆలోచించే తల్లిదండ్రులు అప్పు చేసి మరి ఫీజులను చెల్లిస్తూ చదివిస్తుంటే, మరికొందరు తల్లిదండ్రులు మాత్రం తమకు ఉన్నత దాంట్లో పిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలనుకుంటారు మరి కొంతమంది. ఇలాంటి వారికి వరప్రదాయనిగా మారింది "కెఎం. పాండు మెమోరియల్ గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కళాశాల – కుత్బుల్లాపూర్". మొట్టమొదటి సారిగా ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఔరా అనిపించారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే ఆ ప్రజా నాయకుడి తపన, ప్రైవేట్ కళాశాల దీటుగా ఆ ప్రభుత్వ కళాశాలలో అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల బోధనా విధానం వెరిసి నేడు ఇంతటి విజయాన్ని చేకూర్చి పెట్టాయి.

### కళాశాల ఏర్పాటు ఉద్దేశ్యం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు ఉన్నతమైన వృత్తి విద్యను అందించాలనే లక్ష్యంతో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, కేపీ.వివేకానంద్ సొంత నిధులతో తండ్రిగారైన కె.ఎం.పాండు జ్ఞాపకార్థం నిర్మింపచేసి 17, ఆగస్ట్ 2023 ప్రారంభోత్సవం చేసుకోగ మొదటి విద్య సంవత్సరంలో 368 విద్యార్థులతో ప్రారంభమైన ఈ కళాశాల 2025 – 2026 విద్యా సంవత్సరం నాటికి 926 మంది విద్యార్థులతో "ఇంతింతై వటుటింతై" అన్నట్టుగా ప్రతి విద్యా సంవత్సరంలో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య పెరుగుతూ ఇతర ప్రభుత్వ కళాశాలలకు దిక్సూచిగా మారింది "కెఎం.పాండు మెమోరియల్ గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కళాశాల – కుత్బుల్లాపూర్".



### వినూత్నమైన వృత్తి విద్యా కోర్సులు.... ఉపాధి కల్పనే లక్ష్యం

కళాశాల ప్రారంభమైన మొదటి విద్యా సంవత్సరం నుంచే లైఫ్ సైన్సెస్ కోర్సులతో పాటు ఉపాధిని కల్పించే కోర్సులను విద్యార్థులకు అందజేస్తూ కళాశాల మంచి పేరు గడిచింది. వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా బైపిసి, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఇసి కోర్సులతోపాటు మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపి హెచ్డబ్ల్యు), మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎం.ఎల్.టీ), కంపెనీ సెక్రటరీ (సిఎస్), ఎలక్ట్రికల్ టెక్నీషియన్ (ఈటీ), ఫార్మా టెక్నాలజీ వంటి కోర్సులను అందిస్తుండటంతో విద్యార్థుల ప్రవేశాలు ఘననీయంగా పెరిగాయి. గత విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టిన ఫార్మా టెక్నాలజీ కోర్సులోనూ 98% విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ కళాశాలలకు ఏ మాత్రం తీసుకోవంటూ నిరూపించారు.

### మట్టిలో మాణిక్యాలు...ఘనమైన ఫలితాలు

విద్యాభ్యాసంలో తమ పేదరికం ఎప్పటికీ అడ్డు కాదు అంటూ ఈ కళాశాల విద్యార్థులు 2026వ సంవత్సరంలో సాధించిన ఫలితాలే నిదర్శనం. ఈక్రమంలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో జీ.భాగ్యశ్రీ (981) మార్కులు సాధించగా, ఎం.ఎల్.టీ కోర్సులో కే.పూజిత (970) మార్కులు సాధించగా, కంపెనీ సెక్రటరీ కోర్సులో ఏ. అక్షయ (966), టీ.రోషిని (966) మార్కులు సాధించగా, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులో ఎం. లిఖిత (943), పి. శ్రీహరి (936) సాధించగా, ఎంపీసీ – 2 లో 1000 మార్కులకు పి.జోష్ణ (981), వి.వర్షిత (951), వడ్ల వర్షిత (940) సాధించగా, బైపిసి–1లో 470 మార్కులకు గాను వాలియా జబీన్ (428) సాధించగా, సిఇసి –2లో 1000 మార్కులకు బి.సంజన (839) మార్పులను సాధించగా, హెచ్ఈసి–2లో 1000 మార్కులకు కె. మాలతి(882) మార్కులు సాధించారు.

### ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే సత్కారం

ఉత్తమ ఫలితాలతో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన విద్యార్థులను బుధవారం హఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద శాలువాలతో సత్కరించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యాభ్యాసం ద్వారానే మనలోని అజ్ఞానాన్ని రూపుమాపవచ్చని నమ్మే మా నాన్నగారైన "కె. ఎం.పాండు" సంకల్పానికి నిదర్శనంగా ప్రతి నిరుపేద విద్యార్థులకు ఉపాధి కల్పనతో కూడిన ఉన్నత విద్యను అందించాలనే ధ్యేయంతో ఏర్పాటు చేసిన ఈ వోకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు మఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తును రూపొందించుకోవాలని ఆశీర్వదించారు. రానున్న రోజుల్లో నిరుపేద విద్యార్థులకు ఉపాధిని కల్పించే మరిన్ని కోర్సులను ప్రారంభించడంలో కళాశాల ప్రిన్సిపల్ లకు నా సహాయ సహకారాలు ఉంటాయన్నారు. విద్యార్థుల ప్రవేశాలకు అనుగుణంగా అదనపు తరగతి గదులను నిర్మింప చేస్తామని, సుదూర ప్రాంతాల నుండి విద్యాభ్యాసం కోసం పాఠశాలకు వచ్చే కళాశాల సిబ్బంది, విద్యార్థుల కోసం బస్టాప్ ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈకార్యక్రమంలో వోకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ మైమూన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేందర్, కళాశాల సిబ్బంది, వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ నారాయణరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ ప్రజల కంటి వెలుగుకు జెకే ట్రస్ట్ అండ

**గుంజేటిలో ఉచిత కంటి వైద్య శిబిరం**

**మేగూర్ కంటి ఆసుపత్రి వైద్యులచే పరీక్షలు...**

**అర్హులకు ఉచిత కళ్లద్దాల పంపిణీ: సర్పంచ్ దేశెట్టి పాటిల్....**

**జహీరాబాద్ వెలుతురు, జూన్ 10:**

గ్రామ ప్రజల మెరుగైన ఆరోగ్యం కోసం జెకే చారిటేబుల్ ట్రస్ట్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని గుంజేటి గ్రామ సర్పంచ్ బొమ్మ దేశెట్టి పాటిల్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్కల్ మండలం గుంజేటి గ్రామంలో బుధవారం జెకే



చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మేగూర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో మేగూర్ కంటి ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్యులు గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. కంటి సమస్యలు ఉన్న వారికి తగిన చికిత్సలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ దేశెట్టి పాటిల్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్య సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. సర్పంచ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డాక్టర్ల సూచనల మేరకు అవసరమైన వారికి జెకే చారిటేబుల్ ట్రస్ట్ తరపున ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నట్లు



వెల్లడించారు.భవిష్యత్తులో కూడా జెకే చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరోగ్య, విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జీవన్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మేగూర్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పనస పండ్ల మాటున గంజాయి సరఫరా

- విజయవాడలో రూ. 70 లక్షల గంజాయి సీజ్.. లారీతో పాటు ఐదుగురు స్మగ్లర్లు అరెస్ట్!
- ఈగల్ ఇంటెలిజెన్స్, పటమట పోలీసుల సంయుక్త ఆపరేషన్.. నిడమానూరు వద్ద లారీ బోర్లా
- ఒడిశా టు తమిళనాడు.. ఐరన్ రోలర్ల మధ్య 140 కిలోల గంజాయి ప్యాకెట్లు గుర్తింపు
- వాసన బయటకు రాకుండా పనస పండ్ల మాయాజాలం.. వాట్సాప్ లైవ్ లొకేషన్ ఆధారంగా డ్రైవర్ల వేట
- ఆంధ్రా-ఒడిశా బోర్డర్ కేంద్రంగా గిరిజనుల అమాయకత్వంతో అంతరపంటగా సాగు
- వాహనాల మార్పిడితో పోలీసుల కళ్లు గప్పతున్న సూత్రధారులు.. కోయంబత్తూరు లక్ష్యంగా రవాణా
- కేరళ, ఒడిశా ముఠాలకు చెందిన ముగ్గురు కీలక నిందితులను ఎట్టకేలకు ఖాతరు చేసిన ఖాకీలు
- నగరంలో కొత్త ట్రెండ్: దొంగతనం చేసిన బైక్‌లు, మొబైళ్లు ఇచ్చి ఏజెన్సీలో గంజాయి కొంటున్న యువత
- కళాశాల విద్యార్థులే టార్గెట్.. మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్న డీసీపీ కృష్ణకాంత్

**విజయవాడ వెలుతురు జూన్ 10:**

ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల (ఏవోబీ) నుంచి సరిహద్దులు దాటుతూ సాగుతున్న గంజాయి అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై విజయవాడ పోలీసులు సర్జికల్ స్ట్రైక్ చేశారు. ఒడిశా కేంద్రంగా దక్షిణాది రాష్ట్రాలకు యథేచ్ఛగా సాగుతున్న నల్లదందాను పటమట పోలీసులు, ఈగల్ ఇంటెలిజెన్స్ బృందాలు సంయుక్తంగా చెల్లాచెదురు చేశాయి. నగరంలో పోలీసులు నిరంతరం నిఘా పెడుతున్నప్పటికీ, స్మగ్లర్లు రకరకాల రహస్య మార్గాలను ఎంచుకుంటూ విజయవాడను ఒక ట్రాన్సిట్ పాయింట్‌గా వాడుకుంటున్నారు. అయితే, ఈసారి అందిన పక్కా ముందస్తు సమాచారంతో పోలీసులు పక్కా మాటు వేసి భారీ సరుకును స్వాధీనం చేసుకోవడంతో పాటు అంతరాష్ట్ర ముఠా గుట్టును రట్టు చేశారు.

### నిడమానూరు వద్ద లారీ సీజ్.. రూ. 70 లక్షల విలువైన సరుకు స్వాధీనం

మంగళవారం తెల్లవారుజామున నగర శివార్లలోని నిడమానూరు జాతీయ రహదారిపై పోలీసులు జరిపిన తనిఖీల్లో భారీగా గంజాయి రవాణా చేస్తున్న ఒక లారీ పట్టుబడింది. లారీని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరుణంలో అందులో అక్రమంగా దాచిన 140 కిలోల మేలిరకం గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. బహిరంగ మార్కెట్లో దీని విలువ సుమారు రూ. 70 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో రవాణాకు ఉపయోగించిన లారీతో పాటు తమిళనాడుకు చెందిన సెల్వం, ప్రదీప్ అనే ఇద్దరు నిందితులను పోలీసులు ఘటనా స్థలంలోనే రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు.

### ఐరన్ రోలర్లు, పనస పండ్ల మాయాజాలం.. పోలీసుల కళ్లు గప్పే కుట్ర

స్మగ్లర్లు ఈసారి పోలీసుల కళ్లు గప్పేందుకు అత్యంత వినూత్నమైన, నమ్మశక్యం కాని పద్ధతిని ఎంచుకున్నారు. ఒడిశాలో లోడ్ అయిన ఈ లారీలో పైకి కనిపించడానికి భారీ ఐరన్ రోలర్లను లోడ్ చేశారు. ఆ ఇనుప రోలర్ల మధ్య భాగంలో ఎవరికీ అనుమానం రాకుండా గంజాయి ప్యాకెట్లను అమర్చి, పైనుంచి టార్పాలిన్ పట్టా కప్పేశారు. అంతేకాకుండా, గంజాయి నుంచి వచ్చే ప్రత్యేకమైన ఘాటైన వాసన బయటకు రాకుండా ఉండేందుకు, లారీ లోపల బాగా పండిన పనస పండ్లను భారీగా చల్లారు. పనస పండ్ల తీవ్రమైన సువాసన వల్ల చెక్‌పోస్టుల వద్ద పోలీసులు గుర్తుపట్టలేరని భావించిన స్మగ్లర్ల ప్లాన్‌ను ఈగల్ బృందం తిప్పికొట్టింది.

### వాట్సాప్ లైవ్ లొకేషన్ ఆధారంగా వేట.. దొరికి పోయిన మధ్యవర్తి, డ్రైవర్

ఈ కేసులో నిందితులను పట్టుకోవడం పోలీసులకు పెద్ద సవాలుగా మారింది. ఎందుకంటే స్మగ్లర్లు రహదారిపై ఎక్కడా ఫోన్లలో నేరుగా మాట్లాడుకోకుండా కేవలం వాట్సాప్ సాంకేతికతను వాడుకున్నారు.



మొదట పోలీసుల నిఘాకు ఈ ముఠాకు చెందిన ఒక ముఖ్యమైన మధ్యవర్తి చిక్కాడు. అతని మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా, లారీ డ్రైవర్ నిరంతరం తన వాట్సాప్ ద్వారా 'లైవ్ లొకేషన్' (Live Location) షేర్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ లొకేషన్ ఆధారంగా లారీ కదలికలను ట్రాక్ చేసిన ఈగల్ ప్రత్యేక బృందం, లారీ నిడమానూరు దాటుతుండగా చుట్టుముట్టి డ్రైవర్‌ను, సరుకును స్వాధీనం చేసుకుంది.

### ఏవోబీ ఏజెన్సీలో అంతరపంటగా సాగు.. గిరిజనుల అమాయకత్వంతో వ్యాపారం

విజయవాడ నగరంలో పట్టుబడుతున్న మత్తు పదార్థాల కేసుల్లో డ్రగ్స్ పరీక్షలు చేసినప్పుడు, పాజిటివ్ వచ్చిన వారిలో ఎక్కువ మంది ఏవోబీ (ఆంధ్రా ఒడిశా బోర్డర్) నుంచే గంజాయి తెచ్చుకుంటున్నట్లు విచారణలో తేలింది. ఒడిశా సరిహద్దుల్లోని దట్టమైన అటవీ ప్రాంతాన్ని స్మగ్లర్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇక్కడకు పోలీసులు, అటవీ శాఖ అధికారులు అంత సులభంగా అడుగు పెట్టే అవకాశం లేకపోవడంతో నిఘా లోపాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. స్థానిక గిరిజనులకు పెద్ద మొత్తంలో డబ్బులు ఆశజూపి, వారు పొలాల్లో వేసే సాధారణ పంటల మధ్యలో ఈ గంజాయిని అంతరపంటగా సాగు చేయిస్తున్నారు. ఆ తర్వాత వారి వద్ద నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేసి ప్యాకింగ్ చేస్తున్నారు.

### వాహనాల మార్పిడితో మాయాజాలం.. ముగ్గురు అంతరాష్ట్ర కింగ్‌పిన్లు అరెస్ట్

సాధారణంగా గంజాయి రవాణా చేసేటప్పుడు పోలీసులు ఒకే వాహనాన్ని సుదూర ప్రాంతాల వరకు ట్రాక్ చేయకుండా ఉండేందుకు స్మగ్లర్లు రహస్య వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఒడిశా సరిహద్దుల నుంచి కొంత దూరం ఒక వాహనంలో సరుకును తీసుకొచ్చి, ఆ తర్వాత నగర శివార్లలో రహస్య ప్రాంతాల్లో వేరే వాహనంలోకి మారుస్తుంటారు. అయితే ఈ నెట్‌వర్క్‌పై లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు, కేవలం డ్రైవర్లతో సరిపెట్టకుండా పరారీలో ఉన్న ముగ్గురు కీలక సూత్రధారులను ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాకు చెందిన అరూప్‌సింగ్, రాజేష్‌కుమార్ సింగ్ లతో పాటు కేరళకు చెందిన అంతరాష్ట్ర స్మగ్లర్ మహ్మద్ సొహైల్‌ను అరెస్ట్ చేశారు. వీరు ఏవోబీ నుంచి సరుకును సేకరించి తమిళనాడులోని కోయంబత్తూరుకు తరలించి, అక్కడ నుంచి కేరళ, కర్ణాటక అంతటా సప్లై చేస్తున్నట్లు గుర్తించారు.

### కొత్త తరహా నేరాలు: బైక్‌లు, మొబైళ్లు ఇచ్చి గంజాయి కొంటున్న నగర యువత

గంజాయి అలవాటు నగరంలో సరికొత్త నేరాలకు దారితీస్తోందని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మత్తుకు బానిసలైన కొందరు నగర యువకులు సులభంగా డబ్బులు సంపాదించడానికి, తమ మత్తు అవసరాలు తీర్చుకోవడానికి ద్విచక్ర వాహనాల (బైక్‌ల) చోరీలకు, ఖరీదైన మొబైల్ ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్నారు. నగరంలో దొంగతనం చేసిన ఈ బైక్‌లను, మొబైళ్లను నేరుగా ఒడిశా సరిహద్దుల్లోని ఏజెన్సీ ప్రాంతాలకు తీసుకెళ్లి, అక్కడ స్థానిక డీలర్లకు తక్కువ ధరకే అమ్మేస్తున్నారు. ఆ అమ్మగా వచ్చిన మొత్తానికి నగదు తీసుకోకుండా, దానికి సరిపడా గంజాయిని కొనుగోలు చేసి బ్యాగుల్లో సర్దుకుని ద్విచక్ర వాహనాలపై రహస్యంగా నగరానికి తీసుకువస్తున్నారు.

### విద్యార్థులే ముఠాల టార్గెట్.. ఉక్కుపాదం మోపుతామన్న డీసీపీ కృష్ణకాంత్ పటేల్

ఈ భారీ గంజాయి ముఠా అరెస్టుకు సంబంధించిన వివరాలను విజయవాడ డీసీపీ కృష్ణకాంత్ పటేల్ అధికారికంగా వెల్లడించారు. "మా ఈగల్ ఇంటెలిజెన్స్, పటమట పోలీసు బృందాల సమర్థవంతమైన ఆపరేషన్ వల్ల తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు సరఫరా అవుతున్న రూ. 70 లక్షల విలువైన 140 కిలోల గంజాయిని పట్టుకోగలిగాం. నిందితులు సెల్వం, ప్రదీప్ లతో పాటు కీలక సూత్రధారులను అరెస్ట్ చేశాం. స్మగ్లర్లు ముఖ్యంగా విజయవాడ నగరంలోని కళాశాల (కాలేజీ) విద్యార్థులను, యువతను టార్గెట్ చేస్తూ వారిని మత్తుకు బానిసలను చేయాలని చూస్తున్నారు. నగరంలో గంజాయి అమ్మినా, రవాణా చేసినా ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. విద్యాసంస్థల పరిసరాల్లో నిఘా మరింత పెంచి, మత్తు దందాపై ఉక్కుపాదం మోపుతాం" అని డీసీపీ హెచ్చరించారు.

# ఈఎన్‌సీ మోహన్‌నాయక్‌కు 14 రోజుల రిమాండ్

- ఏసీబీ దాడుల్లో రూ.17.94 కోట్ల ఆదాయానికి మించిన ఆస్తులు వెలుగులోకి
- 16 ప్రాంతాల్లో ఏకకాల సోదాలు.. అవినీతి విశ్వరూపం బహిర్గతం
- కోర్టులో హాజరు.. 14 రోజుల రిమాండ్‌తో చంచల్‌గూడ జైలుకు తరలింపు
- మార్కెట్ విలువ రూ.150 కోట్లకు పైగానే ఉంటుందన్న అంచనాలు
- విలాసవంతమైన భవనాలు, స్థలాలు, పెట్టుబడులపై ఏసీబీ దృష్టి
- పత్రాల పరిశీలనలో భారీ స్థాయిలో ఆస్తుల గుర్తింపు
- అధికార వర్గాల్లో కలకలం రేపిన ఈఎన్‌సీ అరెస్ట్
- అక్రమార్జనపై మరింత లోతుగా దర్యాప్తు
- బినామీ ఆస్తుల కోణంలోనూ విచారణకు అవకాశం
- ప్రభుత్వ విభాగాల్లో అవినీతిపై మరోసారి చర్చ

హైదరాబాద్ వెలుతురు జూన్ 10:

రహదారులు, భవనాల (ఆర్అండ్‌బీ) శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) మోహన్‌నాయక్ అక్రమాస్తుల కేసు తెలంగాణలో సంచలనం సృష్టించింది. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన విస్తృత సోదాల్లో భారీ స్థాయిలో ఆస్తులు బయటపడటంతో ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రివరకు సాగిన సోదాల్లో మోహన్‌నాయక్ కుటుంబ సభ్యులు, బంధువులు, అనుబంధ వ్యక్తులకు చెందిన పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు గణనీయమైన స్థిర, చరాస్తులను గుర్తించారు.

సోదాల అనంతరం మోహన్‌నాయక్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు విచారణ జరిపి న్యాయస్థానంలో హాజరుపర్చారు. కేసును పరిశీలించిన కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో మోహన్‌నాయక్‌ను చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు.

### 16 ప్రాంతాల్లో ఏకకాల సోదాలు

ఏసీబీ అధికారులు అత్యంత గోప్యంగా రూపొందించిన కార్యాచరణలో భాగంగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మొత్తం 16 ప్రాంతాల్లో ఒకేసారి దాడులు నిర్వహించారు. మోహన్‌నాయక్‌కు సంబంధించిన నివాసాలు, కార్యాలయాలు, బంధువుల ఇళ్లు, పెట్టుబడులు ఉన్నట్లు అనుమానించిన ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టాయి.

ఈ సోదాల్లో భూములు, విలాసవంతమైన భవనాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో పెట్టుబడులు, బ్యాంకు డిపాజిట్లు, బంగారం, ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న పత్రాల పరిశీలనలో భారీ స్థాయిలో అక్రమాస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.

### రూ.17.94 కోట్ల ఆదాయానికి మించిన ఆస్తులు

ఏసీబీ ప్రాథమిక అంచనాల ప్రకారం మోహన్‌నాయక్‌కు సంబంధించిన ఆదాయ వనరులను పరిశీలించిన తర్వాత ఆయన పేరుతో పాటు కుటుంబ సభ్యులు, అనుబంధ వ్యక్తుల పేర్లలో నమోదైన ఆస్తుల విలువను లెక్కించారు. ఈ క్రమంలో ఆయన చట్టబద్ధమైన ఆదాయంతో పోలిస్తే రూ.17.94 కోట్ల మేరకు అధికంగా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు.అధికారిక లెక్కల ప్రకారం ఈ మొత్తం ఆదాయానికి మించిన ఆస్తుల విలువగా నమోదైనా, వాస్తవానికి బహిరంగ మార్కెట్‌లో వీటి ధర మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఉన్న భూముల ప్రస్తుత మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుంటే ఆస్తుల మొత్తం విలువ రూ.150 కోట్లకు మించి ఉండొచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

### మార్కెట్ విలువపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువలకు, వాస్తవ మార్కెట్ ధరలకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటం వల్ల ఏసీబీ లెక్కలు



మరియు వాస్తవ ఆస్తి విలువల్లో తేడా కనిపించే అవకాశం ఉంది. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టిన ప్రాంతాల్లో ప్రస్తుతం భూముల ధరలు పలుమార్లు పెరగడంతో మోహన్‌నాయక్‌కు సంబంధించిన ఆస్తుల నిజమైన విలువ మరింత ఎక్కువగా ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.దీనిపై మరింత స్పష్టత కోసం స్వాధీనం చేసుకున్న పత్రాలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, బ్యాంకు లావాదేవీలు, పెట్టుబడి వివరాలను సమగ్రంగా విశ్లేషిస్తున్నట్లు సమాచారం.

### అవినీతి నిరోధక శాఖ దర్యాప్తు ముమ్మరం

ఈ కేసులో కేవలం గుర్తించిన ఆస్తులకే పరిమితం కాకుండా వాటి మూలాలపై కూడా ఏసీబీ దృష్టి సారించింది. అధికారిక వేతనం, ఇతర చట్టబద్ధ ఆదాయ వనరులతో పోలిస్తే భారీ స్థాయిలో ఆస్తులు ఎలా సమకూరాయనే అంశంపై లోతైన విచారణ కొనసాగుతోంది.అలాగే బినామీ పేర్లతో ఆస్తులు కొనుగోలు చేశారా? కుటుంబ సభ్యులు లేదా సన్నిహితుల పేర్లను ఉపయోగించారా? అనే కోణాల్లో కూడా దర్యాప్తు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అవసరమైతే ఆర్థిక లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ కూడా నిర్వహించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

### అధికార వర్గాల్లో కలకలం

రాష్ట్ర ప్రభుత్వంలో కీలకమైన రహదారులు, భవనాల శాఖలో అత్యున్నత ఇంజినీరింగ్ పదవిలో ఉన్న అధికారి అక్రమాస్తుల కేసులో అరెస్టు కావడం అధికార వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రభుత్వ శాఖల్లో అవినీతి ఆరోపణలపై ఇప్పటికే పలు కేసులు నమోదవుతున్న తరుణంలో ఈ సంఘటన మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.ప్రత్యేకించి భారీ ప్రాజెక్టులు, నిర్మాణ పనులు, కాంట్రాక్టు వ్యవహారాలతో సంబంధం ఉన్న శాఖలో ఉన్నతాధికారి స్థాయిలో ఇలాంటి ఆరోపణలు రావడం పట్ల వివిధ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

### మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం

ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న పత్రాల పరిశీలన కొనసాగుతుండటంతో రానున్న రోజుల్లో మరిన్ని ఆస్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. బ్యాంకు ఖాతాలు, పెట్టుబడులు, షేర్లు, బీమా పాలసీలు, ఇతర ఆర్థిక సాధనాల్లో ఉన్న పెట్టుబడులపై కూడా అధికారులు దృష్టి సారించారు.దర్యాప్తు పూర్తయిన తర్వాత అక్రమాస్తుల అసలు పరిమాణం, వాటి సేకరణకు సంబంధించిన పూర్తి వివరాలు బయటపడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, ఏసీబీ తదుపరి చర్యలపై అందరి దృష్టి నిలిచింది.

# నెహ్రూ రికార్డును అధిగమించిన మోదీ.. ఎన్నికైన ప్రధానిగా కొత్త చరిత్ర

- అరుదైన ఘనతపై ఎక్స్‌లో స్పందించిన ప్రధాని
- ప్రజా సేవే సుపరిపాలనకు గొప్ప కొలమానమని వ్యాఖ్య
- వినయం, అంకితభావమే ప్రజల విశ్వాసానికి పునాదులని వెల్లడి
- ప్రత్యేక వీడియోను పంచుకున్న ప్రధాని
- రాజకీయ చరిత్రలో మరో మైలురాయి

ఢిల్లీ వెలుతురు జూన్ 10:

భారత రాజకీయ చరిత్రలో ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చి నిరంతరాయంగా అత్యధిక కాలం ప్రధానమంత్రిగా కొనసాగిన నాయకుడిగా కొత్త రికార్డు సృష్టించారు. 2014 మే 26న తొలిసారిగా ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టిన మోదీ.. 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ వరుస విజయాలు సాధించి అధికారాన్ని నిలబెట్టుకున్నారు.ఈ క్రమంలో జూన్ 10 నాటికి ప్రధానమంత్రి పదవిలో ఆయన 4,399 రోజులు పూర్తి చేశారు. దీంతో ఇప్పటివరకు దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును అధిగమించారు.

### 12 ఏళ్ల పాలనలో మరో మైలురాయి

2014లో భారతీయ జనతా పార్టీకి పూర్తి మెజారిటీ సాధించి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మోదీ, అనంతరం 2019లో మరింత భారీ విజయాన్ని నమోదు చేశారు. 2024లో ఎన్డీయే కూటమి మరోసారి అధికారంలోకి రావడంతో వరుసగా మూడోసారి ప్రధానమంత్రి పదవిని చేపట్టారు.ఈ ప్రయాణంలో ఆయన 4,399 రోజుల పాటు నిరవధికంగా ప్రధానమంత్రి పదవిలో కొనసాగి భారత రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించారు.

### నెహ్రూ రికార్డు ఎలా ఏర్పడింది?

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1947 ఆగస్టు 15 నుంచి దేశ ప్రధానిగా ఉన్నప్పటికీ, ఆ కాలాన్ని ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రభుత్వంగా పరిగణించరు. భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన అనంతరం సార్వత్రిక వయోజన ఓటుహక్కు ఆధారంగా తొలి సాధారణ ఎన్నికలు 1951–52లో నిర్వహించారు.ఆ ఎన్నికల తర్వాత 1952 మే నుంచి 1964 మేలో ఆయన మరణించే వరకు నెహ్రూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రధానిగా నిరంతరాయంగా 4,398 రోజులు పదవిలో కొనసాగారు. ఇదే ఇప్పటివరకు అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా కొనసాగిన రికార్డుగా ఉండేది.

**ఇప్పుడు మోదీ 4,399 రోజులు పూర్తి చేయడంతో ఆ రికార్డు ఆయన పేరిట నమోదైంది.**

**ఎక్స్‌లో ప్రధాని స్పందన**

ఈ చారిత్రక ఘట్టంపై ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో స్పందించారు. ప్రజా సేవ, సుపరిపాలన, నాయకత్వ లక్షణాల గురించి ప్రస్తావిస్తూ ఒక సందేశాన్ని పంచుకున్నారు.

"ప్రజా సేవయే సుపరిపాలనకు గొప్ప కొలమానం. వినయంతో, అంకితభావంతో, కర్తవ్య భావంతో అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల నమ్మకాన్ని గెలుచుకుంటాడు. స్వభావరీత్యా భక్తిపరుడై, ఎల్లప్పుడూ తన ప్రజల సంక్షేమం గురించే ఆలోచించేవాడే అత్యున్నత కీర్తిని పొందుతాడు. వినయశీలి అయిన రాజు నిజంగానే అత్యున్నత కీర్తిని పొందుతాడు" అని మోదీ పేర్కొన్నారు. ఈ సందేశంతో పాటు తన ప్రజా జీవితం, పాలనా ప్రయాణాన్ని ప్రతిబింబించే ప్రత్యేక వీడియోను కూడా ఎక్స్‌లో షేర్ చేశారు.

### రాజకీయ ప్రాధాన్యత

మోదీ సాధించిన ఈ రికార్డు రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. స్వాతంత్ర్యానంతర భారత చరిత్రలో నెహ్రూ తర్వాత అత్యంత ప్రభావవంతమైన నాయకుల్లో ఒకరిగా మోదీ ఇప్పటికే గుర్తింపు పొందారు. ఇప్పుడు ఎన్నికైన ప్రధానిగా అత్యధిక కాలం నిరంతరాయంగా పదవిలో కొనసాగిన నాయకుడిగా నిలవడం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో కీలక మైలురాయిగా మారింది. మరోవైపు కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంటున్న సమయంలో ఈ రికార్డు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఏపీ పల్లెలకు కేంద్రం భారీ నజరానా

- "వీబీ జీ రామ్ జీ" పథకం కింద రూ. 7,707 కోట్ల నిధులు మంజూరు!
- జాతీయ స్థాయిలో భారీ నిధులు సాధించిన
- రాష్ట్రాల జాబితాలో ఏపీ
- కేంద్ర, రాష్ట్ర వాటాలతో కలిపి రూ. 12,845 కోట్లతో వసతుల కల్పన
- గ్రామీణ జీవనోపాధి మెరుగుదల, ఆధునిక సాంకేతికతతో పల్లెల ఆర్థిక వ్యవస్థ బలోపేతం
- వెనుకబడిన ప్రాంతాలలో తాగునీరు, సీసీ రోడ్ల అనుసంధానం
- డిజిటల్ మౌలిక వసతులపై ప్రత్యేక ఫోకస్
- నిధుల దుర్వినియోగానికి తావులేకుండా కేంద్ర మార్గదర్శకాల ప్రకారం వ్యవస్థ ఏర్పాటు
- నిర్ణీత గడువులోనే పనులు ప్రారంభించేలా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం
- త్వరలోనే ఉన్నతాధికారులతో సీఎం స్థాయి ఉన్నత సమీక్ష
- రాష్ట్రవ్యాప్తంగా వేగంగా సాగనున్న అభివృద్ధి పనులు
- స్థానికంగా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు

అమరావతి వెలుతురు జూన్ 10:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల సమగ్ర వృద్ధికి, సర్వాంగీణ సుందరీకరణకు దోహదపడేలా కేంద్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మకమైన, అత్యంత ప్రతిష్టాత్మకమైన నిర్ణయాన్ని తీసుకుంది. దేశవ్యాప్తంగా గ్రామాల రూపురేఖలను మార్చేందుకు కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన "వీబీ జీ రామ్ జీ" పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఊహించని విధంగా భారీ ఎత్తున నిధులు మంజూరయ్యాయి. ఈ సరికొత్త కేంద్ర ప్రభుత్వ పథకం అమలు కోసం మన రాష్ట్రానికి ఏకంగా రూ. 7,707.21 కోట్ల నిధులను కేంద్రం కేటాయించింది. ఈ నిధుల రాకతో రాష్ట్రంలో ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల పనులకు మోక్షం లభించనుంది.కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను నిశితంగా పరిశీలించి ఈ నిధులను కేటాయించింది. జాతీయ స్థాయిలో ఈ ప్రతిష్టాత్మక పథకం కింద అత్యధిక మొత్తంలో నిధులను, బడ్జెట్ కేటాయింపులను దక్కించుకున్న దేశంలోని అగ్రగామి రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ ఏకంగా మూడో స్థానాన్ని కైవసం చేసుకొని సరికొత్త రికార్డు సృష్టించింది. ఢిల్లీ స్థాయిలో రాష్ట్ర అధికారులు చేసిన పక్కా ప్రణాళికలు, ప్రతిపాదనల వల్లే ఇంత పెద్ద మొత్తంలో నిధులు సాధించడం సాధ్యమైందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ భారీ నిధుల కేటాయింపు ద్వారా రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన మునుపెన్నడూ లేని విధంగా అత్యంత వేగంగా పుంజుకోనుంది.ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కేవలం కేంద్ర నిధులతోనే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కలిసి సాగనుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ. 7,707.21 కోట్ల నిధులను ఇస్తుండగా, దానికి మ్యాచింగ్ గ్రాంట్‌గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాటా కింద రూ. 5,138.14 కోట్లను కలపనుంది. ఈ రెండు వాటాలు కలిపి మొత్తంగా రూ. 12,845 కోట్ల భారీ నిధుల నిధి ఏర్పడనుంది. ఈ నిధులన్నింటినీ వివిధ దశల్లో, విడతల వారీగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల జనాభా, వెనుకబాటుతనం ఆధారంగా సమానంగా కేటాయించేందుకు ల్యాండ్ మ్యాప్ సిద్ధం చేశారు."వీబీ జీ రామ్ జీ" పథకం యొక్క అత్యంత ప్రధానమైన ముఖ్య లక్ష్యం గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడం. గ్రామాల్లో స్థిరమైన వనరుల సృష్టి, ప్రకృతి వనరుల రక్షణ మరియు ఆధునిక డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పల్లెల అంతర్గత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంపై ఈ పథకం పూర్తిగా దృష్టి పెడుతుంది. దీనివల్ల గ్రామాల నుంచి పట్టణాలకు జరిగే వలసలు పూర్తిగా తగ్గుతాయని, పల్లెల్లోనే సొంతంగా ఆర్థిక వనరులు పెరిగి, స్వయం సమృద్ధి సాధించడానికి ఈ నిధులు ఒక బూస్టర్‌లా పనిచేస్తాయని అధికారులు చెబుతున్నారు.ఈ పథకం కింద మంజూరైన నిధులను ఎక్కడపడితే అక్కడ కాకుండా అత్యంత అవసరమైన రంగాలకే కేటాయించనున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని రాయలసీమ, ఉత్తరాంధ్ర మరియు ఇతర జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలలో తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా నివారించేందుకు, అంతర్గత మురుగునీటి కాలువలు, బీటి మరియు సీసీ రహదారుల అనుసంధానతకు పెద్దపీట వేయనున్నారు. వీటితో పాటు నేటి ఆధునిక కాలానికి



అనుగుణంగా ప్రతి గ్రామంలోనూ డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన, ఇంటర్నెట్ సౌకర్యం, లైబ్రరీల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులకు ఈ నిధులను ప్రధానంగా వినియోగించనున్నారు.ఈ భారీ ప్రాజెక్టు విజయవంతంగా పూర్తి కావడానికి కేంద్ర ప్రభుత్వం కొన్ని కఠినమైన మార్గదర్శకాలను (గైడ్‌లైన్స్) విధించింది. కేంద్రం నిర్దేశించిన గడువులోగా అన్ని జిల్లాల్లో ఈ పనులను అధికారికంగా ప్రారంభించాల్సి ఉంటుంది. గతంలో జరిగినట్లుగా నిధుల మళ్లింపునకు గానీ, ఎలాంటి అవినీతి, అక్రమాలకు గానీ తావులేకుండా, వంద శాతం పూర్తి పారదర్శకతతో పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఒక "ప్రత్యేక ఆడిట్ వ్యవస్థ"ను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి పనిని జియో ట్యాగింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో పర్యవేక్షిస్తారు.జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచి ఇంత పెద్ద మొత్తంలో వేల కోట్ల నిధులను సాధించడంపై అమరావతి రాష్ట్ర సచివాలయ వర్గాలు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నిధుల కేటాయింపు పూర్తయినందున, వీటి వినియోగం మరియు టెండర్ల ప్రక్రియపై త్వరలోనే ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఒక ఉన్నత స్థాయి అత్యవసర సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలోనే జిల్లాలవారీగా పనుల ఎంపిక, కార్యాచరణ ప్రణాళికను (యాక్షన్ ప్లాన్) తుది రూపంలో సిద్ధం చేసి ఆమోద ముద్ర వేయాలని ప్రభుత్వం భావిస్తోంది.రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి రూ. 12,845 కోట్లతో వేలాది మౌలిక వసతుల పనులు ప్రారంభం కానుండటంతో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాలలో సరికొత్త ఆర్థిక విప్లవం రాబోతోంది. ఈ భారీ పెట్టుబడుల ద్వారా సిమెంట్, స్టీల్, రవాణా రంగాలకు మంచి డిమాండ్ ఏర్పడటమే కాకుండా, స్థానికంగా ఉండే వేలాది మంది నిరుద్యోగ యువతకు, కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. పల్లెల్లో ప్రజల చేతుల్లోకి డబ్బులు రావడం వల్ల వారి కొనుగోలు శక్తి పెరిగి, రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు కూడా గణనీయంగా పెరుగుతుందని ఆర్థిక నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వాటర్ లాగింగ్ పాయింట్స్ కు శాశ్వత పరిష్కారమే లక్ష్యం.. వివిధ శాఖలతో సైబరాబాద్ సీపీ సమీక్ష

**సైబరాబాద్ వెలుతురు జూన్ 10:**

సైబరాబాద్ లో రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటిమునిగే ప్రాంతాల (Water Logging Points) సమస్యల పరిష్కారం, వివిధ ప్రభుత్వ శాఖల మద్య సమన్వయం, ముందస్తు చర్యలపై సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ రోజు జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మరియు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆద్వర్యం లో నిర్యహించగా సీఎంసీ కమిషనర్ సృజన , ట్రాఫిక్ అధికారులు, HYDRAA, HMWS&SB, TGSPDCL, TGIIC, ఇరిగేషన్, HGCL, HMDA, అర్బన్ ఫారెస్ట్ తదితర శాఖల ప్రతినిధులు ప్రత్యక్షంగా, వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రతి శాఖ తన బాధ్యతలను స్పష్టంగా నిర్వర్తించడంతో పాటు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వాటర్ లాగింగ్‌కు కారణమవుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంబంధిత శాఖలతో కలిసి నిరంతరం పర్యటించాలని సూచించారు. సర్కిల్ వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, అన్ని శాఖలు సమస్యాత్మక ప్రాంతాల మ్యాపింగ్ పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని తెలిపారు. భారీ వర్షాల సమయంలో ట్రాఫిక్ ఎక్కడా నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, తక్షణ స్పందన చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట డ్రోన్లను వినియోగించి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు సమయానుకూల సమాచారం అందించేందుకు అన్ని శాఖలు ఉమ్మడి సోషల్ మీడియా వేదికలను సమర్థంగా ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఆకస్మిక విపత్తులు, అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు సర్కిల్, జోన్, కమిషనరేట్ స్థాయిల్లోని యంత్రాంగం ఒకే బృందంగా పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల సందర్భంగా నగరంలో నీటి ప్రవాహం, వాటర్ లాగింగ్ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. ముఖ్యంగా బయోడైవర్సిటీ జంక్షన్ సహా పలు ప్రాంతాలను సందర్శించి భారీ వర్షాల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధ్యయనం చేశామని చెప్పారు. సమస్యలు తలెత్తిన ప్రతి ప్రాంతాన్ని పరిశీలించి వాటికి మూల కారణాలను గుర్తించే దిశగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. వర్షాకాల అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు హైడ్రా ప్రత్యేక ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేసిందని, ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించి సమస్యల పరిష్కారానికి సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు.వర్షాకాలంలో నాలాల్లో పేరుకుపోయిన పూడిక, ఆక్రమణలు, నీటి పారుదల మార్గాల్లో ఉన్న అడ్డంకులు వాటర్ లాగింగ్‌కు ప్రధాన కారణాలని తెలిపారు. చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అవసరమైన చోట్ల నాలాల విస్తరణ, డ్రైనేజీ మెరుగుదల పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఫ్లైఓవర్ల కింద నీరు నిల్వ ఉండే ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. భారీ వర్షాలు, చెట్లు కూలిపోవడం వంటి ఘటనలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే అవకాశం ఉన్నందున అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ మొత్తం పరిస్థితిని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట వెంటనే స్పందించే విధంగా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. సీఎంసీ కమిషనర్ సృజన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో గుర్తించిన ప్రతి వాటర్ లాగింగ్ పాయింట్‌కు ప్రత్యేక ఇన్‌చార్జ్ అధికారులను నియమించి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. మొత్తం 53 వాటర్ లాగింగ్ పాయింట్లలో కొన్ని ప్రాంతాల్లో చిన్నచిన్న మౌలిక సదుపాయాల పనులు చేపట్టడం





ద్వారా మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉందని గుర్తించామని చెప్పారు. సమస్యల తీవ్రతను బట్టి ఆయా ప్రాంతాల్లో అవసరమైన చర్యలను ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.వర్షపు నీటి పారుదల సక్రమంగా జరిగేందుకు అవసరమైన చోట్ల పైపుల ఏర్పాటుతో పాటు, నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న ప్రాంతాల్లో కటింగ్ పనులు, ఇతర ఇంజినీరింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, సమస్యల పరిష్కారంలో వేగవంతమైన చర్యలు తీసుకునేందుకు సమర్థవంతమైన కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలతో కలిసి ముందస్తు చర్యలు చేపడుతున్నామని ఆమె వివరించారు.సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శేషాద్రి రెడ్డి మాట్లాడుతూ వాటర్ లాగింగ్ సమస్యల పరిష్కారానికి సంబంధించి వర్షాలకు ముందు, వర్షాల అనంతరం పరిస్థితులపై విజువల్ అనాలిసిస్ నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో సమస్యలను అధ్యయనం చేసి, శాశ్వత పరిష్కారాల కోసం కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రతి వాటర్ లాగింగ్ పాయింట్‌కు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, సమస్యలకు దారితీస్తున్న మూలకారణాలను గుర్తించి చర్యలు చేపడుతున్నామని వివరించారు.సమావేశంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో గుర్తించిన మొత్తం 53 వాటర్ లాగింగ్ పాయింట్లపై సమీక్ష నిర్వహించారు. వీటిలో 42 ప్రాంతాల్లో ఇప్పటికే పరిష్కార చర్యలు పూర్తికాగా, మిగిలిన 17 పెండింగ్ పాయింట్లలో 15 ప్రాంతాలను అత్యంత కీలకమైన (క్రిటికల్) వాటర్ లాగింగ్ పాయింట్లుగా గుర్తించారు. గచ్చిబౌలి, మాదాపూర్, జీడిమెట్ల, కూకట్‌పల్లి, మియాపూర్, రాయదుర్గం, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో వర్షాల సమయంలో ఎదురయ్యే సమస్యలపై శాఖల వారీగా చర్చించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అధికారులు వాటర్ లాగింగ్ పాయింట్లకు సంబంధించిన సమగ్ర ప్రజెంటేషన్ ఇవ్వగా, వివిధ శాఖల ప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన తాత్కాలిక, శాశ్వత పరిష్కార చర్యలను వివరించారు. వర్షాల సమయంలో ట్రాఫిక్ అంతరాయాలు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదల, పంపుల ఏర్పాటు, నీటి పారుదల మార్గాల అభివృద్ధి, రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించారు.

# పల్లె ప్రగతికి సరికొత్త బాట

- **ఉపాధి హామీలో తెలంగాణకు రూ. 3,825 కోట్ల భారీ నిధులు మంజూరు**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 10:**

దేశంలోని గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, ఉపాధి లేక పల్లెల నుండి నగరాలకు వలస వెళ్లే సామాన్యుల ఇబ్బందులను శాశ్వతంగా నివారించడమే ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఒక సరికొత్త వ్యూహాత్మక చారిత్రాత్మక నిర్ణయంతో ముందుకు వచ్చింది. దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా అట్టడుగు వర్గాలకు, పేద కూలీలకు జీవనోపాధిని కల్పిస్తూ వస్తున్న 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (MGNREGS) యొక్క పాత స్వరూపాన్ని కేంద్రం పూర్తిగా మార్చేస్తోంది. దాని స్థానంలో 'జీరాంజీ' (Jeeramji) అనే సరికొత్త వినూత్న విప్లవాత్మక పథకాన్ని ప్రవేశపెడుతోంది. పాత లోపాలను సవరిస్తూ పల్లె ప్రజలకు మరింత లబ్ధి చేకూర్చేలా ఈ కొత్త వ్యవస్థను రూపొందించారు.కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేసిన ఈ సరికొత్త 'జీరాంజీ' పథకం రాబోయే జులై 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలలో ఏకకాలంలో అధికారికంగా అమలులోకి రానుంది. ఈ నూతన విధానం కింద తెలంగాణ రాష్ట్రానికి పెద్ద ఎత్తున అభివృద్ధి నిధులను మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన ఉత్తర్వులను జారీ చేసింది. కేంద్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఢిల్లీలో వెల్లడించిన తాజా నివేదికల ప్రకారం.. ప్రస్తుత 2026–27 ఆర్థిక సంవత్సరానికి గానూ మిగిలి ఉన్న తొమ్మిది నెలల కాలానికి ఈ నిధుల కేటాయింపులు జరిగాయి.కొత్త నిబంధనల ప్రకారం.. ఈ నూతన 'జీరాంజీ' పథకంలో అయ్యే మొత్తం ఖర్చులో కేంద్ర ప్రభుత్వ వాటా 60 శాతంగా ఉంటుంది. ఈ 60 శాతం వాటా కింద తెలంగాణ రాష్ట్ర ప్రగతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రూ. 3,825.31 కోట్లను కేటాయిస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వేల కోట్ల నిధులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఖజానా (అకౌంట్లకు) చేరనున్నాయి. ఈ కేటాయింపుల పట్ల తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ హర్షం వ్యక్తం చేస్తోంది.నూతన జీరాంజీ పథకం మార్గదర్శకాల ప్రకారం.. రాబోయే తొమ్మిది నెలల పరిమిత కాలంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది గ్రామ పంచాయతీలలో వివిధ రకాల గ్రామీణాభివృద్ధి పనుల కోసం మొత్తం రూ. 6,375.52 కోట్లను ఖర్చు చేయాల్సి ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ భారీ నిధుల సముదాయంతో తెలంగాణలోని పల్లె ప్రాంతాలలో మునుపెన్నడూ లేని విధంగా సరికొత్త పనుల జాతర ప్రారంభం కానుంది. ప్రతి గ్రామానికి వారి జనాభా ప్రాతిపదికన ఈ నిధులను విభజించి పనుల జాబితాను సిద్ధం చేస్తున్నారు.ఈ పథకంలో కేంద్రం అందించే 60 శాతం నిధులు పోగా, మిగిలిన 40 శాతం మ్యాచింగ్ గ్రాంట్ నిధులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరుల నుంచి తప్పనిసరిగా సమకూర్చుకోవాలని కేంద్ర ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. దీని ప్రకారం తెలంగాణ ప్రభుత్వం తన 40 శాతం వాటా కింద రూ. 2,550.21 కోట్లను బడ్జెట్ నుండి వెచ్చించి ఈ పనులను విజయవంతంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం తన వాటా సొమ్మును సకాలంలో విడుదల చేయకపోతే, కేంద్ర నిధుల వినియోగంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తి నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉంటుందని హెచ్చరించింది.గతంలో ఉన్న పాత ఉపాధి హామీ పథకంతో పోలిస్తే ఈ నూతన 'జీరాంజీ' పథకంలో కేంద్రం కొన్ని విప్లవాత్మక మార్పులు చేసింది. గతంలో కేవలం మట్టి పనులు, పిచ్చిమొక్కల తొలగింపు వంటి తాత్కాలిక కూలీ పనులకే నిధులు ఎక్కువగా ఖర్చయ్యేవి. కానీ ఈ కొత్త పథకంలో అలా కాకుండా, గ్రామీణ ప్రాంతాలలో శాశ్వత మౌలిక వసతుల కల్పనకు, ప్రభుత్వ ఆస్తుల సృష్టికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దీనివల్ల ప్రభుత్వ ధనం వృథా కాకుండా పల్లెల్లో శాశ్వత కట్టడాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.ఈ పథకం కింద మంజూరయ్యే వేల కోట్ల నిధులను గ్రామాల్లోని అత్యంత అవసరమైన రంగాలు, నిర్మాణాలకే వాడుకోవాలని కేంద్రం స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇచ్చింది. తెలంగాణ పల్లెల్లో ఇప్పటికే నిర్మించిన అంతర్గత సీసీ రహదారులు, వై□□ంఠ ధామాలు (శ్మశాన వాటికలు), రైతుల కోసం ఏర్పాటు చేసిన రైతు వేదికల ఆధునీకరణ మరియు నిర్వహణకు ఈ నిధులను వాడుకోవచ్చు. వీటితో పాటు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల చుట్టూ రక్షణ ప్రహరీ గోడల (కాంపౌండ్ వాల్స్) నిర్మాణానికి కూడా ఈ నిధులను పెద్ద ఎత్తున వినియోగించుకునేలా స్థానిక సంస్థలకు వెసులుబాటు కల్పించారు.కొత్త జీరాంజీ పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ కేంద్రం సరికొత్త టెక్నాలజీని తీసుకొచ్చింది.

## సైబరాబాద్ పరిధి లో సబ్–ఇన్‌స్పెక్టర్లకు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు పై ప్రత్యేక అవగాహన సదస్సు





- **జీవిత సవాళ్లను అవకాశాలుగా మలుచుకుంటేనే విజయాలు సాధ్యం: సీపీ డా. ఎం. రమేష్**

**సైబరాబాద్ వెలుతురు జూన్ 10:**

సైబరాబాద్ సీపీ డా ఎం. రమేష్ ఆధ్వర్యంలో సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధి లోసబ్–ఇన్‌స్పెక్టర్ల కోసం ఈ రోజు సీపీ ఆఫీస్ ఆడిటోరియం లో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీ సుధీర్ సాండ్ర పాల్గొని వ్యక్తిత్వ వికాసం, ఒత్తిడి నిర్వహణ, భావోద్వేగ నియంత్రణ, నాయకత్వ లక్షణాల పెంపు, వృత్తి పరమైన నైపుణ్యాల అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

పోలీసు విధుల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ మానసిక దృఢత్వంతో విధులు నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, హెల్త్ మేనేజ్‌మెంట్‌తో పాటు కుటుంబ జీవితం, ఉద్యోగ బాధ్యతల మధ్య సమతుల్యతను పాటించడం ప్రతి అధికారికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మంచి ఆలోచనలు, ఉన్నత ఆశయాలు, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగితే జీవితంలో విజయాలను సాధించడం సులభమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమను తాము ప్రతిరోజూ విశ్లేషించుకుంటూ, భవిష్యత్ లక్ష్యాల దిశగా కృషి చేయాలని సూచించారు.పోలీసు శాఖ ఒక విశ్వసనీయ బ్రాండ్ అని, దానికి తగిన నైతిక విలువలు, క్రమశిక్షణ, ప్రజాసేవా దృక్పథాన్ని ప్రతి అధికారి కాపాడాలని సీపీ సూచించారు. దర్యాప్తు నిర్వహణలో వృత్తిపరమైన నైపుణ్యాలు, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రజలతో సమన్వయం, చట్టబద్ధతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కేసుల దర్యాప్తులో నిజాయితీ, నిబద్ధత, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.జీవితంలో ఎదురయ్యే అవాంతరాలు, ఒత్తిళ్లు, సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలని, అపజయాలను పాఠాలుగా స్వీకరించి ముందుకు సాగాలని సీపీ సూచించారు. నేటి బిజీ జీవితంలో నైతిక విలువలపై దృష్టి తగ్గుతోందని, వాటిని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "అపకారికి ఉపకారం" అనే విలువను ఆచరిస్తూ సమాజంలో ఆదర్శప్రాయమైన పోలీసు అధికారులుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎవరూ పరిపూర్ణులు కాదని, నిరంతర అభ్యాసం, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథంతోనే ఉన్నత విజయాలు సాధించగలమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు బంపర్ ఆఫర్!

- **ఆఫీసుల్లో ఉత్పాదకత పెరుగుతుందంటున్న నిపుణులు**
- **సచివాలయ ఉన్నతాధికారుల నుండి హర్షాతిరేకాలు**

**త్రిపుర వెలుతురు జూన్ 10:**

ప్రభుత్వ ఉద్యోగుల శ్రేయస్సు, వారి పని సామర్థ్యాన్ని ఒకే తాటిపైకి తెచ్చేలా త్రిపుర రాష్ట్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మకమైన సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. ముఖ్యమంత్రి డాక్టర్ మాణిక్ సాహా నేతృత్వంలోని రాష్ట్ర సర్కార్ ప్రభుత్వ కార్యాలయాల పని వేళల్లో విప్లవాత్మక మార్పులు చేస్తూ, ఇకపై అన్ని శనివారాలను అధికారిక సెలవు దినాలుగా ప్రకటిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగుల వృత్తిగత బాధ్యతలు, వ్యక్తిగత జీవితాల మధ్య సమతుల్యతను (వర్క్–లైఫ్ బ్యాలెన్స్) మెరుగుపరచడంతో పాటు, ప్రజలకు అందే సేవల్లో ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూసేందుకే ఈ వినూత్న నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది.

### ఆఫీసు వేళల్లో మార్పులు.. పెరగనున్న రోజువారీ పని సమయం

కొత్త నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల పని వేళల్లో అధికారులు కీలక మార్పులు చేశారు. ప్రస్తుతం త్రిపురలో ప్రభుత్వ ఆఫీసులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే పనిచేస్తున్నాయి. అయితే తాజాగా మారిన నిబంధనల ప్రకారం.. ఇకపై ఆఫీసులు ఉదయం 9.30 గంటలకే ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతాయి. దీనివల్ల రోజువారీ పని సమయం ఒక గంటన్నర మేర పెరుగుతున్నప్పటికీ, వారంలో ఒక అదనపు పూర్తి స్థాయి సెలవు లభించనుండటం విశేషం.

### నెలలో నాలుగు శనివారాలు పూర్తి సెలవు.. పాత పద్ధతికి సర్కార్ స్వస్తి

ఇప్పటివరకు త్రిపుర రాష్ట్రంలో పాత పద్ధతి ప్రకారం ప్రతి నెలలోని రెండో మరియు నాలుగో శనివారాలు మాత్రమే ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులుగా ఉంటూ వచ్చాయి. మిగిలిన మొదటి, మూడో శనివారాల్లో ఉద్యోగులు యథావిధిగా విధులకు హాజరు కావాల్సి వచ్చేది. కానీ ఈ కొత్త విధానం అమలులోకి రావడంతో, ఇకపై నెలలోని అన్ని శనివారాలనూ పబ్లిక్ హాలిడేస్‌గా మార్చేశారు. ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల క్యాలెండర్ ప్రకారం నాలుగు శనివారాలు, నాలుగు ఆదివారాలు కలిసి మొత్తంగా ఎనిమిది రోజుల పాటు వీకెండ్ విశ్రాంతి దినాలు లభించనున్నాయి.

### పరిపాలనకు భంగం కలగదు.. అదనపు పని గంటలతోనే సర్దుబాటు

వారంలో ఐదు రోజులే పని విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల ప్రభుత్వ రోజువారీ పనితీరుపై గానీ, ప్రజలకు అందే సేవలపై గానీ ఎలాంటి ప్రతికూల ప్రభావం పడదని త్రిపుర ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. శనివారాలు పూర్తిగా ఆఫీసులు మూసి ఉంచినప్పటికీ.. మిగిలిన ఐదు రోజులలో (సోమవారం నుండి శుక్రవారం వరకు) రోజువారీ పని గంటలను పెంచడం ద్వారా ఆ నష్టాన్ని పూర్తిగా భర్తీ చేయగలమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మార్పుల వల్ల ప్రజలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, పరిపాలనా పరమైన నిర్ణయాలు మరియు ప్రభుత్వ సేవల్లో ఎక్కడా ఎలాంటి అంతరాయం ఏర్పడదని అధికారులు హామీ ఇచ్చారు.

### కేంద్ర ప్రభుత్వ ప్రమాణాల దిశగా అడుగులు.. సచివాలయ వర్గాల స్వాగతం

రాష్ట్ర సివిల్ సెక్రటేరియట్‌కు చెందిన సీనియర్ అధికారి దులాల్ దేవ్ ప్రభుత్వ నిర్ణయాన్ని పూర్తి స్థాయిలో స్వాగతించారు. దేశంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలతో పాటు అనేక అగ్రగామి రాష్ట్రాలలో ఇప్పటికే ఐదు రోజుల పని దినాల విధానం అత్యంత విజయవంతంగా అమల్లో ఉందన్నారు. త్రిపుర ఉద్యోగులు కూడా ఈ కొత్త టైమ్ టేబుల్‌కు చాలా త్వరగా అలవాటు పడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగా తాము జీతభత్యాలు, ప్రయోజనాలు ఆశిస్తున్నప్పుడు.. అదే స్థాయిలో బాధ్యతాయుతంగా ఎక్కువ గంటలు విధులు నిర్వహించేందుకు కూడా తామంతా సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

### దూర ప్రాంతాల ఉద్యోగులకు ప్రారంభంలో స్వల్ప ఇబ్బందులు

కొత్త పని వేళల ప్రకారం సాయంత్రం 6 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉండటంతో, సుదూర ప్రాంతాల నుంచి రాజధానికి వచ్చిపోయే ఉద్యోగులు ప్రారంభ రోజుల్లో స్వల్ప ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని దులాల్ దేవ్ అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, వారంలో వరుసగా రెండు రోజులు లభించే సెలవుల ప్రయోజనం ముందు ఈ చిన్న ఇబ్బంది పెద్ద సమస్య కాదన్నారు. కొద్ది రోజులు గడిస్తే ఉద్యోగులందరూ ఈ సరికొత్త జీవనశైలికి మరియు ఆఫీస్ వేళలకు మానసికంగా, శారీరకంగా అలవాటు పడిపోతారని ఆయన స్పష్టం చేశారు.

### కుటుంబానికి ఎక్కువ సమయం.. మానసిక ఆరోగ్యానికి ఊరట

ఈ కొత్త విధానం వల్ల ఉద్యోగులకు తమ కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడిపే సువర్ణ అవకాశం దక్కుతుందని మానసిక నిపుణులు, ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఉద్యోగుల వ్యక్తిగత అభివృద్ధి, తగినంత విశ్రాంతి, మానసిక ఆరోగ్యానికి ఈ రెండు రోజుల వీకెండ్ ఎంతో దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు. వారాంతంలో శని, ఆదివారాలు వరుసగా విశ్రాంతి దొరకడం వల్ల ఉద్యోగుల్లో పని పట్ల సంతృప్తి (జాబ్ శాటిస్‌ఫాక్షన్) పెరగడంతో పాటు, సోమవారం ఆఫీసుకు వచ్చేటప్పుడు సరికొత్త ఉత్సాహంతో ఉత్పాదకతను మెరుగుపరిచే అవకాశం ఉంటుందని విశ్లేషిస్తున్నారు.

భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవనున్న త్రిపుర పాలసీ

త్రిపుర రాష్ట్ర అటవీ శాఖలో కీలక బాధ్యతల్లో పనిచేస్తున్న మహిళా అధికారి డాక్టర్ క్వీన్ శర్మ కూడా ప్రభుత్వ నిర్ణయంపై ప్రశంసల జల్లు కురిపించారు. గతంలో పరిమిత పని సమయాల వల్ల వ్యక్తిగత పనులను, ఆఫీస్ బాధ్యతలను సమన్వయం (బ్యాలెన్స్) చేసుకోవడం మహిళా ఉద్యోగులకు కత్తిమీద సాములా ఉండేదని, తాజా మార్పులతో ఆ ఒత్తిడి పూర్తిగా తగ్గుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

# అసెంబ్లీ సమావేశాలను తలపించిన టీనేజ్ బాలికల రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీ

- **భవిష్యత్ మహిళా నాయకత్వానికి వేదికగా నిలిచిన కార్యక్రమం**
- **రాజకీయాలు, ప్రజాసేవ పట్ల బాలికల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యం: మంత్రి సీతక్క**

**హైదరాబాద్, వెలుతురు జూన్ 10:**

హైదరాబాద్ జూబ్లీ హాల్‌లోని పూర్వ శాసన మండలి భవనంలో బుధవారం నిర్వహించిన టీనేజ్ బాలికల రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీ అసెంబ్లీ సమావేశాలను తలపిస్తూ ఆకట్టుకుంది. రాష్ట్రం నలుమూలల నుంచి ఎంపికైన కిశోర బాలికలు ప్రజాప్రతినిధుల పాత్రలో పాల్గొని ప్రజా సమస్యలపై చర్చించడం, అధికార విపక్ష సభ్యులుగా వ్యవహరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.తెల్లటి ఖాదీ దుస్తులు, కండువాలు ధరించి రాజకీయ నాయకులను తలపించేలా హాజరైన బాలికలు సభలో క్రమశిక్షణతో పాల్గొని తమ వాదనలను వినిపించారు. ఆరోగ్యం, విద్య, ఆదివాసీ సంక్షేమం, సోషల్ మీడియా ప్రభావం, యువత భవిష్యత్ వంటి పలు అంశాలపై చర్చలు నిర్వహించారు.టీనేజ్ బాలికల స్నేహ సంఘాల ఆధ్వర్యంలో ముందుగా మండల స్థాయిలో, అనంతరం జిల్లా స్థాయిలో మాక్ అసెంబ్లీలు నిర్వహించగా, అందులో ప్రతిభ కనబరిచిన బాలికలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క బాలికలను అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు టీనేజ్ బాలికలకు ఇలాంటి వేదికలను కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.సభలో మాట్లాడిన బాలికలు ఆరోగ్యం, ఆదివాసీ సంక్షేమం, సోషల్ మీడియా ప్రభావం వంటి కీలక అంశాలను ప్రస్తావించడం అభినందనీయ మన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా యువతను అత్యంత వేగంగా ఆకర్షిస్తోందని, ఒక రీల్ చూడడం ప్రారంభిస్తే గంటల తరబడి సమయం వృథా అయ్యే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అలాంటి ఆకర్షణలకు దూరంగా ఉండి లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు.రాజకీయాలంటే చాలా మంది యువత వెనుకడుగు వేస్తారని, అయితే ప్రజాసేవ చేయాలనే తపన ఉన్న వారు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. మారుమూల గ్రామాల నుంచి కూడా నాయకత్వం రావాలని, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా చూసిన వారే సమర్థవంతంగా ప్రజల తరఫున మాట్లాడగలరని అన్నారు."ఈ సభ ఒక సామాజిక దేవాలయం. ఇది ఒకరినొకరు విమర్శించుకునే వేదిక కాదు. ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపే చట్టాలు









రూపొందించే పవిత్ర స్థలం" అని మంత్రి పేర్కొన్నారు.చిన్న వయసులోనే బాలికలు ప్రదర్శించిన పరిణితి, అవగాహన తనను ఎంతో ఆకట్టుకుందని తెలిపారు. రాజకీయాల్లోకి రావాలంటే చదువు అవసరం లేదనే భావన సరికాదని, నాయకత్వం వహించాలంటే మంచి విద్య, నిరంతర అధ్యయనం, విజ్ఞానం అవసరమని చెప్పారు. జ్ఞానం పెరిగిన కొద్దీ సమాజ సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు.కిశోర బాలికలు క్రమశిక్షణ, సంస్కారం, శ్రమ అనే మూడు విలువలను జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు. పోలీసు అధికారి లేదా సైనికుడికి లభించే గౌరవం మాదిరిగానే సమాజంలో గౌరవనీయ స్థానాలను అందుకోవాలని ఆకాంక్షించారు. "మీరు మా సైనికులు. భవిష్యత్ సమాజ నిర్మాణంలో మీ పాత్ర ఎంతో కీలకం" అని అన్నారు.ప్రభుత్వం మహిళలు, యువతుల ఆర్థిక సాధికారత కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్న మంత్రి, మహిళా సంఘాల ద్వారా ప్రతి నెల రూ.70 వేల వరకు ఆదాయం పొందే అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు.

వడ్డీ లేని రుణాలు అందిస్తూ స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.రాష్ట్రంలోని గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, హైదరాబాద్ హైటెక్ సిటీ ప్రాంతంలో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్పించారని వివరించారు."మన మూలాలు గ్రామాల్లో ఉండొచ్చు. కానీ మన లక్ష్యాలు ప్రపంచాన్ని చేరుకోవాలి. Our roots are local, our vision is global" అని మంత్రి పేర్కొన్నారు.యువత తమకు నచ్చిన, సమాజానికి ఉపయోగపడే రంగాన్ని ఎంచుకుని అందులో రాణించాలని సూచించారు. చదువు ఉంటే ప్రపంచంలో ఎక్కడైనా గౌరవప్రదంగా జీవించే అవకాశం ఉంటుందని చెప్పారు. పెద్దలను గౌరవించడం, సంస్కృతిని కాపాడుకోవడం జీవితాంతం కొనసాగాలని సూచించారు.భవిష్యత్తులో ఇదే అసెంబ్లీ హాల్‌లో ప్రజాప్రతినిధులుగా, మంత్రులుగా, స్పీకర్లుగా, ముఖ్యమంత్రులుగా మాట్లాడే స్థాయికి ఎదగాలని బాలికలను ఆశీర్వదించారు. తమ అనుభవాలు, విజయగాథలను రాసి ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న టీనేజ్ బాలికలు అత్యంత ఉత్సాహంతో సభా కార్యక్రమాలను నిర్వహించి తమ నాయకత్వ ప్రతిభను చాటుకున్నారు. ఈ మాక్ అసెంబ్లీ భవిష్యత్ మహిళా నాయకత్వానికి బలమైన పునాది వేస్తుందనే అభిప్రాయం వ్యక్తమైంది.

## మోదీజీ... వర్ధిల్లు నూరేళ్లు

- **2047 వరకు మోదీయే ప్రధానిగా కొనసాగుతారు**
- **ప్రపంచంలోనే భారత్ ను విశ్వగురు స్థానంలో నిలబెట్టడం ఖాయం**
- **మీనాక్షి నటరాజన్ వ్యవహారం ఎన్నికల కమిషన్ పరిధిలోనిది**
- **కరీంనగర్ మీడియాతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి**
- **మోదీ ఆయురారోగ్యాలతో నూరేళ్లు జీవించాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి**

**కరీంనగర్ వెలుతురు జూన్ 10:**

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాబోయే 2047 సంవత్సరం వరకు భారత ప్రధాన మంత్రిగా కొనసాగుతారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రపంచంలోనే భారత్ ను విశ్వగురు స్థానంలో నిలబెట్టే వరకు మోదీ విశ్రమించబోరని చెప్పారు. భారత ప్రధానిగా 4398 రోజులు పూర్తి చేసుకుని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ రికార్డును మోదీ బద్దలు కొట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రి



బండి సంజయ్ కుమార్ బుధవారం రోజున ఉదయం కరీంనగర్ లోని శ్రీమహాశక్తి ఆలయంలో స్థానిక బీజేపీ నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోదీ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, అభివృద్ధిలో భారత్ ను ప్రపంచంలోనే నెంబర్ వన్ దేశంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా క్రుషి చేస్తున్న మోదీకి భగవంతుడి ఆశీస్సులు అందించాలని కోరుతూ బండి సంజయ్ ఈ పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక బీజేపీ కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే...

‘‘దేశ ప్రధానిగా 4,398 రోజులు ప్రధానిగా పూర్తి చేసుకుని జవహర్ లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టి అత్యధిక కాలం ప్రధానిగా చేసిన మహానుభావుడు నరేంద్రమోదీ. ఈ నేపథ్యంలో నాతోపాటు ఎంతో మంది దేశవ్యాప్తంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నెహ్రూ పాలనలో అవినీతి, అరాచకాలు, అస్తవ్యస్త, బంధుప్రీతి పాలన కొనసాగింది. కానీ మోదీ పాలనలో అందుకు భిన్నంగా అవినీతి, బంధుప్రీతికి తావు లేకుండా నిజాయితీ, నిబద్ధతతో పాలనను కొనసాగిస్తున్నారని కొనియాడారు. మోదీ 12 ఏళ్ల పాలనలో దేశంలోని 25 కోట్ల మందిని పేదరికం నుండి బయట పడేశారు. రోడ్లు, రైల్వే, ఎయిర్, టెలికమ్యూనికేషన్ రంగాల్లో అనూహ్యమైన ప్రగతి సాధించారు. పట్టణాల తోపాటు గ్రామీణ ప్రాంతాలను కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. అవినీతికి తావులేకుండా సమాజంలోని అట్టడుగునున్న చిట్ట చివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత మోదీకే దక్కుతుంది. అలాంటి గొప్ప వ్యక్తి నిండు నూరేళ్లు వర్ధిల్లాలి. 2047 వరకు దేశ ప్రధానిగా కొనసాగాలి. మోదీకి అమ్మవారు ఆయురారోగ్యాలతోపాటు శక్తిని కూడా ప్రసాదించాలని కోరుతున్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ పత్రాలను తిరస్కరించిన వ్యవహారం ఎన్నికల కమిషన్ పరిధిలోనిది. ఈ అంశాన్ని ఎన్నికల కమిషన్ చూసుకుంటుంది.

## ఘనా పారిశ్రామికాభివృద్ధికి ‘తెలంగాణ’ మార్గనిర్దేశం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 10:**

రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అక్కడ ఏర్పాటు చేయనున్న ‘ఫార్మా హబ్’కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ‘తెలంగాణ – ఘనా’ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్ పోర్ట్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న ‘ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీ’లను ఆయన వివరించారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సీన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు.ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.

## అనుమతులు లేకుండా నోట్‌బుక్స్, యూనిఫాంల విక్రయం


- **షాపును సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 10:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రావ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం అనుమతులు లేకుండా నోట్‌బుక్స్, యూనిఫాంలను విక్రయిస్తున్నారనే సమాచారంతో మండల విద్యాశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. స్కూల్‌కు సంబంధించిన ఓ షట్టర్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫాంల విక్రయం జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు, అవసరమైన అనుమతులు లేకపోవడంతో ఆ షట్టర్‌ను సీజ్ చేశారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యాలు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించరాదని విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడే విధంగా ఒకే చోట నోట్‌బుక్స్, యూనిఫాంల




కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు.పాఠశాలలు విద్య అందించడంపైనే దృష్టి సారించాలని, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించాలంటే సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనుమతులు లేకుండా విద్యార్థులకు సంబంధించిన వస్తువుల విక్రయం నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.




## రూ.13,000 కోట్ల "హ్యామ్" పనులకు జూన్ 17న సీఎం రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా శంకుస్థాపన

- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**నల్గొండ వెలుతురు జూన్ 10:**

రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో ‘హ్యామ్’ (Hybrid Annuity Model – HAM) విధానంలో చేపడుతున్న ₹13,000 కోట్ల విలువైన రోడ్డు అభివృద్ధి పనులకు ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.హ్యామ్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రవేశపెట్టిందని, అదే నమూనాలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 6,300 కిలోమీటర్ల రహదారులను 34 ప్యాకేజీల్లో డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి వర్క్ ఆర్డర్లు జారీ చేసిందని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల అమలు కోసం తాను గత ఏడాది కాలంగా నిరంతరం కృషి చేస్తున్నానని చెప్పారు.మంత్రి సీతక్క ఆధ్వర్యంలోని పంచాయతీరాజ్ శాఖ ద్వారా మరో ₹7,000 కోట్ల అభివృద్ధి పనులు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు.

**జూన్ 17న సీఎం పర్యటన**

ఈ నెల 17వ తేదీ సాయంత్రం 4 గంటలకు నల్గొండ జిల్లా కనగల్ ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని మంత్రి తెలిపారు.

**నల్లగొండ జిల్లాలో రెండు ప్యాకేజీల్లో..**

**మొదటి ప్యాకేజీ:**

దర్వేష్‌పురం నుంచి గుర్రంపోడు, మల్లెపల్లి, దేవరకొండ మీదుగా దిండి వరకు సుమారు ₹300 కోట్లతో డివైడర్‌తో కూడిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మార్గంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ రహదారిని విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు.

**రెండవ ప్యాకేజీ:**

చిట్యాల నుంచి రామన్నపేట, వలిగొండ, భువనగిరి మీదుగా జగదేవ్‌పూర్ వరకు సుమారు ₹300 కోట్లతో డబుల్ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఆలేరు నియోజకవర్గంలో కూడా సుమారు ₹300 కోట్లతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

**తెలంగాణలోనే అతిపెద్ద బహిరంగ సభ**

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా దర్వేష్‌పురం ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్యక్రమాలు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం నల్గొండలో తెలంగాణలోనే గత రెండున్నరేళ్లలో ఇదే అతిపెద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు.₹13,000 కోట్ల రోడ్డు అభివృద్ధి పనులతో తెలంగాణ ముఖచిత్రం మారిపోతుందని, రహదారి ప్రమాదాలు గణనీయంగా తగ్గడమే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. సభ విజయవంతానికి ఈ నెల 13న ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు 24 గంటల పాటు కృష్ణా జలాలను అందించేందుకు ₹125 కోట్లతో కొత్త వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు. దీనికి కూడా ముఖ్యమంత్రి పర్యటన రోజునే వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.నల్గొండ జిల్లాను తెలంగాణలోనే ఆదర్శ జిల్లాగా, నంబర్ వన్ జిల్లాగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.